RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:9 హైదరాబాద్, మంగళవారం, 17 జూన్ 2025 పేజీలు: 12 వెల: 1.00

## రైతన్నలూ.. డబ్బులు పడ్డాయ్.. బ్యాంక్ ఖాతాలు చెక్ చేసుకోండి..

హైదరాబాద్: రైతు భరోసా (నిధులను రేవంత్ ప్రభుత్వం ఇవాళ(సోమవారం) విడుదల చేసింది. రైతు నేస్తం వేదిక నుంచి




ఆన్‌లైన్ మీట నొక్కి రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేశారు. 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రైతును రాజుగా చేయడమే కాదు.. వ్యవసాయాన్ని పండుగ చేస్తామని ఉద్ఘాటించారు సీఎం రేవంత్‌రెడ్డి.

రైతు భరోసా వేయగానే విస్తృత ప్రచారం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఎన్ని కష్టాలు ఎదురవుతున్నా అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. 18 నెలల్లో రైతాంగం కోసం రూ.లక్ష కోట్లు కేటాయించామని చెప్పుకొచ్చారు. రుణమాఫీ చేయకుండా రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన మండిపడ్డారు.

గత కేసీఆర్ ప్రభుత్వం దిగజారిన ఆర్థిక వ్యవస్థను తమకు అందించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తమ ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. రుణమాఫీపై ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రైతుల పేరుతో నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. వరి సాగు వేస్తే ఉరి వేసుకోవాల్సిందేనని మాజీ సీఎం కేసీఆర్ గతంలో చెప్పారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పుడు రైతు పండించిన చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు గెలవాలంటే రైతన్నల ఆశీర్వాదం తప్పనిసరిగా ఉండాల్సిందేనని.. ఇందిరమ్మ రాజ్యంలో రైతులే రాజులని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

అన్నదాతల అందరి ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రైతు భరోసా డబ్బు మొత్తం జమ చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు పంట పండించే ప్రతి ఎకరాకు రైతు భరోసా వేస్తామని అన్నారు. రైతుల కోసం ప్రతి సంవత్సరం రూ. 70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్, వ్యవసాయానికి విడదీయరాని అనుబంధం ఉందని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్ల పంట పరిహారం గురించి ఎందుకు పట్టించుకోలేదని మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు.

%నేటి నుంచే రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా వేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎంత కష్టమైనా వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని అన్నారు. దేశంలో నంబర్‌వన్‌గా తెలంగాణ రైతులను నిలిపే బాధ్యతను రేవంత్ సర్కార్ తీసుకుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ఐఏఎస్ అరవింద్ కుమార్ ఎక్కడ. . కేటీఆర్‌పై ఎంపీ చామల ప్రశ్నల వర్షం

హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్‌పెభువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా వన్ రేసు కేసులో అరవింద్ కుమార్ కీలకమైన వ్యక్తి అని తెలిపారు. ఐఏఎస్ అరవింద్ కుమార్ ఎక్కడున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి ఉందని అన్నారు. అరవింద్ కొన్ని రోజులుగా కనపడటం లేదని




చెప్పారు. అసలాయన అరవింద్ లేడు కాబట్టి ఏం కాదని కేటీఆర్ అనుకుంటున్నారని చెప్పుకొచ్చారు. వీళ్ల అవసరాల కోసం, తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఏమైనా చేస్తారని ఆరోపించారు. గతంలో కేటీఆర్ మిత్రుడు కేదార్‌నాథ్ దుబాయ్‌లో చనిపోయారని గుర్తుచేశారు. కేటీఆర్ ప్లాన్‌తోనే ప్రభాకర్‌రావు అమెరికా వెళ్లి దాక్కున్నారని ఆరోపణలు చేశారు. ఇవాళ(సోమవారం) గాంధీభవన్‌లో మీడియాతో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.

సినీ హీరో మహేష్‌బాబును మాజీ మంత్రి కేటీఆర్ కాపీ కొడుతున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సెటైర్లు గుప్పించారు. భరత్ అనే నేను సినిమాలో మహేష్‌బాబు లాగా కేటీఆర్ ఫీల్ అవుతున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌వీ సినిమా డైలాగులేనని దెప్పిపొడిచారు. జైలుకెళ్తే సీఎం అవుతారనే ట్రెండ్‌ని కేటీఆర్ బలంగా నమ్ముతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత జైలుకి వెళ్లింది ఢిల్లీలో, తాను హైదరాబాద్‌లో జైలుకెళ్తే తానే సీఎం అవుతానని కేటీఆర్ తన సన్నిహితుల దగ్గర చెబుతున్నారని ఎద్దేవా చేశారు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.

కేటీఆర్ ఉద్యమకారుడు కాదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కేటీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు కాబట్టే విచారణ జరుగుతోందని అన్నారు. కేటీఆర్ అరెస్ట్ కావాలనే ఓవర్ యాక్టింగ్ చేస్తున్నారని చెప్పారు. కుట్రలు, కుతంత్రాలకు కేసీఆర్ కుటుంబం నిలయమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

## తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు..

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో ( నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డి, మురళినాయక్‌లు పిల్ దాఖలు చేశారు. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందంటూ ఎమ్మెల్యేలు పిల్ వేశారు. ఈ పిటీషన్‌పై సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ఖాజాగూడలోని సర్వే నెం.119, 122లో ఉన్న 27.18 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని న్యాయవాది కోర్టుకు వివరించారు.



సర్వే నెంబర్‌ని మార్చి పోరంబోకు భూమిని ఆక్రమించారని పిల్‌లో ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. 2023లో రంగారెడ్డి కలెక్టర్ నిరభ్యంతర పత్రం జారీ చేయడంతో జీహెచ్ఎంసీ భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందని న్యాయవాది తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలంలో 8 టవర్లలో ఒక్కో దాంట్లో 47 అంతస్థులు నిర్మిస్తున్నారని న్యాయవాది చెప్పారు. ఖాజాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉన్నాయని చిక్కుడు ప్రభాకర్ న్యాయస్థానానికి వివరించారు.

ఓ ప్రైవేట్ పాఠశాలకు 150మీటర్ల పరిధిలోనే రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేశారని న్యాయవాది తెలిపారు. దీనివల్ల పర్యావరణం కాలుష్యమై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకునేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని ఎమ్మెల్యేలు కోరారు. ఈ భూమికి సంబంధించి సీఎస్, ప్రతివాదులకు మరోసారి వినతిపత్రం ఇవ్వాలని పిటీషనర్లను సీజే ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది.

## ప్రధాని మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

: ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ ( ద్వీపదేశమైన సైప్రస్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. మోదీకి సైప్రస్ అత్యున్నత



పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3'ను ప్రదానం చేశారు. ఈసందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఇక్కడి ప్రభుత్వానికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవమన్నారు. రెండు దేశాల సంస్కృతి, సోదరభావం, వసుధైవ కుటుంబకం భావనకు ప్రతీక అని చెప్పారు. ఈ అవార్డును ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహానికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ గుర్తింపు ఇరుదేశాల శాంతిభద్రతలు, సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రత, శ్రేయస్సుపై పరస్పర నిబద్ధతను మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు. భారత్–సైప్రస్ మధ్య ఉన్న క్రియాశీల భాగస్వామ్యం భవిష్యత్తులో కొత్త శిఖరాలను చేరుకుంటుందని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు. ఇరుదేశాలు తమ దేశాల పురోగతిని బలోపేతం చేయడమే కాకుండా సురక్షితమైన, శాంతియుత వాతావరణాన్ని నిర్మించడానికి దోహదపడతాయన్నారు.

మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్నారు. ఆయనకు లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్‌కు వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. భారత్, సైప్రస్ సంబంధాల్లో గణనీయ ప్రగతికి ఈ పర్యటన దోహదం చేయనుందని.. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులపై మరింతగా కలిసి పనిచేసే అవకాశముంది అని మోదీ పేర్కొన్నారు. సైప్రస్ పర్యటన అనంతరం.. ప్రధాని మోదీ కెనడా వెళ్లి అక్కడ జరగనున్న జీ7 సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి క్రొయేషియా పర్యటనకు వెళ్తారు.

## మంత్రి పొంగులేటిపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సీరియస్





హైదరాబాద్: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలపై నిన్న(ఆదివారం) పొంగులేటి ప్రకటన చేశారు. ఈ విషయంలోనే పొంగులేటిపై పీసీసీ చీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రిజర్వేషన్ల అంశంతో ముడిపడిన ఎన్నికలపై పొంగులేటి ప్రకటనను టీపీసీసీ చీఫ్ తప్పుబట్టారు. కేబినెట్ అంశాలను ముందుగానే మీడియాతో మాట్లాడితే ఎలా అంటూ మండిపడ్డారు. ఒకరి మంత్రిత్వ శాఖపై మరొకరు మాట్లాడటమేంటని ప్రశ్నించారు. అధిష్టానంతో సంప్రదించకుండా ప్రకటనలు చేయొద్దని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు.

మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షిగా టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ రేపు(మంగళవారం) పోలీసులకు వాంగ్మూలం ఇవ్వనున్నారు. 2023 ఎన్నికల వేళ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేష్‌గౌడ్ పనిచేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాపింగ్ చేసిందని మహేష్‌గౌడ్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నెలాఖరులోపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిపారు. త్వరలో ఎన్నికల తేదీల ప్రకటన ఉంటుందని అన్నారు. సోమవారం జరిగే కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, అనంతరం సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు ఉంటాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే పొంగులేటి అధిష్టానాన్ని సంప్రదించకుండా స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలా మాట్లాడతారని టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ ప్రశ్నించారు. ఇప్పుడు ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

## భారీ పేలుడు.. ఐదుగురు మహిళలు మృతి, తొమ్మిది మందికి గాయాలు



ఉత్తర ప్రదేశ్‌లోని బాణసంచా కర్మాగారంలో ఈ(సోమవారం) మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో తొమ్మిది మంది మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరందరినీ హుటాహుటిన దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు. అటార్సి గ్రామంలోని టపాసుల తయారీ కేంద్రంలో ఈ పేలుడు సంభవించింది. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి అత్యవసర సేవలైన అగ్నిమాపక, అంబులెన్స్, పోలీసులు భారీగా చేరుకున్నారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు.

ఈ ఘటనపై రాజబ్‌పూర్ పోలీస్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ.. 'ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు అటార్సిలోని లైసెన్స్ పొందిన బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు, అంబులెన్స్, అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళా కార్మికులు మరణించారు. తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాం. మృతదేహాలకు పోస్ట్‌మార్టం జరుగుతోంది. పేలుడు వెనుక గల కారణాన్ని దర్యాప్తు చేస్తున్నాం' అని వెల్లడించారు.

# రోజాకు వార్నింగ్ బెల్స్ ఇక షోకు ప్యాక్ ప్

తిరుపతి, జూన్ 15,

మాజీ మంత్రి ఆర్కే రోజా మళ్లీ రాజకీయంగా యాక్టివ్ అయ్యారు. నగరిలోనే కాకుండా ఆమె కూటమి ప్రభుత్వంపై పెద్దయెత్తున విమర్శలు చేస్తున్నారు. దీంతో ఆర్కే రోజాపై ఇప్పటికే నమోదయిన కేసులను పోలీసులు వేగంగా పరిశీలిస్తున్నారని సమాచారం. టీడీపీ నుంచి వైసీపీలోకి వచ్చిన ఆర్కే రోజా నగరి నియోజకవర్గంలో రెండు సార్లు విజయం సాధించారు. మూడోసారి మాత్రం 2024 ఎన్నికల్లో గాలి భాను ప్రకాష్ చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత కొద్ది రోజులు రోజా మౌనంగానే ఉన్నారు. ఈ మధ్య కొన్ని బుల్లి తెర షోలలో కూడా ఆర్కే రోజా పాల్గొంటున్నారు. ఇదే సమయంలో వైసీపీకి వాయిస్ గా మారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లపై విమర్శలు చేస్తున్నారు. దీంతో ఆర్కే రోజా టీడీపీ హిట్ లిస్ట్ లో చేరిపోయారంటున్నారు.రోజా చేస్తున్న వ్యాఖ్యల పట్ల కూటమి సర్కార్ సీరియస్ గానే ఉందని తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే ఆర్కే రోజాపై నమోదయిన కేసులను పరిశీలించాలని పోలీసులకు ఆదేశాలు పాలకుల నుంచి వెళ్లినట్లు తెలిసింది. మహిళ అయినంత మాత్రాన అవినీతి చేస్తే ఊరుకోవద్దని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టమైన



ఆదేశాలు వెళ్లడంతో ప్రస్తుతం ఆర్కే రోజా చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు తెలిసింది. అందిన సమాచారం మేరకు ఆమెపై నమోదయిన కేసులను పరిశీలించి నోటీసులు ఇచ్చి విచారణకు కూడా పిలిచేందుకు పోలీసు అధికారులు సిద్ధమవుతున్నారని విశ్వసనీయంగా తెలుస్తోంది. ఆర్కే రోజా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తొలి రెండున్నరేళ్లు ఏపీఐఐసీ కార్పొరేషన్ ఛైర్మన్ గా పనిచేసి తర్వాత టూరిజం, క్రీడల శాఖ మంత్రిగా పదవి బాద్యతలను చేపట్టారు. కార్పొరేషన్ ఛైర్మన్ గా ఆమె తీసుకున్న నిర్ణయాలు వివాదాలుగా ఉన్నాయని చెబుతున్నారు. అదే సమయంలో మంత్రిగా ఉన్న సమయంలో ఆడుదాం ఆంధ్ర పేరిట వైసీపీ ప్రభుత్వ హయంలో రాష్ట్రమంతటా క్రీడా సంబరాలను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భారీగా నిధులు దుర్వినియోగం అయ్యాయని టీడీపీ నేతలు ఆరోపించారు. ఆడుదాం ఆంధ్రపేరిట వంద కోట్ల రూపాయల స్కామ్ జరిగిందని టీడీపీ నేతుల సీఐడీ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారుకూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే పాత్యా సంఘం, కబడ్డీ అసోసియేషన్ లు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సీఐడీకి ఫిర్యాదు చేశాయి. వంద కోట్ల రూపాయల స్కాం జరిగిందని వారు ఆరోపించారు. ఆర్కే రోజా పై కేవలం ఇదే కాకుండా తిరుమలలో దర్శనం టిక్కెట్ల విషయంపై కూడా ఫిర్యాదులు చేసే అవకాశాలున్నాయి. ఆడుదాం ఆంధ్ర కేసులో బైరెడ్డి సిద్ధార్ధరెడ్డి పేరు కూడా వినపడింది. పెద్దయెత్తున అవినీతి జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో సీఐడీ అధికారులు ఫైలు దుమ్ము దులుపుతున్నారని తెలిసింది. రెచ్చిపోతున్న రోజాను అడ్డుకట్ట వేయడానికి కేసు నమోదు చేసి విచారించడం మినహా మరొక మార్గం లేదని భావించి ఆ దిశగా చర్యలకు దిగుతున్నట్లు తెలిసింది. మరి ఆర్కే రోజా కేసులను తట్టుకుని ఎలా బయటపడతారన్నది చూడాల్సిందే.

# 20నే విశాఖకు మోడీ..

విశాఖపట్టణం, జూన్ 15,

మోదీ విశాఖకు రానున్నారు. జూన్ 21వ తేదీన జరిగే యోగా వేడుకల్లో పాల్గొనేందుకు ఈనెల 20న విశాఖకు చేరుకుంటారు. ఆ రోజు విశాఖలోనే బస చేస్తారు. మరునాడు ఆర్కే బీచ్‌లో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఢిల్లీకి తిరుగు పయనమవుతారుప్రధానమంత్రి మోదీ విశాఖలో పర్యటించనున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా? జూన్ 21న యోగా కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఇందుకోసం జూన్ 20వ తేదీన విశాఖకు చేరుకోనున్నారు.జూన్ 20వ తేదీన భువనేశ్వర్ నుంచి విశాఖ చేరుకోనున్న ప్రధాని మోదీ? ఆ రోజు రాత్రి తూర్పు నౌకాదళ అతిథిగృహంలో బస చేయనున్నారు. మరునాడు ఉదయం 6.30 నుంచి 7.45 వరకు విశాఖలోని ఆర్కే బీచ్ లో జరిగే యోగా డేలో పాల్గొననున్నారు. రాష్ట్ర సీఎం చంద్రబాబు కూడా ఈ ఈవెంట్ లో భాగమవుతారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాని మోదీ తిరిగి ఢిల్లీకి వెళ్తారు.జూన్ 21 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజును భారీ స్థాయిలో యోగా కార్యక్రమాలను చేపట్టనుంది. ఒక్క విశాఖలోనే ఒకే రోజు 5 లక్షల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్కే బీచ్ లో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటు సీఎం చంద్రబాబు, పలువురు మంత్రులు పాల్గొంటారు.మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఉంది. 25 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు అందజేయాలని భావిస్తోంది. ఇదే విషయాన్ని తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా



యోగా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారు. విశాఖపట్నంలోని ఆర్‌కె బీచ్ నుండి భీమిలి బీచ్ వరకు జరిగే యోగా ప్రదర్శనలో భారీ ఎత్తున ప్రజలు భాగస్వాములవుతారని అధికారులు భావిస్తున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగమయ్యేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎనీఐజీనిటప్త్రీజీ.జీజూ.ఐనీల.తిని వెబ్ సైట్ లోకి వెళ్లి ప్రాసెస్ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగా ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఒకేసారి 5 లక్షల మంది యోగా చేయడానికి వీలుగా? వేదికను సిద్ధం చేస్తున్నారు. ఉదయం 6:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనేక ప్రముఖ యోగా గురువులు, యోగా అభ్యాసకులు వస్తారు. దీనితో పాటు 1000 యోగా పార్కులు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. యోగా దినోత్సవం సందర్భంగా 45 నిమిషాల ప్రోటోకాల్‌లో దాదాపు 20 ఆసనాలు ప్రధానమంత్రి చేస్తారు. ఇవి మొదటిసారి యోగా చేసేవారు కూడా సులభంగా చేయగలిగే ఆసనాలుఈ కార్యక్రమంపై కేంద్ర మంత్రి ప్రతాప్ రావు జాధవ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసారి యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రధాన కార్యక్రమం ఈసారి విశాఖపట్నంలో జరుగుతుంది. 5 లక్షల మందికిపైగా పాల్గొంటారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అనేక దేశాల ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

# తోతాపురి మామిడి పంచాయితీ...

తిరుపతి, జూన్ 15,

తోతాపురి ' మామిడి పండు.. 'హ' షేపులో ఆకర్షణీయంగా ఉండే ఈ రకం మామిడిని "కలెక్టర్ మామిడి " అని ఆంధ్రా ప్రాతంలో పిలుస్తారు. నార్త్‌లో బాగా ఫేమస్ అయిన ఈ పండు ఏపీలో రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరులో ఎక్కువగా సాగులో ఉంది. ఆంధ్రా ప్రాంతంలో దీన్ని పెద్దగా తినరు. అక్కడ ఎక్కువగా బంగినపల్లి, రసాలు, పంచదార కల్తీ, పండూరు రకాలకు డిమాండ్. అయితే "కలెక్టర్ కాయ' రకం మామిడిని మ్యాంగో పల్ప్ (గుజ్జు ) తయారు చేయడంలో ఎక్కువగా వాడతారు. ఎక్కువకాలం నిలువ ఉండడంతపాటు గుజ్జు ఎక్కువగా ఉండడంతో 'తోతాపురి "ని ప్రాసెస్ చేసి ఎక్స్పోర్ట్ చేస్తూ ఉంటారు. అయితే ఇప్పుడు ఈ "తోతాపురి" మామిడి ఏకంగా మూడు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టింది. ఆంధ్రా, కర్ణాటకతోపాటు తమిళనాడు మామిడి రైతులు, ప్రాసెసింగ్ వ్యాపారుల మధ్య ఇది వివాదం రేపింది. చివరకు ఇతర రాష్ట్రాల నుంచి ఏపీకి " తోతాపురి " మామిడి దిగుమతులను అధికారుల నిషేదించడంతో ఇది ప్రభుత్వాల స్థాయిలో వివాదం రేపే స్థాయికి చేరిపోయింది.ఏపీలోని కృష్ణా జిల్లాతో సమానంగా మామిడి సాగులో పోటీ పడేది చిత్తూరు జిల్లా. చిత్తూరు జిల్లాలో మామిడి గుజ్జు తీసి ఎగుమతి చేసే పరిశ్రమలు 47 ఉన్నాయి. వీటిలో చాలా వరకూ 2014-19 మధ్య కాలంలో తెరిచినవే. ఈ సీజన్‌లో వాటిలో 16 పరిశ్రమలను ఓపెన్ చేసి మామిడి గుజ్జు తయారుచేస్తున్నారు. దీనికోసం జిల్లా రైతుల నుంచి మామిడి పళ్ళను సేకరించడం మొదలు పెట్టారు. అయితే రైతులు కేజీ "తోతాపురి' మామిడి పళ్లకి కనీసం 12 రూపాయల మద్దతు ధర డిమాండ్ డిమాండ్ చేయడంతో ప్రభుత్వం వారికి పరిశ్రమలు 8 రూపాయలు ప్రభుత్వం తరపున 4 రూపాయలు కలిపి 12 రూపాయలు అందేలా నిర్ణయం తీసుకుంది. దీనిపై మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు అడ్డు చెప్పారు. ఓపెన్ మార్కెట్ లో "తోతా పురి " మామిడి రేటు కేజీ 5 రూపాయల కంటే ఎక్కువ లేదు. అలాంటప్పుడు తాము 8 రూపాయల చొప్పున ఎందుకు ఇవ్వాలనేది వారి అభ్యంతరం. పైపెచ్చు ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉండే "గుడిపాల " మండలం ద్వారా ఏపీలోకి పక్క రాష్ట్రాల రైతులు తమ మామిడిపండ్లను తక్కువ రేటుకే చిత్తూరులోని పరిశ్రమలకు



తరలిస్తున్నారు. దీనికి చిత్తూరు జిల్లా మామిడి రైతులు అడ్డు చెప్పడంతో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా లోని పరిశ్రమ లు వేరే రాష్ట్రాల నుంచి మామిడి కొనకుండా పరిశ్రమలను ఆదేశించారు. పైగా షిఫ్టింగ్ పద్దతిలో పరిశ్రమల వద్ద ఉద్యోగులకు డ్యూటీ లు వేసి మామిడి పళ్ళని అమ్మడానికి వచ్చే రైతుల ఆధార్ కార్డులు, పాస్ బుక్ జిరాక్స్ లు, ఈ క్రాప్ బుకింగ్ వివరాలు, రాయితీ నమోదు వివరాలు చెక్ చేస్తున్నారు. స్థానిక రైతుల మంచి కోసమే ఈ ఆంక్షలు తెచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.అయితే ఈ పరిణామంపై పక్క రాష్ట్రాలైన తమిళనాడు కర్ణాటక అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఈ నిర్ణయంపై మరోసారి ఆలోచించాలని ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఇతర జిల్లాల్లో లేని ఆంక్షలు ఒక్క చిత్తూరులోని ఎందుకు అని ఆయన లేఖలో అడిగారు. ఇక కర్ణాటక చీఫ్ సెక్రటరీ శాలిని రాజనీష్ కూడా ఏపీ చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తూ నిర్ణయం " చిరకాల సెంటిమెంట్" లను దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నట్టు తెలుస్తోంది. కోలార్ లోని మూడు గుజ్జు పరిశ్రమలు, తుముకూరు దగ్గర మరో పరిశ్రమ తెరవని కారణం వల్లనే వారు చిత్తూరు జిల్లాలోని గుజ్జు పరిశ్రమలకు తమ మామిడిపళ్ళను పంపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు చిత్తూరు జిల్లాలో అలా పక్క రాష్ట్రం నుంచి వచ్చే మామిడిపండ్లపై బ్యాన్ విధించడం తో అక్కడ వివాదం రాజుకుంది. ఏషియాలోనే అతిపెద్ద టమాట మార్కెట్ లు తమిళనాడులోని కోయంబేడు, చిత్తూరులోని మదనపల్లి, కర్ణాటకలోని కోలార్ లలో ఉన్నాయి. ఇప్పుడు ఇలా పక్క రాష్ట్రం నుంచి వచ్చే మామిడి పళ్ళపై చిత్తూరు జిల్లాలో బ్యాన్ విధిస్తే రేపు దీని ప్రభావం జిల్లాలోని టమాట రైతులపై పడే ప్రభావం ఉందని వ్యాపారులు గుర్తు చేస్తున్నారు. మరి ఈ వివాదం రానున్న రోజుల్లో మరెన్ని పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

=================

## ఇరాన్,ఇజ్రాయిల్ వార్..... ఏం జరుగుతోంది

ఇరాన్‌పై దాడులకు ఆ దేశ అణు కార్యక్రమాలే కారణమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. అవి తమ దేశ మనుగడకు ముప్పు అని తెలిపారు. కానీ దీని వెనుక ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడమనే విస్తృత లక్ష్యం కూడా ఉన్నట్టుంది. ఈ దాడుల వల్ల ఉత్పన్నమయ్యే వరుస పరిణామాలు ప్రజలలో అశాంతిని రేకెత్తించి ఇరాన్ పాలకుల పతనానికి దారితీస్తాయని ఆయన ఆశిస్తున్నారు. ఇరాన్ ప్రజలు కలిసి రావాల్సిన సమయం ఆసన్నమైంది, మీ గర్వించదగ్గ చరిత్రను తలుచుకొని, ఈ క్రూరమైన, కఠినమైన ప్రభుత్వం నుంచి స్వేచ్ఛ కోసం పోరాడాలి'' అని పిలుపునిచ్చారు. ఇరాన్ ఆర్థిక దుస్థితి,భావప్రకటన స్వేచ్ఛ కొరవడటం, మహిళలు, మైనారిటీ వర్గాల హక్కులను పరిమితం చేయడంపై చాలామంది ఇరాన్ ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. ఇజ్రాయెల్ దాడి ఇరాన్ నాయకత్వానికి నిజమైన ముప్పుగా పరిణమిస్తోంది. ఈ దాడుల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్, ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, ఐఆర్‌జీసీ సీనియర్ అధికారులు మరణించారు. అయితే, ఇజ్రాయెల్ దాడులు ఇంకా ముగియలేదు. ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలు, లక్ష్యాలపై దాడి చేసినట్లు రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. ఇరుదేశాలు దాడులకు దిగడంతో , పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరాన్ క్షిపణి దాడుల తర్వాత, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు "మరికొన్ని దాడులు చేస్తాం'' అని హెచ్చరించారు. ఇరాన్‌లోని కొందరు నాయకులను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోవచ్చు. ఈ దాడులు ఇరాన్ ప్రభుత్వాన్ని కదిలించి, ప్రజలు పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలని ఇజ్రాయెల్ ఆశిస్తూ ఉండవచ్చు. నెతన్యాహు కోరుకుంటున్నది ఇదే.కానీ ఇదొక జూదం - చాలా పెద్దది. ఎందుకంటే, అటువంటిది జరుగుతుందని స్పష్టమైన సంకేతం లేదు. నిరసనలు ప్రారంభమైనప్పటికీ, ఇదంతా ఎక్కడికి వెళుతుందో తెలియదు. ఇరాన్‌లో సైన్యాన్ని, ఆర్థిక వ్యవస్థను నియంత్రించే వారి చేతుల్లోనే నిజమైన అధికారం ఉంది. ఇందులో ఎక్కువగా ఐఆర్‌జీసీకి చెందిన వారు, ఇతర ఎన్నిక కాని గ్రూపుల వారున్నారు. వారు ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవలసిన అవసరం లేదు, ఎందుకంటే, అది ఇప్పటికే వారి చేతుల్లో ఉంది. వారు మరింత దూకుడుగా స్పందించవచ్చు. ప్రస్తుత సంక్షోభానికి మరొక ఫలితం ఏమిటంటే, ఇరాన్ ప్రభుత్వం కూలిపోయి, దేశాన్ని గందరగోళంలో పడేయవచ్చు. ఇరాన్‌లో దాదాపు 9 కోట్ల జనాభా ఉంది, కాబట్టి ఇక్కడి విషయాలు మిడిల్ ఈస్ట్ అంతటా ప్రభావాన్ని చూపవచ్చు. ఇరాన్‌లో తిరుగుబాటు వచ్చి, కొత్త, స్నేహపూర్వక ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఇజ్రాయెల్ ఆశిస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ పెద్ద ప్రశ్న ఏమిటంటే - ఎవరు అధికారం చేపడతారు?. ఇటీవలి సంవత్సరాలలో ఇరాన్ ప్రతిపక్షాలు విడిపోయాయి. 2022లో "స్త్రీ జీవితం, స్వేచ్ఛ" పేరుతో సాగిన ఉద్యమంలోని నిరసనలు ఇరాన్‌ను కుదిపేశాయి. దీంతో ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యతిరేక గ్రూపులను, వ్యతిరేక గళాలను ఏకం చేయడానికి కొంతమంది ప్రతిపక్ష నాయకులు ప్రయత్నించారు. అయితే, వారి ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఉద్యమానికి ఎవరు నాయకత్వం వహించాలి? ప్రస్తుత ప్రభుత్వాన్ని ఏ విధమైన వ్యవస్థ ద్వారా భర్తీ చేయాలి? అనే దానిపై వారిలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇరాన్‌ను నడిపించడానికి అక్కడి కొన్ని ప్రతిపక్ష గ్రూపులను లేదా వ్యక్తులను ఇజ్రాయెల్ ప్రత్యామ్నాయాలుగా చూడవచ్చు. ఇరాన్ మాజీ క్రౌన్ ప్రిన్స్ రెజా పహ్లావి ఇందుకు ఒక ఉదాహరణ. 1979 ఇస్లామిక్ విప్లవం సమయంలో ఆయన తండ్రి షాను అధికారం నుంచి తొలగించారు. రెజా పహ్లావి ప్రస్తుతం ఇరాన్ బయట నివసిస్తున్నారు. ఇతర దేశాల మద్దతు కోసం ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాలలో రెజా ఇజ్రాయెల్‌ను కూడా సందర్శించారు .కొంతమంది ఇరానియన్లు రెజాకు మద్దతు ఇస్తున్నప్పటికీ, అది ఇరాన్ ప్రభుత్వంలో త్వరగా మార్పు తీసుకురావడానికి తగినంత బలంగా ఉందో లేదో స్పష్టంగా లేదు. ఇరాన్‌ను నడిపించడానికి అక్కడి కొన్ని ప్రతిపక్ష గ్రూపులను లేదా వ్యక్తులను ఇజ్రాయెల్ ప్రత్యామ్నాయాలుగా చూడవచ్చు. బహిష్కరణకు గురై, ప్రవాసంలో ఉంటున్న ముజాహిదీన్-ఇ ఖల్క్ (ఎంఈకే) అనే ఒక ప్రతిపక్ష గ్రూపు కూడా ఉంది. వారు ఇరాన్ ఇస్లామిక్ ప్రభుత్వాన్ని దించాలని కోరుకుంటున్నారు కానీ, రాచరిక పాలనను వ్యతిరేకిస్తున్నారు. ఎంఈకే ఒక వామపక్ష ముస్లిం గ్రూపుగా ప్రారంభమైంది, ఇరాన్ మాజీ రాజు (షా)ను తీవ్రంగా వ్యతిరేకించింది. 1979 విప్లవం తర్వాత ఈ గ్రూపు ఇరాక్‌కు వెళ్లింది, 1980లలో జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధంలో సద్దాం హుస్సేన్ పక్షాన నిలిచింది. ఈ నిర్ణయం వల్ల చాలామంది ఇరానియన్లు ఎంఈకే గ్రూపును వ్యతిరేకించారు. ఎంఈకే ఇప్పటికీ చురుకుగా ఉంది. అమెరికాలో ముఖ్యంగా డోనల్డ్ ట్రంప్‌కు దగ్గరగా ఉన్న కొందరితో స్నేహం ఉంది. ట్రంప్ మొదటి పదవీకాలంలో మైక్ పాంపియో, జాన్ బోల్టన్, రూడీ గియులియాని వంటి సీనియర్ యూఎస్ అధికారులు ఎంఈకే కార్యక్రమాలలో ప్రసంగించారు. అయితే, ఈ గ్రూపుకు ఇప్పుడు వైట్‌హౌస్‌లో తక్కువ ప్రభావం ఉన్నట్లు కనిపిస్తోంది. కొన్నిపార్టీలు లౌకిక ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటుండగా, మరికొన్ని పార్లమెంటరీ రాచరికానికి మద్దతు ఇస్తున్నాయి. ఇక, జూన్ 13 దాడులపై ఇప్పుడే ఓ అంచనాకు రాలేం. గత సంవత్సరం కూడా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పోరాటం జరిగింది. దాన్ని ప్రభుత్వాన్ని దించడానికి ఒక అవకాశంగా ఇరానియన్లు భావించినట్లు బలమైన సంకేతాలు కనిపించలేదు. ఇజ్రాయెల్‌లోని అనేక లక్ష్యాలను ఇరాన్ ఛేదించినప్పటికీ, దానికి అంత మంచి అవకాశాలు ఉన్నట్లు అనిపించడం లేదు.

## మహిళలపై అత్యాచారలపై పవన్ స్పందించడంలేదు ఆర్. కే. రోజా,

తిరుపతి

సుపరిపాలన కాదు. సూపర్ సిక్స్ కు ఎగనామం పెట్టిన పాలన. సుపరిపాలన. లక్ష అరవై వేల కోట్లిఅప్పు చేయడం సుపరిపాలన అంటారా అని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. అక్ష ఎనభై 80వేల కోట్లు ఎగనామం పెట్టడం సుపరిపాలన. సందు సందుకు మందుబాబులు తయారీ చేయడం, బెల్ట్ షాపులు. సి.బి. ఎన్ అంటే సి. చీటింగ్ బి అంటే బాదుడే బాదుడు ఎన్ అంటే నేరాలు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు బాదుడు, విద్యుత్ ఛార్జీలు బాదుడే బాదుడు. గత పాలన కంటే సంక్షేమం అందిస్తాము అని చెప్పి మోసం చేశారు. ఎల్లో బుక్ మానిఫెస్టో పక్కన పెట్టేశారు, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. ఈరోజు ముఖ్యమంత్రి నిస్సిగ్గుగా అబద్ధం చెబుతున్నాడు. సూపర్ సిక్స్ అన్ని అమలు చేసేశాం అంటున్నారు.. నాలుక మందం అంటున్నారు. గుండెల్లో ప్రేమ అభిమానం తో పొదిలి సభకు తరలి వచ్చారు. అమ్మకు ఒడి సృష్టికర్త జగన్ మోహన్ రెడ్డి. ఆరోజు అమ్మఒడి మీరు ఎగతాళి చేశారు.. మీరు ఇప్పుడు ఇస్తున్నారు. ఒక్క బాత్ రూం కూడా కట్టించక కుండా ఒక్కొక్కరి దగ్గర రెండు నొక్కేశారు. పదో తరగతి పరీక్ష పేపర్లు కూడా దిద్దడం మీకు చేతకాదని అన్నారు.

లోకేషా....జోకేషా అని ప్రజలు నవ్వుకుంటున్నారు. మహిళలు పై అత్యాచారాలు జరుగుతుంటే పవన్ కళ్యాణ్ స్పంది స్పందించడం లేదు. ఎమ్మెల్యే అయ్యాను, డిప్యూటి సీఎం అయ్యను అని ఒక మూలాన కూర్చున్నారు పవన్ కళ్యాణ్. మీ ప్రభుత్వానికి హానీ మూన్ టైం అయిపోయింది.. మీకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యింది. రెడ్ బుక్ రాజ్యాంగం పక్కన పెట్టండి. మామిడి రైతులు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చంద్రబాబు చూసి సిగ్గు పడుతున్నారు. మ్యాంగో రైతులు కు కిలోకు 4 రూపాయలు కొనుగోలు చేస్తున్నారు, వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో 43 రూపాయలు కొన్నారు. రైతుల్లో కూడా క్యాస్ట్ ను చూసి మీపాలన చేస్తున్నారు.. సనాతన యోగి ఏమై పోయాడు అర్ధం కావడం లేదు. దేవాలయాలు ధ్వంసం. చేసి, స్థలాలు కబ్జా చేసే స్తాయికి పెరిగి పోయాయి. టిడిపి పార్టీ కూసాలు కదిలేలా ప్రజలు పక్షాన పోరాటాలు చేస్తామని అన్నారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుపతి

తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం వారికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.వీఐపీ ప్రారంభ దర్శనంలో శ్రీవారిని తెలుగు సినీ నటుడు సుమన్, షష్టిపూర్తి మూవీ టీమ్ , తెలంగాణ హైకోర్టు జడ్జి మధుసూదన్ రావు,ఒరిస్సా హైకోర్టు చీఫ్ జస్టిస్ హరీష్ తండాన్ ,మంత్రి అచ్చం నాయుడు,తెలంగాణ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి తెలంగాణ ఎమ్మెల్యే ప్రియాంక రెడ్డి దర్శించుకున్నారు.దర్శనానంతరం వారికి ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు..

## వెంకన్నను దర్శించుకున్న రోజా, మీనా, ఇంద్రజ

తిరుమల

తిరుమల శ్రీవారినీ సీనియర్ హీరోయిన్లు దర్శించుకున్నారు.. మాజీ మంత్రి రోజాతో పాటు, మీనా, ఇంద్రజ తదితరులు కలిసి ఈరోజు ఉదయం నైవేద్యం సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు.. దర్శనం అనంతరం వారికి ఆలయంలోని రంగనాయకుల మండపంలో అధికారులు తీర్థప్రసాదాలు అందజేయగా పండితుల ఆశీర్వచనాలు అందజేశారు.. శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని ఆలయం వెలుపల వెల్లడించారు..

## శ్రీవారిని దర్శించుకున్నకేంద్ర రాష్ట్ర మంత్రులు

తిరుమలతిరుమల శ్రీవారిని కేంద్రమంత్రి పియూష్ గోయల్ సోమవారం దర్శించుకున్నారు.. కేంద్ర మంత్రి తో పాటు ఏపీ మంత్రులు, అనగానే సత్యప్రసాద్, టీజీ భరత్ తదితరులు శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈరోజు ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయానికి వచ్చిన కేంద్ర రాష్ట్ర మంత్రులకు టిటిడి చైర్మన్, అధికారులు స్వాగతం పలికి దర్శన్ ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో అధికారులు తీర్ధ ప్రసాదాలు అందజేయగా పండితులు ఆశీర్వచనాలు అందజేశారు..

# నాగాలమ్మ గుడి కూల్చివేతపై రచ్చ...

తిరుపతి, జూన్ 16,

:ప్రజల సెంటిమెంట్ పై కొడితే రియాక్షన్ ఎలా ఉంటుందో చూపించారు. తాము భక్తితో కొలిచే ఆలయాన్ని తొలగించే ప్రయత్నం చేయగా ఓ టిడిపి నేతతో పాటు ఆయన అనుచరులను గ్రామస్తులు చితక్కొట్టారు. వెంటాడి, వెంబడించి మరి దాడి చేశారు. చివరకు పోలీసులు వచ్చి వారిని రక్షించాల్సిన పరిస్థితి వచ్చింది. భూ వివాదం నేపథ్యంలోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. తిరుపతిలో జరిగిన ఈ ఘటనపై సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం నడుస్తోంది. అందుకు సంబంధించి వీడియోలు వైరల్ అవుతున్నాయి.తిరుపతి రూరల్(మండలం దామినేడులో ఓ స్థలం విషయంలో వివాదం నడుస్తోంది. దీనిపై స్థానిక టిడిపి నేత కృష్ణమూర్తి నాయుడు కు గ్రామస్తులతో పంచాయితీ నడుస్తున్నట్లు సమాచారం. అయితే కృష్ణమూర్తి నాయుడు తో పాటు ఆయన అనుచరులు ఒక్కసారిగా వచ్చి ఆ స్థలంలో ఉన్న ఆలయాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన గ్రామస్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ కృష్ణమూర్తి వర్గం తిరగబడడంతో ఒక్కసారిగా గ్రామస్తులు సైతం మూకుమ్మడి దాడి చేశారు. ఇరు వర్గాల మధ్య కర్రలు, రాళ్లతో పరస్పర దాడులు జరిగాయి. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గ్రామస్తులను అడ్డుకున్నారు. కృష్ణమూర్తి నాయుడుతో పాటు ఆయన అనుచరులను తిరుచానూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. గత కొద్దిరోజులుగా ఈ స్థలం వివాదం నలుగుతోంది. ఈ తరుణంలోనే ఈ ఘటన జరిగినట్లు సమాచారం.మరోవైపు ఈ ఘటనపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విపరీతంగా ప్రచారం చేస్తోంది. తెలుగుదేశం కూటమి హయాంలో జరుగుతున్న అరాచకం అంటూ ఈ వీడియోను సర్క్యూలేట్ చేస్తోంది. దీంతో ఇది వైరల్ అంశం గా మారిపోయింది. అయితే టిడిపి శ్రేణులు దీనిని తప్పుపడుతున్నాయి. భూ వివాదాన్ని తీసుకొచ్చి రాజకీయం చేస్తున్నారని మండిపడుతున్నాయి. కాగా టిడిపి నేతల ఆదేశాలతో కృష్ణమూర్తి నాయుడుతో పాటు ఆయన అనుచరులపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలు

రామగుండం : జూన్ 16,

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ సంవత్సరము బి ఏ / బీకాం / బిఎస్సి పరీక్షలు నిర్వహించబడునని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్, జై కిసాన్ ఓజో, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ జి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. 6 వ సెమిస్టర్ పరీక్షల తేదీ ఈనెల 20వ తేదీ నుండి 25 వరకు

నిర్వహించబడును. 4వ సెమిస్టర్ ఈనెల26 నుండి 2 జులై వరకు నిర్వహించబడునని. 2 వ సెమిస్టర్ పరీక్షలు 4 జూలై 11 వరకు నిర్వహించబడునని పరీక్షల సమయము మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడిన తెలిపారు..

# అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు - పులిహోర తిని 14 మందికి అస్వస్థత

పాడేరు జూన్ 16,

కలుషిత ఆహారం తిని 14 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన అల్లూరి జిల్లా పాడేరులో జరిగింది.వివరాల్లోకి వెళ్తే అనకాపల్లి జిల్లాలోని నాతవరం చెందిన 20 మంది భక్తులు పాడేరులో ఉన్న అమ్మవారి దర్శనం కోసం వచ్చారు. ఇంటి వద్ద తయారు చేసిన పులిహోర తినడంతో అస్వస్థతకు గురయ్యారు. హుటాహుటిన పాడేరు ఆసుపత్రిలో జాయిన్ అయ్యారు. వీరందరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ వార్షిక కళ్యానోత్సవం పై సమీక్ష పాల్గోన్న మంత్రి పొన్నం

హైదరాబాద్

బల్కంపేట శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం లో శ్రీ ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవం - 2025 పై అధికారులతో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.



సమావేశంలో జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ,జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన , స్థానిక కార్పొరేటర్ కేతినేని సరళ , అన్ని డిపార్టెంట్ల అధికారులు పాల్గోన్నారు.

జూలై 1 వ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం సందర్భంగా భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లు,భద్రత ,బారికేడ్లు, క్యూలైన్ లు ,గత సంవత్సరం ఏర్పడిన ఇబ్బందులు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు,మంచి నీటి సౌకర్యం తదితర అంశాల పై సమీక్షా సమావేశం జరిగింది.

# కుప్పడం పట్టుకు జాతీయ అవార్డు

గుంటూరు, జూన్ 15

బాపట్ల జిల్లాలోని చీరాలకు ప్రత్యేకమైన. "కుప్పడం పట్టు చీరల'కు జాతీయ అవార్డు లభించింది. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఒడిఒపి)కింద కుప్పడం పట్టు చీరకు జాతీయ అవార్డును ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. జులై నెల 14వ తేదీన న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరుగునుందని ఆ ఉత్తర్వులలో పేర్కొంది. చీరాల కుప్పడం పట్టు చీరకు ప్రకటించిన జాతీయ అవార్డును బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిఅందుకోనున్నారుసంప్రదాయ మగ్గాలపై నేతన్నలు నేసిన చీరాల కుప్పడం చీరలకు మార్కెట్లో ఇప్పటికే కొంత డిమాండ్ ఉంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా జాతీయ అవార్డు ప్రకటించడంతో మరింత ప్రాచుర్యం పొందనుంది. దీంతో చేనేతల కష్టం ఇక ఫలించనుంది. జాతీయ మార్కెట్ లోనూ కుప్పడం చీరలు ప్రత్యేకతను సంతరించుకోనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో చీరాల పట్టు వస్త్రాల వ్యాపారుల్లో ఆనందం నెలకొంది.చీరాలలో మాత్రమే దొరికే కుప్పడం పట్టు వస్త్రాలకు తనదైన ప్రత్యేకత ఉంది. వీటిని మగ్గాలపై మాత్రమే నేస్తారు. ఎంతో నాణ్యతగా కలర్ ఫుల్ గా ఉండే కుప్పడం పట్టు చీరలు లైట్ వెయిట్ గా ఉంటాయి. అందుకే వీటిని ధరించడానికి మహిళలు ఉత్సాహపడుతుంటారు. అయితే రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఉండే ఉప్పాడ, ధర్మవరం లాంటి పట్టు వస్త్రాలతో పోలిస్తే కుప్పడం పట్టుకు ఇంతవరకు పాపులర్ కి అంతగా లభించలేదు. దానికోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేకమైన చర్యలు చేపట్టారు. జనవరి 9న జరిగిన కేంద్ర బృంద పర్యటనలో ప్రత్యేకంగా కొప్పడం పట్టు వస్త్రాలతో ఒక చిన్న సైజు ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్లో జరిగిన ఈ కార్యక్రమంలో కుప్పడం పట్టు వ్యాపారస్తులు రకరకాల చీరలను ప్రదర్శించారు. కుప్పడం పట్టు క్వాలిటీ స్పెషాలిటీలతో సంతృప్తి చెందిన కేంద్ర బృందం ఇప్పుడు జాతీయ అవార్డుకు కుప్పం పట్టును సిఫార్సు చేసింది. దేశ వ్యాప్తంగా కుప్పడం పట్టు పాపులారిటీకి ఈ అవార్డు దోహదపడుతుందని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆనందం వ్యక్తం చేశారు.

# అందుబాటులోకి మిర్చి విత్తనాలు

గుంటూరు, జూన్ 15,

ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ లాం ఫారంలో జూన్ నెల 16 వ తేది (సోమవారం) నుంచి ఎల్.సి ఎ?625, ఎల్.సి ఎ?657, ఎల్.సి.ఎ-643 మిరప రకాల ఫౌండేషన్ విత్తనం అమ్మనున్నట్లు ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్. సి. వెంకట రమణ తెలియజేశారు. ఎల్. సి ఎ?643 రకం: పచ్చిమిర్చికి, ఎండు మిర్చికి అనువైన రకము. కాయలు లేత ఆకుపచ్చ రంగులో పొడవుగా (13-14 సెం.మీ) ఆకర్షణీయంగా ఉంటాయి. కాయలు ఎండిన తరువాత కొంచెం ముడత కలిగి ఆకర్షణీయమైన ఎరుపు రంగు కలిగి, బ్యాడగి రకం వలె ఉంటాయి. బాగా బెట్టను తట్టుకొంటుంది, కొంతవరకు జెమిని వైరస్ ను కూడా తట్టుకొంటుంది. అంతే కాక నల్లతామర పురుగు ఉధృతి ఉన్న కూడా కొద్ది పాటి పురుగు మందుల పిచికారితో, అధిక దిగుబడినివ్వ కలిగిన రకము. ఎల్.సి ఎ?625 రకం: ఎండు మిరపకు అనువైన ఈ రకం, మొక్కలు బలిష్టమైన కొమ్మలతో ఎత్తుగా పెరుగుతాయి. కణుపులు దగ్గరగా ఉండి, కాపు చిక్కగా ఉంటుంది. ప్రధాన పొలంలో నేరుగా ఎద పెట్టడానికి మిక్కిలి అనువైన రకం. కాయలు సన్నగా, మధ్యస్థ పొడవుతో (8-10 సెం. మీ ) ఉంటాయి. తేజ రకాన్ని పోలి ఉంటాయి. పచ్చి కాయలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. సూటి రకాలలో కెల్లా అధిక ఘాటు (45000?50000 ఎస్.హెచ్.యు) మంచి ఆకర్షణీయమైన ఎరుపు రంగు (60-65 ఎ.ఎస్.టి.ఏ) కలిగిన రకం. కాయ తోలు పలచగా ఉండి, అధిక ఘాటు వలన కాయకుళ్ళు తెగులును కొంతవరకు తట్టుకొని, తాలు కాయలు చాలా తక్కువుగా వస్తాయి.ఎల్. సి ఎ?657 రకం: తొలకరి తరువాత నేరుగా ఎద పెట్టుకోవడానికి అనువైన జెమిని వైరస్ ను తట్టుకునే రకం. మొక్కలు ఎత్తుగా, దృఢమైన కాండంతో నిటారైన కొమ్మలు కలిగి, బలమైన వేరు వ్యవస్థను కలిగి ఉంటాయి. కాయలు పొడవుగా (11-12 సెం.మీ), ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండినప్పుడు ముదురు ఎరుపు రంగుతో తెల్లటి తొడిమ కలిగి ఆకర్షణీయంగా ఉంటాయి. కాయలు అధిక ఘాటు (50,000-55,000 ఎస్.హెచ్.యు), మంచి రంగును కలిగి ఉంటాయి. అధిక బెట్టను తట్టుకునే రకం. విత్తనాలు కొనదలచిన రైతులు నేరుగా ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ లాం ఫారంలో, ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు విత్తనాలు అందిస్తారు. అయితే స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే పంపిణీ చేస్తారు. రెండో శనివారం, ప్రతి ఆదివారం పంపిణీకి సెలవు ప్రకటించారు. కిలో విత్తనాల ధర 1,200 రూపాయలుగా నిర్ధారించారు. ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్. సి. వెంకట రమణ మాట్లాడుతూ, పైన తెలియజేసిన మిరప విత్తనాలు కేవలం ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం, లాం ఫారం నందు మాత్రమే పొందగలరని, అవే పేర్లతో బయట ఎవరైనా ఈ విత్తనాలు అమ్మజూపినట్లైతే రైతులు వాటిని ఖరీదు చేసి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. దీని కోసం 99898 09554 / 9440592982 ఫోన్ నెంబర్లను సంప్రదించి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు.

# రాజధాని స్టాండ్ మారలేదా...వైసీపీలో మళ్లీ చర్చ

విజయవాడ, జూన్ 16,

వైసీపీ అధినేత జగన్ తన నిర్ణయాన్ని మార్చుకుంటారా? అంటే లేదనే తెలుస్తుంది. రాష్ట్రం మరోసారి విభజన కాకుండా ఉండాలంటే మూడు రాజధానులు అవసరమని ఇప్పటికీ జగన్ నమ్ముతున్నారు. గత ఎన్నికలకు మూడు రాజధానుల నినాదంతోనే వైఎస్ జగన్ వెళ్లారు. అయితే మూడు ప్రాంతాల ప్రజలు జగన్ పార్టీని ఆదరించలేదు. దీంతో రాజధాని అమరావతి అంశం మూడు ప్రాంతాల్లో పనిచేసిందని వైసీపీ నేతలు కూడా నమ్ముతున్నారు. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాలకు చెందిన వైసీపీ నేతలు అమరావతిని రాజధానిగా కొనసాగిస్తే గెలిచే వారమని చెబుతున్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ వంటి వారయితే మూడు రాజధానుల కథ ముగిసిందన్నట్లుగా మాట్లాడారు. అయితే గత ఎన్నికల్లో వైసీపీ దారుణంగా దెబ్బతినడానికి అమరావతి కారణం కాదని జగన్ అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. అమరావతి రాజధాని అంశమే ప్రధానంగా మారితే ఇటు రాయలసీమ, అటు ఉత్తరాంధ్రలో ఎందుకు ఊడ్చుకుపోతామని ఎదురు ప్రశ్నిస్తున్నారట. అసలు గత ఎన్నికలలో ఓటమికి అమరావతి కారణం మాత్రం కాదని, ఓట్ల శాతం ఒక్కసారిగా పెరగడంతో పాటు ఈవీఎంల వల్లనేనని జగన్ ఇప్పటికీ అభిప్రాయపడుతున్నారని తెలిసింది. చంద్రబాబు నాయుడు కేవలం అమరావతి రాజధానికి మాత్రమే నిధులు ఖర్చు చేయడంతో పాటు సంక్షేమ పథకాలను కూడా అమలు చేయకపోవడం, ఇచ్చిన హామీలు కూడా అందచేయకపోవడం తమకు కలసి వస్తుందని అంటున్నారట. రాజధానిలో వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడమే కాకుండా, అక్కడ దశల వారీగా అభివృద్ధి చేయాల్సిన సమయంలో ఒక్కసారి అప్పులు చేసి నిధులు కుమ్మరించడాన్ని కూడా ఇతర ప్రాంతాల ప్రజలు తప్పుపడుతున్నారని జగన్ సీనియర్ నేతల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అందుకే వెన్నుపోటు దినం పిలుపు నిస్తే రాష్ట్రం నలుమూలల ఉత్తరాంధ్ర, రాయలసీమలోని అన్ని ప్రాంతాల్లో కార్యకర్తలు, ప్రజలు వెల్లువెత్తడానికి కూడా కారణం ప్రభుత్వం పెల్లుబుకుతున్న అసంతృప్తి మాత్రమేనని అంటున్నారట. వచ్చే ఎన్నికల్లో కూడా అమరావతి రాజధాని అని మ్యానిఫేస్టోలో పెట్టే అవకాశం మాత్రం కనిపించడం లేదు. అయితే అదే సమయంలో రాజధాని ప్రస్తావన లేకుండానే ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న అభిప్రాయంలో ఉన్నారని తెలిసింది... రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఎన్ని నిధులు వెచ్చించినా నాలుగేళ్లలో పనులు పూర్తి కావని, అయితే కొన్ని కీలక సంస్థలను మాత్రం ఇతర ప్రాంతాలకు తరలించడంతో పాటు రాజధానికి మరో నలభై వేల ఎకరాలను సేకరించడం కూడా అనవసరమన్న అభిప్రాయంలో వైఎస్ జగన్ ఉన్నారని చెబుతున్నారు. రాజధాని అంశంపై ఎవరూ మాట్లాడవద్దని కూడా సీనియర్ నేతలకు జగన్ సూచించినట్లు తెలిసింది. దీనిపై పార్టీ స్టాండ్ తాను మాత్రమే ప్రకటిస్తానని, అది అందరికీ ఆమోదయోగ్యంగానే ఉంటుందని చెబుతున్నారు. అంతే తప్ప ఇప్పుడు ప్రచారం జరుగుతున్నట్లు మూడు రాజధానుల నుంచి వెనక్కు మళ్లారని మాత్రం అనుకోవద్దని కూడా జగన్ చెబుతుండటం విశేషం.

# షార్ కేంద్రానికి బాంబు బెదిరింపు

శ్రీహరికోట

నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్ కేంద్రానికి బాంబు బెదిరింపు ఫోన్ వచ్చింది. చెన్నై సీఐఎస్ఎఫ్ కమాండెంట్ కార్యాలయానికి బెదిరింపు కాల్ రావడంతో శ్రీహరికోటలో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. షార్ కేంద్రంలో అణువణువునా బలగాల గాలింపు జరిగింది. చివరకు అధికారులు ఫేక్ కాల్గా నిర్ధారించార.

# ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల, పుస్తకాల భారం.

**అధిక ఫీజులు అధిక ధరలకు పుస్తకాలు అమ్మకం.**

**లబోదిబో అంటున్నా తల్లిదండ్రులు.**

**ఇంత జరిగినా పట్టించుకోని సంబంధిత అధికారులు.**

**అంతా శ్రీకృష్ణ లీలలు.**

గోదావరిఖని:

గోదావరిఖని లోని ప్రైవేట్ పాఠశాలలో శ్రీకృష్ణ లీలలు లాగా ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచి ఫీజులు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా తమ పాఠశాలలోనే పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, శూలు, టై, దీనితోపాటు స్పోర్ట్స్ కు సంబంధించిన డ్రెస్ కూడా కొనాలంటూ తల్లిదండ్రులపై ఆంక్షలు విధిస్తున్నారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు.

ప్రైవేట్ పాఠశాలలో తరగతితో సంబంధం ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు.ఇష్టం వచ్చిన రీతిగా ఫీజులు నిర్ణయించి తల్లిదండ్రులపై భారం పెడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక లబోదిబో అంటున్నారు.

పట్టించుకోని సంబంధిత అధికారులు.

ప్రైవేటు పాఠశాలలో ఇంత జరుగుతున్నా అటువైపు కన్నెత్తి కూడా చూడని సంబంధిత అధికారులు. జూన్ మాసం వచ్చిందంటే ప్రైవేట్ పాఠశాలలు ప్రతి ఏటా ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారు.సంబంధిత అధికారులు ఫీజుల విషయంలో పట్టించుకోకపోవడంపై తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

బస్సు చార్జీలు సపరేట్.

దూరపాంత విద్యార్థులను పాఠశాలకు తీసుకురావడానికి మళ్లీ ఇంటి దగ్గర దించడానికి ఫీజు తో సంబంధం లేకుండా బస్సు ఫీజు సపరేట్ అంటూ తల్లిదండ్రుల దగ్గర బస్సు ఫీజు వసూలు చేస్తున్నారు. పెట్రోల్, డీజిల్ పెరిగాయి అంటూ బస్సు ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారు.పాఠశాల బస్సులు కండిషన్ లో ఉన్నాయో లేవో ఆర్టీవో తనిఖీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాఠశాల బస్సులు అనేకమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా.

నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో ప్రత్యేక బుక్ స్టాల్ కౌంటర్ ను ఏర్పాటు చేసి అధిక ధరలకు విద్యార్థులకు పుస్తకాలు అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు ఏ మాత్రం కూడా

పట్టించుకోవడం లేదు.

పాఠశాలలలో కనీస సౌకర్యాలు కరువు.

ప్రవేటు పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేసిన విద్యార్థులు కనీస సౌకర్యాలు కూడా లేవంటున్నారు. తాగడానికి మంచి నీళ్లు లేకపోవడమే కాకుండా,బాత్రూంలో శుభ్రంగా లేకపోవడం, భోజనం చేయడానికి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదంటున్నారు తల్లిదండ్రులు అంటున్నారు అంతేకాకుండా పిల్లల సైకిల్ పార్కింగ్ షెడ్డు లేకపోవడంతో ఎండకు, వానకు సైకిళ్లు ఖరాబ్ అయితున్నాయని అంటున్నారు. అంతేకాకుండా రోడ్ల పైన పార్కింగ్ చేయడం జరుగుతుందని. ఎన్నోసార్లు సైకిల్ పోయిన సంఘటన కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల యజమాన్యాలు అధిక ఫీజులు తీసుకున్న కూడా విద్యార్థులకు పాఠశాల లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరంగా ఉందని తల్లిదండ్రులు అంటున్నారు.ప్రైవేటు పాఠశాలలపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు అధిక ఫీజుల పైన, పుస్తకాల పైన, బస్సు చార్జీలు, పై ప్రైవేట్ పాఠశాల యజమానులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

# సామాజిక వర్గం లక్ష్యంగా ప్రణాళికలు

ఏలూరు జూన్ 16,

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఒక పద్ధతి ప్రకారం వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది. వచ్చే ఎన్నికల్లోనూ హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో జనసేను గెలిపించాలన్న ఉద్దేశ్యంతో ఆయన ఉన్నారు. పవన్ కల్యాణ్ అందుకే ప్రస్తుతం మౌనంగా ఉంటున్నారు. కొన్ని కీలక విషయాల్లో మాత్రమే పవన్ స్పందిస్తున్నారు. అంతే తప్పించి ఆయన పాలన వ్యవహారాల్లో కూడా పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. ప్రభుత్వ నిర్ణయాలను కూడా ప్రశ్నించడం లేదు. పవన్ తనతో పాటు జనసేన ఎమ్మెల్యేలు గెలవాలంటే ఇటు టీడీపీ సహకారం అవసరం. అదే సమయంలో కాపు సామాజికవర్గం మద్దతు కూడా అంతే అవసరం. అభిమానులు ఎటూ వెళ్లరు. ఆ నమ్మకంతోనే పవన్ కల్యాణ్ ఉన్నారు. మరొకవైపు ఎక్కడికి వెళ్లినా సీఎం..సీఎం అంటూ అభిమానులు చేస్తున్న నినాదాలు నిజం చేయాలనుకుంటున్నారు. టీడీపీ విషయంలో పెద్దగా పట్టించుకోకపోవడమే మంచిదని ఆయన భావిస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత తన పార్టీపై పడకూడదని ఆయన గట్టిగా భావిస్తున్నారు. అందుకే పెద్దగా హడావిడి చేయడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, రాష్ట్రంలో జరిగే పరిణామాలకు తనకు సంబంధం లేనట్లే పవన్ కల్యాణ్ వ్యవహరించడం కూడా అదే కారణమని అంటున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటం అదే రీజన్ అని చెబుతున్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వంపై సహజంగా వెలువడే వ్యతిరేకత భాగస్వామి పార్టీగా తమపై పడకూడదనే పవన్ కల్యాణ్ అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని కూడా పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అదే సమయంలో తాను మాత్రం తనకు అప్పగించిన శాఖల విషయంలో మార్పులు చేసి చూపించి, ప్రజాభిమానాన్ని చూరగొనాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఇరవై రెండు నియోజకవర్గాలతో పాటు మరో పది నుంచి ఇరవై నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసుకోగలిగితే వచ్చే ఎన్నికల్లో జగన్ కు అధిక స్థానాలు వచ్చినా తాము కీలకంగా మారి ముఖ్యమంత్రి పదవి కూడా దక్కే అవకాశాలున్నాయన్న అంచనాలతో ఉన్నారు. అది బయటకు చెప్పకపోయినప్పటికీ జగన్ గట్టిపోటీ ఇచ్చి ఎక్కువ ఎమ్మెల్యే స్థానాలు సాధిస్తే అప్పుడు సీఎం పదవి కొన్నాళ్ల పాటయినా తనను వెతుక్కుంటూ వస్తుందని పవన్ కల్యాణ్ నమ్ముతున్నారు. అందుకే ఆయన ఆ స్ట్రాటజీతోనే వెళుతున్నారు. కాపు సామాజికవర్గం కూడా... చంద్రబాబు పదిహేనేళ్లు సీఎంగా ఉండాలని తాను కోరడం వెనక కూడా టీడీపీ ఓటు బ్యాంకు మళ్లకుండా ఉండేందుకేనంటున్నారు. మరోవైపు ఇప్పటి వరకూ కాపు సామాజికవర్గానికి ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదు. కేవలం రాజకీయంగా మాత్రమే కాకుండా సంక్షేమ విషయాల్లో కాపులకు ప్రాధాన్యత ఇచ్చేలా ఎన్నికలకు ముందు చివరి రెండు సంవత్సరాలు గట్టిగా చంద్రబాబు పై వత్తిడి తెచ్చి అమలు చేయగలిగితే ఆ ఓటు బ్యాంకు కూడా ఎక్కడికీ పోకుండా, తనను అంటిపెట్టుకునే ఉంటుందని నమ్ముతున్నారు. ఇప్పటి వరకూ కాపు సామాజికవర్గానికి చేసిందేమీ లేదన్న అసంతృప్తి వారిలో ఉందని, ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో అధికి సీట్లు గెలవాలంటే చివరి ఏడాది దానిపై ఫోకస్ పెట్టాలని పవన్ భావిస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద పవన్ కల్యాణ్ ఆలోచనలు నిజమమైతే వచ్చే ఎన్నికల ఫలితాలు ఆయనను ముఖ్యమంత్రి గా చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని సీనియర్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

=========================

# కేటీఆర్ .. నీ డ్రామాలు, దొంగ నాటకాలు ఆపు ఎంఎల్సీ బల్మూర్ వెంకట్

హైదరాబాద్ జూన్ 16,

చట్టం మీద గౌరవం ఉందని అంటూనే కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కు తున్నాడు. సత్యహరిశ్చంద్రుడి లా కేటీఆర్ తెగ బిల్డప్ ఇస్తున్నాడని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మండిపడ్డారు. అధికారులకు అవసరమైతే మూడు సార్లు కాదు 300 సార్లైనా పిలుస్తారు..వెళ్లాల్సిందే. కేటీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే విచారణ లో నిజాయితీ గా సమాధానాలు చెప్పాలి. కేసులు బనాయించాల్సిన అవసరం మా ప్రభుత్వానికి ఏ మాత్రం లేదు. ఈ ఫార్ములా రేస్ అస్తవ్యస్థంగా నిర్వహించి దొరికిపోయింది కేటీఆర్. మంత్రి వర్గం అనుమతి లేకుండా ఇష్టానుసారంగా విదేశీ కంపెనీ కి 55 కోట్లు చెల్లించింది నువ్వని అన్నారు.

నిబంధనలు పాటించకుండా, ఆర్బీఐ కి చెప్పకుండా డబ్బులు పంపించ మన్నది నువ్వు.అడ్డంగా దొరికిపోయి నంగనాచి లా కేటీఆర్ కబుర్లు చెపుతున్నాడు. కేవలం విచారణ కు పిలిస్తేనే పైశాచిక ఆనందం తెగ ఆవేదన వ్యక్తం చేస్తున్నావు.. అక్రమ కేసుల్లో ఇరికించి మా రేవంత్ రెడ్డిని, మమ్మల్ని రోజుల తరబడి జైల్లో పెట్టినదాన్ని ఏమనాలి.. పైశాచిక ఆనందం లేక శాడిజమా ..? అరెస్టులకు భయపడనని తెగ బిల్డప్ లు ఇస్తున్నావు.. నీ కోరిక నెరవేరాలని మేం కూడా కోరుకుంటున్నాం. నీ అవినీతి, అక్రమాలు దర్యాప్తులో బయటపడితే ఒక్కసారి కాదు వందసార్లైనా జైలుకు వెళ్లాల్సి వస్తుంది.. రెఢీ గా ఉండు. కేటీఆర్ .. నీ డ్రామాలు, దొంగ నాటకాలు ఆపు. నీ కుటుంబ సభ్యులే నిన్ను దెయ్యం అంటున్నారు. బిడ్డా కబడ్దార్.. నువ్వు , నీ అయ్య ను తెలంగాణ ప్రజలు నేలకేసి కొట్టారు. వచ్చే ఎన్నికల్లో నువ్వు కనీసం ఎమ్మెల్యే గా గెలిచే పరిస్థితి కూడా ఉండదని అన్నారు.

## గ్రామపంచాయతీ భవనానికి పింక్ కలర్ మండిపడ్డ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ

కోదాడ మండలం చిమిర్యాల గ్రామంలో గ్రామపంచాయతీ భవనంకి పింక్ కలర్ వేయడంతో కాంట్రాక్టర్ పై ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. రేపటి వరకు బిల్డింగ్ కలర్ మార్చాలని కాంట్రాక్టర్ కి ఆదేశాలు ఇచ్చారు. 20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

## స్కూల్ కి తాళం వేసిన కాంట్రాక్టర్

నిర్మల్ఖానాపూర్ మండలం రాజుర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు బిల్డింగ్ కాంట్రాక్టర్ తాళం వేసాడు. స్కూలుకు వచ్చిన టీచర్లు , విద్యార్థులు బడి బయటే వుండిపోయారు. స్కూల్ బిల్డింగ్ బిల్లు 40 లక్షలు ఇచ్చేవరకు తాళం తీయనని తేగేసి చెప్పాడు.

# తల్లికి వందనం రికార్డ్...

నెల్లూరు, జూన్ 16,

ఆంధ్రప్రదేశ్లోని కూటమి ప్రభుత్వం.. ఎన్నికల వేళ హామీ ఇచ్చినట్లుగానే సూపర్ సిక్స్లో ప్రకటించిన పథకాలను అమలు చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించి.. అర్హుల ఖాతాలో నిధులు జమ చేసింది. ఈపథకం కింద కుటుంబంలో ఎంత మంది అర్హులుంటే వారందరికి తల్లికి వందనం అమలు చేసింది. స్కూళ్లు తెరిచిన రోజున అనగా జూన్ 12నే దీన్ని ప్రారంభించగా.. సాంకేతిక కారణాల వల్ల ఒక్క రోజు ఆలస్యమైంది. దాదాపుగా లబ్ధిదారులందరి ఖాతాలో తల్లికి వందనం నిధులు జమ అయినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో మంత్రి గొట్టిపాటి రవి తల్లికి వందనం పథకంపై కీలక వ్యాఖ్యలు చేశారు.గత ప్రభుత్వ హయాంలో రంగులు, బొమ్మల పిచ్చితో విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని గొట్టిపాటి రవి ఆరోపించారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం విద్యార్థుల భవిష్యత్తు, టీచర్ల నియామకంపై దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే స్టూడెంట్స్కి మధ్యాహ్న భోజనంలో భాగంగా సన్నబియ్యం వడ్డించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించింది. దీనిపై విద్యార్థులు,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తోంది. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం.. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు.. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్,కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు రూ.13 వేలు అందిస్తోంది. విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతున్నాయి. తల్లికి వందనం ద్వారా ఒక్కొక్కరికీ రూ.15000 చొప్పున సాయం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. పాఠశాలల అభివృద్ధికి అని చెప్పి.. ఈమొత్తం నుంచి రూ.2000 కట్ చేసి.. రూ.13000 విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.ఇక అధిక సంతానం ఉన్న వారి ఖాతాల్లో భారీ ఎత్తున డబ్బులు జమ అయ్యాయి. అన్నమయ్య జిల్లాలోని ఓ కుటుంబానికి తల్లికి వందనం కింద ఏకంగా రూ.1.56 లక్షలు అకౌంట్లలోకి పడ్డాయి. లబ్ధిదారులది ఉమ్మడి కుటుంబం కావడం.. ఫ్యామిలిలో 12 మంది పిల్లలు ఉండటంతో ఇంత భారీ మొత్తంలో నిధులు జమ అయ్యాయి.




ఒకే తల్లికి అంత మంది పిల్లలా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తల్లికి వందనం పథకం అమల్లో.. అక్కడక్కడా పొరపాట్లు జరిగినట్లు తెలుస్తోంది. తల్లికి వందనం పథకం కింద అర్హులైన విద్యార్థులకు ఏటా రూ.15000 అందిస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. ఇక ఇచ్చిన మాట ప్రకారమే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం అమలు ప్రారంభించింది. జూన్ 12వ తేదీ తల్లికి వందనం నిధులు విడుదల చేశారు. జూన్ 13 నుంచి అర్హులైన విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదు జమవుతోంది. ఈ క్రమంలోనే తమ కుటుంబంలో 12 మందికి తల్లికి వందనం వచ్చిందని, ఐదుగురికి తల్లికి వందనం డబ్బులు వచ్చాయంటూ విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి, సీఎం నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారుఅయితే తల్లికి వందనం పథకం అర్హుల తుది జాబితాలో పలుచోట్ల పొరబాట్లు జరిగినట్లు అధికారులు గుర్తించారు. వాటిని సరిచేసే పనిలో ఉన్నారు. అర్హులైనవారి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులు ప్రదర్శించారు. ఈ క్రమంలోనే నంద్యాల జిల్లాలో చాలా మంది విద్యార్థులకు ఒకటే తల్లి పేరు కనిపిస్తోంది. ప్యాపిలిలో 96 మంది విద్యార్థులకు ఒకటే తల్లి పేరు కనిపిస్తోంది. ఈ రకంగా ఇద్దరి విషయంలో జరిగింది. ప్యాపిలి సచివాలయం-3 పరిధిలో మౌనిక అనే మహిళ పేరును 96 మంది విద్యార్థులకు తల్లిగా చూపించారు. ప్యాపిలి సచివాలయం-4 పరిధిలో శోభ అనే మహిళను కూడా 96 మంది పిల్లలకు తల్లిగా చూపించారు.మరోవైపు తల్లికి వందనం పథకం అమలలో భారీగా అక్రమాలు జరిగాయంటూ కొంతమంది సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఒకే తల్లి పేరు మీద 340 పిల్లల పేర్లు తల్లికి వందనం పథకం కోసం నమోదు చేశారంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టు వైరల్ అవుతోంది. ప్రతి గ్రామంలోనూ ఇలాగే ఒకే తల్లి పేరుతో 10 నుంచి 30 మంది వరకూ విద్యార్థుల పేర్లు నమోదు చేశారని.. వీరంతా టీడీపీ కార్యకర్తలేనంటూ పోస్టులు పెడుతున్నారు. తల్లికి వందనం పథకం పేరుతో టీడీపీ కార్యకర్తలకు భారీగా ఆర్థిక లబ్ధి చేకూర్చడానికి ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. అయితే ఆధార్ కార్డు నంబర్ ఆధారంగా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సమయం తెలుగు పరీక్షించగా.. తల్లికి వందనం పథకం 2025 రికార్డులలో మీరు చేర్చబడలేదంటూ సమాధానం వచ్చింది. దీంతో ఈ పోస్టు తప్పుదోవ పట్టించేదిగా భావించవచ్చు.మరోవైపు వైరల్ ట్వీట్లపై ఏపీ ఫ్యాక్ట్ చెక్ విభాగం క్లారిటీ ఇచ్చింది. తల్లికి వందనం పథకం అర్హులు, అనర్హుల జాబితా సంబంధిత గ్రామ సచివాలయాల్లో ప్రచురించామని పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అర్హులైన విద్యార్తులకు సంబంధించిన నగదును ఇప్పటికే వారి తల్లులకు విడుదల చేశామని.. అర్హులై ఉండి, జాబితాలో పేర్లు లేని వారు తమ వివరాలు గ్రామ సచివాలయ శాఖ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది.దరఖాస్తుదారుల ఫిర్యాదులను పరిశీలించి, అర్హులైతే వారికి కూడా లబ్ధి చేకూర్చుతామని.. తల్లిదండ్రులు లేని పిల్లలకు 'తల్లికి వందనం' నగదును సంబంధిత జిల్లా కలెక్టర్ అకౌంటుకు జమచేస్తున్నామని క్లారిటీ ఇచ్చింది. క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత కలెక్టర్ ద్వారా వారికి కూడా తల్లికి వందనం నగదు అందజేస్తామని క్లారిటీ ఇచ్చింది. ఆరుగురు లేదా అంతకంటే ఎక్కువమంది పిల్లలు కలిగిన తల్లుల జాబితానూ పున:పరిశీలించాక వారికి కూడా తల్లికి వందనం నగదు జమ చేస్తామని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత గల ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి చేకూర్చుతామని పాఠశాల విద్యాశాఖ క్లారిటీ ఇచ్చింది.

## చల్పాకలో తీవ్ర ఉద్రిక్తత

ములుగు

ఏటూరునాగారం మండలం చల్పాక శివారులో ఉద్రిక్తత నెలకొంది. అటవీభూముల్లో గిరిజనులు గుడిసెలు వేసుకున్నారు. దాంతో గుడిసెలు తొలగించేందుకు అటవీశాఖ అధికారులు, పోలీసులు భారీఎత్తున మొహరించారు.

పోలీసులు, అటవీశాఖ అధికారులపై గిరిజనులు తిరగబడ్డారు. కర్రలతో ఎదురుదాడికి దిగారు. రిజర్వ్ ఫారెస్ట్ లో వేసిన గుడిసెలను తొలగించేందుకు అటవీశాఖ, అధికారులు పోలీసులు ప్రయత్నించారు. గిరిజనులు- అటవీశాఖ సిబ్బంది మధ్య తీవ్రవాగ్వాదం, తోపులాట జరిగింది...

# ఆగని రేషన్ దందా

నిజామాబాద్, జూన్ 16,

అక్రమ రేషన్ బియ్యం దందా కామారెడ్డి జిల్లాలోఆగడం లేదు. అక్రమార్కులు, రేషన్ డీలర్లు కొందరు కుమ్మక్కై రేషన్ దందా కొనసాగిస్తున్నారు. అక్రమ రేషన్ బియ్యం దందా నిర్వహించే వ్యాపారులకు మూడు నెలల రేషన్ ఒకేసారి రావడంతో వారికి వ్యాపారం కలిసి వచ్చింది.గతంలో నెల నెల రేషన్ బియ్యాన్ని సేకరించి అమ్మేసి ముఠా ఈసారి జూన్ నుంచి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండడంతో రేషన్ డీలర్లకు, అక్రమ రేషన్ బియ్యం దందా నిర్వహించే ముఠాకు వ్యాపారం మరింత కలిసి వచ్చినట్లయినీది. రేషన్ షాప్ ల వద్ద బియ్యం సేకరణ చేపడుతున్నారు. ఒక్కరికి జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల బియ్యం రావడంతో కొంతమంది తమకేందుకు అని రేషన్ బియ్యాన్ని రేషన్ డీలర్లకి అంటగడుతున్నారు.ఇదే అదనుగా భావించి రేషన్ డీలర్ లు బియ్యం పంపిణీ చేసే చోటే ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. దొడ్డు బియ్యం పంపిణీ చేసినప్పుడు సాగిన దందా సన్న బియ్యం పంపిణీ కూడా దందాను కొనసాగిస్తున్నారు. మూడు నెలల బియ్యం ఒకే సారీ పంపిణీ చేస్తునీడదనీతో అక్రమ బియ్యం దందా కొనసాగించే వ్యాపారులకు మరింత కలిసి వచ్చినట్లయినీ ది.గతంలో దొడ్డు బియ్యం అక్రమ దందా కొనసాగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తే ఆ సన్న బియ్యం కూడా ఆక్రమ ముగా కొనుగోలు చేస్తున్నారు. మిల్లర్లు మరికొందరు అక్రమ బియ్యం దందాను కొనసాగిస్తున్నారు. రేషన్ బియ్యం అమ్మేవారి సంఖ్య ఎక్కువ మొత్తంలో ఉండడంతో వారి వద్ద నుంచి మధ్య దళారులు కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు అమ్ముతున్నారు.నెలకు లక్షల్లో రేషన్ బియ్యం చేతులు మారుతుండగా ఈ నెలలో మరింత రేట్టింపు స్థాయిలో అక్రమ బియ్యం దందా ను కొన సాగిస్తున్నారు. రేషన్ అక్రమ బియ్యం దందా ఎదేచ్ఛగా కొనసాగుతున్న అధికారులకు ఫిర్యాదులు చేసిన నెలసరి మామూళ్లతో తమకు పట్టనట్లుగా విజిలెన్స్ రెవిన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో మూడు పువ్వులు ఆరు కాయలు అనే సామెత లాగా అక్రమ రేషన్ బియ్యం దందా కొనసాగిస్తున్నారు. కామారెడ్డి



జిల్లాలో 761 రేషన్ దుకాణాలు ఉండగా రేషన్ డీలర్లకు జూన్ మాసంలో మూడు నెలల బియ్యం కోట ఒకేసారి రావడంతో స్టాక్ ఉంచుకోలేక మధ్య దళారులకు అ క్రమంగా రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు.రేషన్ అక్రమ బియ్యం దందాను అరికట్టాల్సిన రెవిన్యూ, పోలీస్, పౌర సరఫరాల శాఖల అధికారులకు నెలసరి మామూలు చెల్లించడం వల్లనే ఈ ఆక్రమ రేషన్ బియ్యం దందా కొనసాగిస్తున్నారు. కొంతమంది అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు. ఇటీవల కామారెడ్డి పట్టణంలో 500 క్వింటాల రేషన్ బియ్యం పట్టుబడడమే ఇందుకు నిదర్శనం.రేషన్ దందా వెనుక రైస్ మిల్లర్లు అక్రమ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ దంపులు చేస్తున్నారు. మారుమూల గ్రామాలు అడ్డాలుగా చేసుకొని అక్రమ దంపులు చేసి రాత్రికి రాత్రి రేషన్ బియ్యం దందా కొనసాగిస్తున్నారురైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యాన్ని గతంలో రేషన్ దొడ్డి బియ్యం రావడంతో రీసైక్లింగ్ చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం సన్న బియ్యం విక్రయిస్తుండడంతో రీసైక్లింగ్ చేయకుండానే ప్రభుత్వానికి అప్పగించవచ్చని రైస్ మిల్లర్లు భావిస్తున్నారు. రైస్ మిల్ వ్యాపారులకు మరింత కలిసి వచ్చిందని అంటున్నారు.కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి ఎల్లారెడ్డి బాన్సువాడ బిచ్కుంద జుక్కల్ పిట్లం మద్నూర్ దోమకొండ రామారెడ్డి తదితర మండలంలో మారుమూల మండలాల్లో సైతం దంపులు చేసి విక్రయాలు చేపడుతున్నారు. రైస్ మిల్లులే అడ్డాగా పెట్టడం తోపాటు గోదాములు అడ్డాగా చేసుకొని రేషన్ బియ్యం నిల్వలు చేస్తున్నారు.

====================చీచీ

## డిప్యూటీ సీఎం భట్టి పర్యటన జయప్రదం చేయండి.:ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 16ఈనెల 17 మంగళవారం రోజున భూపాలపల్లి నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారని, పర్యటనను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మంగళవారం రోజున ఉదయం పది గంటలకు నియోజకవర్గంలోని కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ గ్రామ శివారులో రూ.200 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మంజూరునగర్ 8 ఇంక్లైన్ రోడ్డులో చర్చి ఎదురుగా ఉన్నటువంటి మైదానంలో మంజూరునగర్(భూపాలపల్లి), ధర్మరావుపేట(గణపురం మండలం), నవాబుపేట(చిట్యాల మండలం) గ్రామాలల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం గణపురం మండలం చెల్పూర్ గ్రామంలోని జెన్కో లో సింగరేణి మరియు జెన్కో అధికారులతో వేరువేరుగా నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.మొరంచపల్లి గ్రామం నుండి మంజూరునగర్ లోని సభావేదిక వరకు పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాల ర్యాలీ ఉంటుందని, ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

మంజూరునగర్ లోని సభాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే..

ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం అనంతరం మంజూరునగర్ లోని సభ ప్రాంగాణాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సింగరేణి, జెన్కో, పోలీసు, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

==============================

# -వీరోచిత పోరాటంలో వీరమరణం పొందిన రోజు

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

బ్రిటీష్ పరిపాలనాకాలంలో వారి ఆకృత్యాలను అణిచివేసి, దేశాన్ని స్వాతంత్ర్యం దిశగా తీసుకెళ్లిన స్వాతంత్ర్య సమరయోధులతోపాటు వీరవనితలు ఎందరో వున్నారు. ఓవైపు విదేశీ పాలకులతో పోరాడుతూనే.. మరోవైపు ప్రజారంజకంగా పాలించిన మహారాణులు మన దేశంలో జన్మించారు. అలాంటి వారిలో ధీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి ఒకరు. దేశ చరిత్రలోనే తొలిసారిగా మహిళా సైన్యాన్ని తయారుచేసిన ఘటన ఆమెది. ఈమె జీవించింది కేవలం 23 సంవత్సరాలే అయినప్పటికీ.. ఆమె అందించిన స్ఫూర్తి నేటికీ యువతలో ఉత్తేజాన్ని నింపుతోంది.

ఝాన్సీ లక్ష్మీబాయి' అసలు పేర మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరము నవంబరు నెల19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. డీ.బీ పరాస్నిస్ అనే చరిత్రకారుడు రాణీ నవంబర్ 19, 1835 వసంవత్సరంలో జన్మించినట్లు ఆమె జీవిత చరిత్రలో పేర్కొన్నాడు. కానీ దీనికి వేరే చారిత్రక ఆధారాలు లేకపోవడం వలన 1828 అన్ని చోట్లా ఆమోదింపబడుతున్నది. దీనికి ఆధారం 1854లో జాన్ లాంగ్ అనే ఆంగ్లేయుడు రాణిని కలవడానికి వెళ్ళినపుడు ఆమె తరుపు గుమస్తా ఆయనకు రాణీ 26 ఏళ్ళ స్త్రీ అని చెప్పడం జరిగింది. ఈమె తల్లిదండ్రులు మోరోపంత్ తాంబే మరియు భాగీరథీబాయిలు. వీళ్ళది సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం. ఆమె తల్లి చాలా తెలివైనది మరియు ఆధ్యాత్మిక దోరణి మెండుగా కలది.

ఈమె పేరు మణికర్ణిక కాగా ఆమె ను ముద్దుగా మను అని పిలుచుకునేవారు. ఆమె తల్లి రాణి నాలుగేళ్ళ ప్రాయంలో ఉండగానే కన్ను మూసింది. దాంతో ఆమెను పెంచాల్సిన బాధ్యత తండ్రి మీద పడింది.

బాల్యంలోనే గుర్రపు స్వారీ, కత్తిసాముల్లో ఆరితేరింది. ఈమెకు 13 ఏళ్ళ వయసులోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. ఆ పెళ్ళి తర్వాత ఈమె జీవితం పూర్తిగా మలుపు తిరిగింది. ఈమె 17వ ఏటలో వున్నప్పుడు 1851లో ఓ కుమారునికి జన్మనివ్వగా.. నాలుగు నెలల వయసులోనే ఆ బాలుడు మరణించాడు. దీంతో లక్ష్మీబాయి దంపతులు 'దామోదరరావు' అనే అబ్బాయిని దత్తత తీసుకున్నారు. ఆ దత్తతను ఆమోదించాల్సిందిగా బ్రిటీష్ వారికి వారు అర్జీ కూడా పెట్టుకున్నారు. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న తరుణంలో 1953నవంబర్ 21 లో గంగాధరరావు మరణించాడు. దీంతో రాజ్యపాలన మొత్తం లక్ష్మీబాయి మీదే పడింది. ఆ తర్వాత లక్ష్మీబాయికి కష్టాలు మరిన్ని ఎక్కువయ్యాయి.

ఆనాటి బ్రిటీష్ గవర్నర్ అయిన డల్హౌసి... లక్ష్మీబాయి భర్త గంగాధర మరణించడంతో దామోదరరావును దత్తత తీసుకోవడం చెల్లదని, రాజ్యాన్ని బ్రిటీష్ వారికి స్వాధీనం చేసి వెళ్లాలని ఆమెని ఆదేశించాడు. అందుకు ఆమె ఏమాత్రం ఒప్పుకోలేదు. దీంతో బ్రిటీష్ వారు తమదైన పన్నాగాలు పన్ని, ఝాన్సీ రాజ్యంపైకి సరిహద్దు రాజ్యపాలకులను రెచ్చగొట్టింది. ఈ విషయాన్ని పసిగట్టిన లక్ష్మీబాయి.. తన రాజ్య సంరక్షణ కోనం నడుం బిగించి పెద్దఎత్తున సైన్యాన్ని తయారుచేసింది. ఇందులో భాగంగానే మహిళలకు సైతం శిక్షణనిచ్చి వారిని సైన్యంలో చేర్చుకుంది. ఈ సమయంలోనే ఆమె భారత స్వాతంత్ర్యంపై చైతన్యం కల్పించింది. ఈ క్రమంలోనే ఆమె సిపాయి ఉద్యమంలో పాలుపంచుకుంటున్న నానాసాహెబ్, రావుసాహెబ్, తాంతియా తోపేలతో చేతులు కలిపింది. ఇంతలోనే బ్రిటీష్ సేనలు ఝాన్సీలో ప్రవేశించి ప్రజల్ని నానా ఇబ్బందులకు గురిచేయడం మొదలుపెట్టాయి.

ఝాన్సీకి స్వేచ్ఛ కలిగించి లక్ష్మిబాయి ని స్వతంత్రుపరురాలు చేయటానికి తిరుగుబాటు దార్ల నాయకుడైన తాత్యా తోపే ఆధ్వర్యములో 20,000 మంది సైన్యం పంపబడింది. అప్పుడు బ్రిటిష్ వాళ్ళ దగ్గర 1,540 సిపాయిలు మాత్రమే ఉన్నప్పటికీ.. వీళ్ళు చాలా శిక్షణ పొందినవాళ్ళు కావడంతో అనుభవం లేని తోపే సిపాయిలు పారిపోయారు. లక్ష్మిబాయి బలగాలు బలహీనమవడంతో మూడు రోజుల తరువాత బ్రిటిష్ వాళ్ళు నగర గోడలను చీల్చుకొని నగరాన్ని ఆక్రమించుకోగలిగాయి. ఆమె తన రక్షకులు చుట్టూ ఉండడంతో ఆ రాత్రి గోడ దూకి నగరం నుంచి పారిపోగలిగింది. బ్రిటిష్ సైన్యం క్రమంగా ఝాన్సీని ముట్టడించడం ప్రారంభించింది. రెండు వారాల పోరాటం తర్వాత ఆంగ్లేయులు నగరాన్ని చేజిక్కించుకోగలిగారు. కానీ రాణి మాత్రం మగ వేషంలో దత్తత తీసుకున్న చిన్న బిడ్డను వీపున తగిలించుకుని వారి కన్నుగప్పి పారిపోయింది. కల్పి అనే ప్రదేశానికి చేరుకుని తాంతియా తోపే అనే విప్లవ కారుణ్ణి కలుసుకోగలిగింది.

తాత్యా తోపే ఉండే తిరుగుబాటు దారులతో చేరింది. రాణి, తాత్యా తోపే గ్వాలియర్ కు వెళ్లి తమ తిరుగుబాటు బలగాలను ఒకటి చేసి గ్వాలియర్ మహారాజ సైన్యాన్ని ఓడించి తమ బలగాలతో వాళ్ళను పూర్తిగా నశించి పోయేలా చేసారు. తరువాత వాళ్ళు కపటోపాయముతో గ్వాలియర్ కోటను ఆక్రమించుకొన్నారు. కాని.. 1858 జూన్ 17వ తేదీన రెండో రోజు యుద్ధంలో రాణి మరణించింది. ఆమె బుల్లెట్ గాయాలు తగిలి మరణించిందని సమాచారం. ఇలా ఈ విధంగా రెండు వారాలపాటు విదేశీ సైన్యంతో వీరోచితంగా పోరాడి, వీరమరణం పొందింది.

# గంజాయి వినియోగిస్తే కేసులు నమోదు

ఖమ్మం జూన్ 16,

గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని చదువుకుంటున్న యువకులు నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయిని సేవిస్తే కేసులు నమోదు చేస్తామని వైరా ఎస్సై రామారావు హెచ్చరించారు వైరా పోలీస్ స్టేషన్లో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్న యువతకు మత్తు పదార్థాల నిషేధంపై ఎస్సై రామారావు అవగాహన కల్పించారు గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ఇంటర్ డిగ్రీ బీటెక్ చదువుకున్న యువకులు నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయి. మద్యం ను సేవిస్తూ చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు చిన్న వయసులోనే చెడు వ్యసనాలకు బానిస కావటం వలన కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని అన్నారు విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి సమాజ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

# ఇక స్థానిక పోరు..

హైదరాబాద్, జూన్ 16

తెలంగాణలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందడి మొదలైంది. తాజాగా మంత్రి పొంగులేటి ఎన్నికల షెడ్యూలుపై కీలక అప్డేట్ ఇచ్చారు. జూన్ నెలాఖరులోగా నోటిఫికేషన్ విడుదలవుతుందని చెప్పారు. రేపు జరగబోయే కేబినెట్ భేటీలో ఎన్నికల నిర్వహణ తేదీపై స్పష్టత వస్తుందన్నారు. ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైంది. మంత్రుల వరుస ప్రకటనలతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. క్షేత్రస్థాయిలో రాజకీయ నాయకులు, ఆశావహులలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు, ప్రతిపక్ష పార్టీలు కూడా ఎన్నికల సన్నాహాల్లో నిమగ్నమయ్యాయి. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూలుపై తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక అప్డేట్ ఇచ్చారు.జూన్ నెలాఖరులో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని చెప్పారు. రేపు జరగబోయే కేబినెట్ భేటీలో చర్చించి ఎన్నికల తేదీపై స్పష్టత ఇస్తామని ప్రకటించారు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయాని.. ఆ తర్వాత సర్పంచ్ (గ్రామ పంచాయతీ), మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో, పంచాయతీల్లో వార్డుల విభజన, ఓటరు జాబితా తయారీ పనులను పూర్తి చేసిందన్నారు. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను కూడా సిద్ధం చేసి ఎన్నికలకు సన్నద్ధమవుతోందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి స్థానిక సంస్థల ఎన్నికలు ఇవి. గత ఏడాదే ఎన్నికలు నిర్వహించాలనుకున్నా వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ ఎన్నికలను ఇప్పుడు నిర్వహించడం ద్వారా క్షేత్రస్థాయిలో తమ పట్టును బలోపేతం చేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇటీవల అమలు చేసిన రైతు భరోసా, మహాలక్ష్మి వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధి పొందాలని చూస్తోంది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కూడా ఈ ఎన్నికలను తమ బలాన్ని తిరిగి నిరూపించుకునే అవకాశంగా చూస్తోంది.గ్రామస్థాయిలో తమ కార్యకర్తలను, నాయకులను క్రియాశీలం చేసేందుకు ఈ ఎన్నికలను వినియోగించుకోవాలని యోచిస్తోంది. బీజేపీ కూడా లోక్‌సభ ఎన్నికల విజయం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రంలో తమ ఉనికిని మరింత పటిష్టం చేసుకోవాలని చూస్తోంది.మంత్రుల ప్రకటనల నేపథ్యంలో త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రంలో రాజకీయ వేడి మరింత రాజుకోనుంది. అన్ని పార్టీలు తమ అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై దృష్టి సారించనున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో పాగా వేసి ఓటరు దేవుళ్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం జూన్ 2025 చివరి నాటికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. మొదటగా ఓఖుఅ, జిఖుఅ ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.జూలై లేదా ఆగస్టు 2025లో ఎన్నికలు జరగవచ్చు. పోలింగ్ కేంద్రాలు, బూత్‌లు, బ్యాలెట్ బాక్స్‌ల ఏర్పాటు, మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

రాజకీయ పార్టీల వ్యూహాలు

కాంగ్రెస్: అధికార పార్టీగా, గ్రామీణ ప్రాంతాల్లో తమ పట్టు బలోపేతం చేసుకోవడానికి ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, భూభారతి వంటి పథకాలపై దృష్టి సారించింది.ఃఖీః: ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ గత ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు కసరత్తు చేస్తోంది.బీజేపీ: రాష్ట్రంలో తమ ఉనికిని పెంచేందుకు ఈ ఎన్నికలను కీలక అవకాశంగా భావిస్తోంది.

రిజర్వేషన్‌పై చర్చబీసీ రిజర్వేషన్‌ను 42%కి పెంచాలనే ప్రతిపాదనపై చర్చ జరుగుతోంది. రాష్ట్ర బీసీ కమిషన్ దీనిపై నివేదిక సిద్ధం చేస్తున్నప్పటికీ, బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య ఈ ప్రతిపాదనపై విమర్శలు వ్యక్తం చేశారు. ఈ అంశం ఎన్నికల సన్నాహాల్లో ముఖ్యమైన ష్రవాలుగా మారింది.

# భారీ వర్షాల కారణంగా పంబ నది స్నానాలపై తాత్కాలిక నిషేధం

తిరువనంతపురంభారీ వర్షాల కారణంగా శబరిమల సన్నిధానం మరియు పంబ వద్ద పంబ నదిలో స్నానం చేయడాన్ని అధికారులు తాత్కాలికంగా నిషేధించారు. నీటి మట్టాలు పెరిగిన నేపథ్యంలో భద్రతా చర్యగా జిల్లా కలెక్టర్ ఈ నిషేధాన్ని పరిమితిని ప్రకటించారు, యాత్రికులు పంబ త్రివేణి వద్ద స్నానం చేయడం లేదా నదిలోకి ప్రవేశించవద్దని పేర్కొన్నారు.పంబ త్రివేణి వద్ద వాహనాల పార్కింగ్ కూడా తాత్కాలికంగా పరిమితం చేశారు. పంబ - సన్నిధానం మార్గంలో భారీ కురుస్తుండడంతో శబరిమల ఆలయానికి వస్తున్న యాత్రికులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.బ

# అన్నా.. చెల్లెమ్మ ప్రేమ..

హైదరాబాద్, జూన్ 16,

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వంకుట్ల తారకరామారావు, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మధ్య రాజకీయ విభేదాలు ఇటీవల బయటపడ్డాయి. కేటీఆర్‌ను పార్టీ వారసుడిగా ప్రకటించడం కవితకు నచ్చలేదు. దీంతో డీయర్ డాడీ.. అంటూ కేసీఆర్‌కు ఓ లేఖ రాసింది. పార్టీలోని లోపాలను బయటపెట్టింది. దీంతో విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇలాంటి సమయంలో కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులపై కవిత స్పందించడం చర్చనీయాంశమైంది.



తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత, కేటీ రామారావు (కేటీఆర్) మధ్య పార్టీ వ్యవహారాలపై విభేదాలున్నాయన్న ప్రచారం నేపథ్యంలో, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్సీ కవిత,ఫార్ములా?ఈ కేసులో కేటీఆర్‌కు యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) జారీ చేసిన తాజా నోటీసును తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన రాజకీయ ఉద్దేశంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుట్రగా కవిత ఆరోపించారు. ఈ సంఘటన రాజకీయ వివాదాన్ని రేకెత్తించడమే కాకుండా, బీఆర్ఎస్?కాంగ్రెస్ మధ్య ఉద్రిక్తతను మరింత పెంచింది.కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణలో నిర్వహించిన ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు. అయితే, ఈ ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న ఆరోపణలతో ఏసీబీ, కేటీఆర్‌తోపాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌పై కేసు నమోదు చేసింది. ఈ కేసులో భాగంగా, ఏసీబీ ఈ ఏడాది జనవరిలో కేటీఆర్‌ను రెండుసార్లు విచారించింది. అలాగే, జనవరి 16న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు కూడా కేటీఆర్ హాజరయ్యారు..తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, మీడియాతో మాట్లాడుతూ, ఈ నోటీసును రాజకీయ ప్రతీకారంగా అభివర్ణించారు. "మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ జారీ చేసిన నోటీసు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న రాజకీయ కుట్ర తప్ప మరొకటి కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నోటీసును మళ్లీ జారీ చేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా, వారి వైఫల్యాలను ప్రజల ముందు బయటపెడతాం," అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్పందన, కవిత?కేటీఆర్ మధ్య విభేదాల పుకార్లను తిప్పికొట్టడమే కాకుండా, బీఆర్ఎస్‌లో ఐక్యతను ప్రదర్శించే ప్రయత్నంగా కనిపిస్తుంది.బీఆర్ఎస్ కోణంలో.. కవిత ఆరోపించినట్లు, ఈ నోటీసు కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి జారీ చేసినదిగా భావిస్తున్నారు. ఫార్ములా?ఈ కేసు గతంలోనూ వివాదాస్పదమైన నేపథ్యంలో, ఈ నోటీసు బీఆర్ఎస్‌ను రాజకీయంగా బలహీనపరచడానికి ఉపయోగపడుతుందని వారు వాదిస్తున్నారు.ఏసీబీ కోణంలో.. ఫార్ములా?ఈ ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలపై చట్టపరమైన విచారణ జరుపుతున్నట్లు పేర్కొంటోంది. కేటీఆర్, అరవింద్ కుమార్‌లపై నమోదైన కేసు ఆధారంగా, విచారణను ముందుకు తీసుకెళ్లడం తమ బాధ్యతగా ఏసీబీ భావిస్తుంది.ఈ నోటీసు, తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలను మరింత పెంచింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను లేవనెత్తుతూ, ఈ నోటీసును రాజకీయ కుట్రగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం, అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్నామని, గత ప్రభుత్వ లోపాలను బయటపెడుతున్నామని వాదిస్తోంది. ఈవివాదం, రాబోయే రాజకీయ పరిణామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.కేటీఆర్‌కు ఏసీబీ జారీ చేసిన తాజా నోటీసు, తెలంగాణ రాజకీయాల్లో మరో వివాదానికి తెరలేపింది. కవిత ఈ నోటీసును రాజకీయ కుట్రగా ఖండించడం, బీఆర్ఎస్?కాంగ్రెస్ మధ్య ఉద్రిక్తతలను మరింత ఉధృతం చేసింది. ఈ ఘటన, రాజకీయాల్లో చట్టపరమైన విచారణలు, రాజకీయ ఉద్దేశాల మధ్య సన్నని గీతను స్పష్టం చేస్తుంది. రాబోయే రోజుల్లో ఈ కేసు ఎలాంటి వ

# మళ్లీ వెయిటింగ్...

హైదరబాద్, జూన్ 16, (

తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ జరిగిన తర్వాత ఏదో జరుగుతుందని అందరూ అనుకున్నారు. అలా ఆశించిన వారికి నిరాశ మిగిలింది. కానీ గతం కంటే భిన్నంగా ఈసారి మంత్రివర్గ విస్తరణ జరిగి వారం రోజుల గడుస్తున్నా అసంతృప్తి పెద్దగా లేదు. దాదాపు రెండేళ్ల తర్వాత జరిగిన మంత్రి వర్గ విస్తరణ జరిగితే పెద్దయెత్తున అసంతృప్తి చెలరేగుతుందని అందరూ భావించారు. మంత్రి పదవులు కోరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో పాటు ఇంకా ఆరు మంత్రి పదవులు భర్తీ చేయాల్సి ఉండటంతో అందరూ ఆశలు పెంచుకున్నారు. సామాజిక కోణంలోనూ, ప్రాంతాల వారీగా, జిల్లాల వారీగా తమకు అవకాశం లభిస్తుందని చాలా మంది అనుకున్నారు. విస్తరణ జరిపితే అసంతృప్తి జ్వాలలు పెరుగుతాయని అంచాన వేసారంటున్నారు. అందుకే హైకమాండ్ కూడా ఇంతకాలం వాయిదా వేసుకుంటూ వస్తుంది. అయితే హైకమాండ్ తెలివిగా మూడు పోస్టులను మాత్రమే భర్తీ చేసింది.అదీ రెండు సామాజికవర్గాలకు చెందిన వారిని మాత్రమే ఎంపిక చేసింది. ఎస్సీ మాల సామాజికవర్గం నుంచి గడ్డం వెంకటస్వామిని ఎంపిక చేసింది. ఈయనతో పాటు అదే జిల్లాకు చెందిన సీనియర్ నేత ప్రేమ్ సాగర్ రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుకున్నప్పటికీ ఆయనకు లభించలేదు. కానీ ప్రేమ్ సాగర్ రావును తర్వాత కాంగ్రెస్ అగ్రనేతలు మాట్లాడి ఆయనకు నచ్చ చెప్పారు. తన నియోజకవర్గానికి తానే రాజు.. తానే మంత్రి అనిచెప్పి కార్యకర్తలకు సర్దిచెప్పారు. దీంతో తాను పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నానని ప్రకటించారు. హైకమాండ్ నిర్ణయాన్ని శిరసావహిస్తామని ప్రేమ్ సాగర్ రావు ప్రకటించి ప్రత్యర్థుల ఆశలపై ఆయన నీళ్లు చల్లారు.దీంతో ఆదిలాబాద్ జిల్లాలో అసంతృప్తి లేనట్లే అనుకోవాలి. ఇక నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్ రెడ్డి సీనియర్ నేత ఆయన తనకు కేబినెట్ లో అవకాశం కల్పించాలని కోరారు. నిజామాబాద్ జిల్లా నుంచి కేబినెట్ లో ఎవరికీ ప్రాతినిధ్యం లేకపోవడంతో తనకు అవకాశం కల్పిస్తారని భావించారు. ఇక మునుగోడు ఎమ్మెల్యేకోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. తనకు హోం మంత్రి కావాలంటూ ఆయన కామెంట్స్ కూడా గతంలో చేశారు. జానారెడ్డి తన మంత్రి పదవికి అడ్డంపడ్డాడని కూడా గతంలో వ్యాఖ్యానించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ విస్తరణ తర్వాత మంత్రి పదవి శాశ్వతం కాదని, ఎమ్మెల్యే అంతకు మించిందని అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కొంత అసంతృప్తికి లోనైనా మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడటంతోఆయనకూడా సెట్ అయ్యారు. ఇలా కాంగ్రెస్ లో అసంతృప్తి పెరుగుతుందని ఆశించిన వారికి ఆశాభంగమే మిగిలిందని చెప్పాలి. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత మిగిలిన మూడు పోస్టులను భర్తీ చేస్తామని చెప్పడంతో వెయిట్ చేయడానికే నేతలు సిద్ధమయ్యారు తప్ప గీత దాటాలని ఎవరూ అనుకోవడం లేదు.

# వేములవాడలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

వేములవాడ

దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ లో ఏళ్ళ తరబడి ఎదురుచూస్తున్న రోడ్ల విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. మూలవాగు బ్రిడ్జి నుండి దేవాలయం వరకు 750 మీటర్ల వరకు రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు. 47 కోట్లతో 80 ఫిట్ల వరకు విస్తరణ పనులు చేపడతారు. 250 మంది బాధితుల్లో ఇప్పటికే 70 మందికి నష్ట పరిహారం చెక్కులు అందజేశారు. మిగతా వారికి త్వరలో అందజేయనున్నారు. దుకాణాలను, ఇల్లు ఖాళీ చేయాలని 15 రోజుల క్రితమే నోటీసులు జారీ చేసిన అధికారులు, నిన్న ప్రభుత్వ భవనాలు, దేవాలయానికి సంబంధించిన దుకాణాలను తొలగించారు. ఈరోజు నష్టపరిహారం అందుకున్న వారి నివాసాలను తొలగిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, ఆర్ అండ్ బి, వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. కోర్టు స్టే ఉన్న ఇళ్ళను మినహా అన్నిటిని తొలగిస్తున్నట్లు అధికారులు చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాల తొలగింపుతో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఫైరింజన్లను ఏర్పాటు చేశారు. సెస్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆందోళన నిరసనలకు తావు లేకుండా సజావుగా రోడ్డు విస్తీరణ పనులు కొనసాగేలా అధికారులు చర్యలు చేపట్టారు..

# మేఘాలయ హనీమూన్ కేసు.. షాకింగ్ నిజాలు

భోపాల్, జూన్ 16, (న్యూస్ పల్స్)

దేశవ్యాప్తంగా మేఘాలయ ఘటన సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో మరిన్ని సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. దీంతో అవాక్కవడం పోలీసుల వంతవుతున్నదిఅప్పట్లో బాలీవుడ్లో ఓ సినిమా వచ్చింది. పెద్దలు మాత్రమే చూసే విధంగా ఆ చిత్రాన్ని రూపొందించారు. అందులో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ మహిళ.. తన ప్రియుడు సహాయంతో భర్తను అంతం చేయడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంది. చివరికి దొరికిపోతుంది. ఆ సినిమా మాదిరిగానే సోనం వ్యవహరించినట్టు కేసు దర్యాప్తులో వెల్లడైన నిజాల ద్వారా తెలుస్తోంది. రఘు వంశీ తో వివాహం చేరడానికి అంటే ముందే సోనం ప్రేమలో ఉంది. అయితే ఆమె ప్రేమను ఇంట్లో కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. పైగా అతనితో వివాహం జరిపించడానికి ఏమాత్రం అంగీకరించలేదు. కుటుంబ సభ్యులు ఒత్తిడి తీసుకురావడంతో రఘువంశీని వివాహం చేసుకుంది. వివాహం చేసుకున్న తర్వాత అతడిని భర్తగా అంగీకరించలేకపోయింది. అంతేకాదు అతడిని అంతం చేస్తే ప్రియుడితో కలిసి జీవితాన్ని కొనసాగించవచ్చని తప్పుడు అంచనా వేసింది. ఇందులో భాగంగానే తన భర్తను హనీమూన్ నిమిత్తం మేఘాలయ తీసుకెళ్లింది. అక్కడ శారీరకంగా కలవడానికి ఒప్పుకోలేదు. పైగా కామాఖ్య దేవి ఆలయంలో పూజలు చేసిన తర్వాతే శారీరకంగా ఒక్కటవుదామని అతని ముందు ప్రతిపాదన ఉంచింది.. దీంతో అతడు ఆమె చెప్పినట్టు విన్నాడు. కామాఖ్య ఆలయానికి వెళ్ళినప్పుడు.. అక్కడే అతని అంతం చేయాలని భావించింది.. ఆ తర్వాత కూడా సోహ్రా అనే ప్రాంతంలో అంతం చేయడానికి ప్రయత్నించింది. దానికంటే ముందు గుహావాటి ప్రాంతంలోనే తొలిసారి అతని అంతం చేయాలని ప్రయత్నించింది. ఇలా మూడుసార్లు ఆమె ప్రయత్నాలకుఫలమయ్యాయి.రఘువంశని అంతం చేయడానికి మూడుసార్లు ప్రయత్నాలు చేయడం.. అవి విఫలం కావడంతో సోనం నాలుగోసారి గట్టి ప్రణాళిక రూపొందించింది. తన ప్రియుడిని మేఘాలయకు రప్పించుకుంది. అంతకుముందు నుంచి అతడు అక్కడ ఉంటున్నప్పటికీ.. నాలుగో సారి మాత్రం గట్టి ప్రణాళిక రూపొందించారు. రఘు వంశీని కావాలని కొండ ప్రాంతానికి తీసుకెళ్లిన సోనం.. ఆ తర్వాత అతడిని అక్కడే అంతం చేయించింది. ప్రియుడు, ఇతర నిందితులు రఘువంశీని అంతం చేస్తుండగా.. సోనం దగ్గరుండి చూసింది. అతడు చనిపోయాడు అని నిర్ధారించుకున్న తర్వాత.. మేఘాలయ నుంచి వెళ్లిపోయింది. రకరకాల ప్రాంతాలు తిరిగింది. తన ఫోన్ కూడా పగలగొట్టింది.తనను ఎవరో అపహరించారు అనే నాటకం కూడా ఆడింది. అయితే పోలీసులు అత్యంత లోతుగా దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో సోనం అసలు వ్యవహారం బయటికి వచ్చింది. ఇక ప్రస్తుతం కస్టడీలో ఉన్న సోనం ను పోలీసులు విచారిస్తుండగా సంచలన నిజాలు వెలుగుచూస్తున్నాయి. కాగా సోనం ఈ స్థాయిలో దారుణానికి పాల్పడిన నేపథ్యంలో ఆమెపై ఎంత కఠినమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్చేస్తున్నారు. అంతేకాదు రఘువంశీ కుటుంబాన్ని వారు పరామర్శించారు.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# అమెరికా డిమాండ్లకు నో చెప్పిన భారత్

న్యూఢిల్లీ, జూన్ 16,(న్యూస్ పల్స్)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కోసం 'టేక్ ఇట్ లేదా లీవ్ ఇట్' విధానంతో ముందుకొచ్చినప్పటికీ, భారత్ ఒత్తిడి వ్యూహాన్ని తిరస్కరించి, రెండు దేశాలకూ సమాన ప్రయోజనం చేకూర్చే ఒప్పందం కోసం చర్చలను కొనసాగిస్తోంది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య చర్చలు సంక్లిష్టమైనవని, అన్నీ ఖరారు కాకముందే ఏదీ నిర్ణయించబడదని స్పష్టం చేశారు.డొనాల్డ్ ట్రంప్, అమెరికాతో వాణిజ్యంలో లోటును తగ్గించే లక్ష్యంతో, భారత్‌తో సహా అనేక దేశాలపై భారీ సుంకాలు విధించే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. ఏప్రిల్ 2025లో భారత వస్తువులపై 27% వరకు సుంకాలు విధించిన ట్రంప్, ఈ సుంకాలను మరింత పెంచేందుకు 90 రోజుల గడువు ప్రకటించారు. ఈ గడువు లోపు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్‌పై ఒత్తిడి తెచ్చారు. ట్రంప్, భారత్ అమెరికా వస్తువులపై సుంకాలను పూర్తిగా తొలగిస్తూ ఒప్పందం ప్రతిపాదించిందని పేర్కొన్నారు, కానీ ఈ వాదనను భారత్ ఖండించింది.విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని, అయితే ఒప్పందం రెండు దేశాలకూ ప్రయోజనకరంగా ఉండాలని స్పష్టం చేశారు. 'అన్నీ ఖరారు కాకముందే ఏదీ నిర్ణయించబడదు,' అని తెలిపారు. ట్రంప్ 'జీరో టారిఫ్' వాదనను తిరస్కరిస్తూ. భారత్, వ్యవసాయం, డెయిరీ, ఆటోమొబైల్ వంటి సున్నితమైన రంగాలలో సుంకాలను తగ్గించడానికి వెనుకాడుతోంది, ఎందుకంటే ఈ రంగాలు దేశీయ రైతులు, పరిశ్రమలకు కీలకమైనవి. అయితే, విమానాలు, లగ్జరీ కార్లు, వైద్య పరికరాలు వంటి అమెరికా నుంచి దిగుమతి చేసుకునే కొన్నిఉత్పత్తులపై సుంకాల తగ్గింపును భారత్ పరిశీలిస్తోందని నివేదికలు సూచిస్తున్నాయి.అమెరికా, భారత్‌తో 45 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును ఎదుర్కొంటోంది. దీనిని తగ్గించేందుకు ట్రంప్ భారత్‌పై ఒత్తిడి పెంచుతున్నారు. 2024-25లో రెండు దేశాల మధ్య వాణిజ్యం 131.84 బిలియన్ డాలర్లకు చేరింది, అమెరికా భారత్‌కు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతోంది. అయితే, భారత్ వ్యవసాయ రంగంలో సుంకాల తగ్గింపును వ్యతిరేకిస్తోంది, ఎందుకంటే ఇది దేశీయ రైతుల జీవనోపాధిని ప్రభావితం చేస్తుంది. అంతేకాక, ట్రంప్ యొక్క ఒత్తిడి వ్యూహం భారత్‌లో అసంతప్తిని కలిగిస్తోంది. ముఖ్యంగా ఆయన భారత్-పాకిస్తాన్ వివాదంలో జోక్యం చేసుకునే ప్రయత్నాలపై భారత్ అసంతృప్తి వ్యక్తం చేసింది.భారత్, అమెరికాతో వాణిజ్య చర్చల్లో తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడానికి కట్టుబడి ఉంది. గతంలో యూకే, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఇఈటం) వంటి దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న భారత్, అమెరికాతో కూడా సమతుల్య ఒప్పందం కోసం ప్రయత్నిస్తోంది. భారత్, జన్యుపరంగా మార్పు చేసిన పంటలు, వైద్య పరికరాల ధరల నియంత్రణ, డేటా స్థానికీకరణ విధానాలపై అమెరికా డిమాండ్లను తిరస్కరించింది. అంతేకాక, అమెరికా సుంకాలకు ప్రతీకారంగా సుంకాలు విధించే బదులు, చర్చల ద్వారా పరిష్కారం కోసం భారత్ ఎంచుకుంది.జూలై 9న ట్రంప్ యొక్క 90 రోజుల సుంకాల విరామం ముగియనుంది, ఇది భారత్‌కు కీలకమైన గడువు. ఈ గడువులోపు ఒప్పందం కుదరకపోతే, భారత ఎగుమతులపై అధిక సుంకాలు విధించే అవకాశం ఉంది. ఇది వజ్రాలు, ఔషధాలు, ఆటో భాగాలు వంటి రంగాలను ప్రభావితం చేయవచ్చు. అయితే, భారత్ తన సుంకాల అంతరాన్ని 13% నుంచి 4%కు తగ్గించే ప్రతిపాదనను పరిశీలిస్తోందని, దీనికి బదులుగాఅమెరికా సుంకాల నుంచి మినహాయింపు కోరుతోందని నివేదికలు సూచిస్తున్నాయి. అంతేకాక, భారత్ అమెరికా నుంచి ఎల్ఎన్‌జీ, రక్షణ సామగ్రి దిగుమతులను పెంచే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది.భారత్, ట్రంప్ యొక్క 'టేక్ ఇట్ లేదా లీవ్ ఇట్' వాణిజ్య డిమాండ్లను తిరస్కరించి, సమతుల్య, రెండు దేశాలకూ ప్రయోజనకరమైన ఒప్పందం కోసం చర్చలను కొనసాగిస్తోంది. వ్యవసాయం వంటి సున్నితమైన రంగాలను రక్షిస్తూనే, అమెరికాతో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. జూలై 9 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈ చర్చల ఫలితం భారత్-అమెరికా ఆర్థిక సంబంధాల భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# లక్ష్మీపూర్ వద్ద ఎక్స్ ప్రెస్ బస్సు ఆపాలి: సానుకూలంగా స్పందించిన డి. ఎం శ్రీనివాసులు.



మంచిర్యాల/జూన్ 16,(భారత శక్తి): మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామ%శీ% జాతీయ రహదారి 63 లక్ష్మీపూర్ వద్ద ఎక్స్ ప్రెస్ బస్సులు ఆపాలని సిపిఎం పార్టీ బృందం బస్సు డిపో మేనేజర్ శ్రీనివాసులు కు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంకె రవి (సిపిఎం జిల్లా కార్యదర్శి) మాట్లాడుతూ జాతీయ రహదారి 63 లక్ష్మీపూర్ గ్రామం వద్ద ఎక్స్ ప్రెస్ బస్సులు ఆపకపోవడం వల్ల, అన్నారం, వేల్మపల్లి ,అర్జునగుట్ట, రాపనపల్లి, లక్ష్మీపూర్ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొవడం జరుగుతుంది. ఈ ఐదు గ్రామాల ప్రజలకు ఆర్టీసీ సౌకర్యం ఉండాలంటే లక్ష్మీపూర్ బస్ స్టాప్ వద్ద ఎక్స్ ప్రెస్ బస్సులు ఆపాలని కోరారు.

దీనిపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోడంకి చందు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు,దుంపల రంజిత్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మీ ఇంటి పెద్దకొడుకుగా చెప్తున్నా..!

- అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తా... నాదీ హామీ
- ఇచ్చిన హామీల్లో కొన్ని అమలు చేశాం.... మిగిలినవి కూడా చేస్తాం
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- నేలకొండపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూన్ 16:

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించే బాధ్యత... మీ ఇంటి పెద్దకొడుకుగా నాదీ హామీ అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండల పర్యటనలో భాగంగా గువ్వలగూడెంలో అంతర్గత సీసీ రోడ్లకు, కోరట్లగూడెం, ముటాపురం గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వివిధ పార్టీలకు చెందిన పలువురికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పలుచోట్ల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో ఇచ్చిన హామీలు అనేకం అమలు చేసిందని.... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా మిగిలిన హామీలను కూడా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు రాలేదని ఎవరూ బాధపడొద్దని .... విడతల వారీగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. దాదాపుగా ప్రతీ ఇంటికి ఏదో ఒక్క సంక్షేమ పథకం చేర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రితో పాటు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , పలువురు జిల్లా, నియోజకవర్గ, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సమేతంగా శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



పటాన్‌చెరు, జూన్ 16 (భారత శక్తి):

పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఇటీవల వివాహం జరిగిన తన కుమార్తె జాగృతి సాయి, అల్లుడు రాగం అనిరుద్ యాదవ్ నూతన దంపతులు మరియు కుటుంబ సమేతంగా తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది.

# యోగాంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వైయస్సార్ కడప జిల్లా,జూన్ 16(భారత శక్తి)

: గండికోట లోయ వద్ద ఈ నెల 18 తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

సోమవారం పిజిఆర్ఎస్ హాలులో అర్జీలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తోందని అన్నారు.యోగాంధ్ర- 2025 మాసోత్సవాల్లో భాగంగా జూన్ 18వ తేదీన గండికోట లోయ వద్ద ఉదయం 6 గం నుండి 8 గం ల మధ్య నిర్వహించే యోగాంధ్రా కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవ్వాలని సూచించారు. అలాగే జమ్మలమడుగు నియోజకవర్గం మండలాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులందరూ హాజరు కావాలన్నారు. అలాగే అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు జూన్ 21వ తేదీన జరగబోయే యోగాంధ్ర కార్యక్రమానికి ఎనిమిది లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. జూన్ 20వ తేదీ వరకు సమయం ఉన్నందున రిజిస్ట్రేషన్ ల సంఖ్య పెంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# అతి త్వరలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదుల ప్రారంభం

**-ఏడు కోట్ల రూపాయల సిఎస్ఆర్ నిధులతో కళాశాలలో అభివృద్ధి పనులు..**

**-శాశ్వత ప్రాతిపదికన పాలిటెక్నిక్ కళాశాల శాశ్వత భవనం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్‌చెరు, జూన్ 16 (భారత శక్తి ):

పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రాన్ని ఎడ్యుకేషనల్ హబ్ గా తీర్చిదిద్దడంలో భాగంగా.. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవనంలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో ఏడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన



15 అదనపు తరగతి గదులు పూర్తయ్యాయని.. అతి త్వరలో వాటిని ప్రారంభించనున్నట్లు స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.

ఇటీవల పటాన్‌చెరు కు మంజూరైన పాలిటెక్నిక్ కళాశాలకు శాశ్వత ప్రాతిపదికన తోషిబా కంపెనీ సహకారంతో 14 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆధునిక వసతులతో భవనం నిర్మించేందుకు ప్రతిపాదన సిద్ధం చేశామని ఆయన తెలిపారు.

సోమవారం సాయంత్రం పట్టణంలోని జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాల భవనాలను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకీ పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు నిర్మించాలన్న లక్ష్యంతో.. గత సంవత్సరం గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో ఏడు కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే ప్రతి తరగతి గదికి ఫర్నిచర్ అందించనున్నట్లు తెలిపారు. అతి త్వరలో వీటిని ప్రారంభించి.. విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు తెలిపారు.

ఇటీవల మంజూరైన పాలిటెక్నిక్ కళాశాల తరగతుల కోసం డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని కొన్ని గదులను కేటాయించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే శాశ్వత ప్రాతిపదికన భవనం నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. తోషిబా పరిశ్రమ సహకారంతో 14 కోట్ల రూపాయలతో ఆధునిక వసతులతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే భూమిని సైతం కేటాయించడం జరిగిందని తెలిపారు.


వీటితోపాటు మండల పరిషత్, జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలోనూ కోటి రూపాయలతో అదనపు తరగతి గదులు నిర్మించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# దర్జాగా ప్రభుత్వ భూమిలో కబ్జాలు

**-కబ్జాదారులను భూ అక్రమణదారులను ఆపాలి**

**-అధికారులకు మొరపెట్టుకుంటున్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మెన్ మరియు కమిటీ సభ్యులు**



అమీన్ పూర్, జూన్ 16 (భారత శక్తి) : బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం సంగారెడ్డి జిల్లాలోని ఎంతో ప్రాచీనమైనది ప్రాముఖ్యత కలిగినది. ఈ గుడి ఉన్న సర్వేనెంబర్ 993లో సుమారుగా 423 ఎకరాల ప్రభుత్వ భూమి కలద ఇప్పుడు అది 60 ఎకరాలకు మిగిలింది అని అధికారులు చెబుతున్నారు. కబ్జాదారులను అధికారులు ఎంత కట్టడి చేస్తున్నా రాజకీయ నాయకులు అండదండలతోటి కబ్జాలకు



తెగబడుతున్నారు.

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ని ఈరోజు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మెన్ మరియు కమిటీ సభ్యులు కలవడం జరిగింది. దేవస్థాన ఆవరణలో లారీలతో మొరం తో వ్యాపారం చేస్తున్నారు. ఇలా చేయడం వలన భక్తులకు చాలా ఇబ్బంది కలుగుచున్నాదని, ఆ భూమిని దేవస్థాన పార్కింగ్ కోసం కేటాయించాలని కోరడమైనది. కలెక్టర్ వెంటనే %=ణూ% ని ఆదేశించడమైనది, %= ణ ూ% వెంటనే స్పందించి %వీ=ూ% కి కఠిన చెర్యలు తీసుకోవలసినదిగా ఆదేశించారు.

# మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన నీలం మధు ముదిరాజ్.

## -ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శాలువాలతో సత్కరించుకున్న ఇరువురు.



సంగారెడ్డి, జూన్ 16 (భారత శక్తి): నూతన మంత్రిగా ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని నీలం మధు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించనున్న సందర్భంగా హైదరాబాద్ ఆరామ్ గార్ లోనీ మంత్రి నివాసంలో ఆయనను కలిసి పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నీలం మధుని మంత్రి ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఆలింగనం చేసుకుని సాదరంగా ఆహ్వానించి ఇరువురు శాలువలతో సత్కరించుకున్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని అమలు చేస్తూ అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి అందరం కలిసికట్టుగా పనిచేస్తూ మన వర్గాల సమస్యలు,ఆర్థికాభివృద్ధి, రాజకీయ అవకాశాలకు కృషి చేద్దామని చర్చించుకున్నారు.

# కుల సంఘాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం.

## పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



తెల్లాపూర్, జూన్ 15 (భారత శక్తి): కుల సంఘాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మరనాత చర్చికి 80 గజాలు, నాయి బ్రాహ్మణ సంఘానికి కొమరం భీమ్ కాలనీలో 150 గజాల స్థలాలను కేటాయిస్తూ ఆయా సంఘాల అధ్యక్షులకు ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు వీటిని అందజేసినట్టు తెలిపారు.

సమాజంలో వెనుకబడిన వర్గాల ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కుల సంఘాల బాధ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోమిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, వెలిమెల పిఎసిఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, ప్రభుత్వ ప్లీడర్ ప్రభు, రాగం దేవేందర్ యాదవ్, లచ్చిరామ్ నాయక్, బాబ్జి, శ్రీశైలం, నాగరాజు, శ్రీకాంత్, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి : శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్చెరు, జూన్ 16 (భారత శక్తి): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం గ్రామంలో గల మహిధర లగ్జారియా కాలనీలో నూతనంగా నిర్మించనున్న శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం భూమి పూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కాలనీలో నూతనంగా నిర్మించిన క్లబ్ హౌస్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోచారం గ్రామ పరిధిలో 700 గృహాలతో అత్యాధునిక వసతులతో గేటెడ్ కమ్యూనిటీ ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. కాలనీకి మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించాలన్న కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు.. త్వరలోనే సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మంచినీరు అందిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ సమీపంలో గల డంపింగ్ యార్డ్ తరలించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి సైతం సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. నియోజకవర్గంలో ఏర్పాటు అవుతున్న నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహీధర ప్రాజెక్ట్స్ సీఎండి ప్రశాంత్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఎంపీటీసీ బిక్షపతి, ముత్తంగి పిఎసిఎస్ అధ్యక్షులు బిక్షపతి, ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు స్వాతి రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం : శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

## -శివానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన



జిన్నారం, జూన్ 16 (భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులతో పాటు స్థానిక పరిశ్రమల సహకారంతో ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. జిన్నారం మండలం శివానగర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో 50 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న అదరపు తరగతి గదుల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ సంస్థల సహకారంతో ఆధునిక వసతులతో నూతన పాఠశాలల భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాల కోసం. శివానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరో రెండు అదరపు అంతస్తుల నిర్మాణానికి న్యూ ల్యాండ్ పరిశ్రమ కోటి రూపాయలు అందించేందుకు అంగీకరించిందని తెలిపారు..ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, న్యూ ల్యాండ్ పరిశ్రమ ప్రతినిధులు డి.వి.రెడ్డి, రాజు, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వైయస్సార్ కడప జిల్లా, జూన్ 16(భారత శక్తి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం సభ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ లు హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని..ఒంటిమిట్ట మండలానికి చెందిన వెంకటసుబ్బమ్మ తమ పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని అభ్యర్తించారు. తొండూరు మండలానికి చెందిన శ్రీనివాసులు పంట నష్టపరిహారం ఇప్పించాలని అర్జీని సమర్పించారు.వేంపల్లి మండలానికి లక్ష్మీ నారాయణ తన భూ సమస్యను పరిష్కరించాలని అర్జీని సమర్పించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఎస్డీసీ వెంకటపతి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, డిఆర్డీఏ పిడి రాజ్యలక్ష్మి, మెప్మా పిడి కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక వసతులతో మోడల్ పోలీస్ స్టేషన్లు

## -బొల్లారం పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

బొల్లారం, జూన్ 16 (భారత శక్తి): ఆధునిక వసతులతో పటాన్చెరు నియోజకవర్గంలో మోడల్ పోలీస్ స్టేషన్లు నిర్మిస్తున్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 248 లో ఒక ఎకరా స్థలంలో హెట్రో లేబరేటరీస్ సౌజన్యంతో మూడు కోట్ల 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన మోడల్ పోలీస్ స్టేషన్ పనులకు ఆదివారం ఉదయం మెదక్ ఎంపీ రఘునందన్ రావు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఐజి సత్యనారాయణ గౌడ్, జిల్లా ఎస్పీ పరితోష్ సంతోష్ కుమార్ లతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ ఇండియా గా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించాలన్న లక్ష్యంతో నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. మండల కేంద్రమైన గుమ్మడిదల లోను హెట్రో లేబరేటరీస్ సౌజన్యంతో రెండు పోట్లా 50 లక్షల రూపాయలతో మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అమీన్పూర్, పటాన్చెరు, కొల్లూరు, పోలీస్ స్టేషన్లను పునర్నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతో పూర్తి స్థాయి వసతులతో వీటిని నిర్మిస్తున్నామని తెలిపారు. నిరు పేద, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు నివసించే పటాన్చెరు నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలతో పాటు సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. పటాన్చెరు నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న హెట్రో లేబరేటరీస్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, హెట్రో లేబరేటరీస్ డైరెక్టర్ జి. మోహన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవి బాబు, సిఐలు వినాయక్ రెడ్డి, రవీందర్ రెడ్డి, స్వామి గౌడ్, నరేష్, నయిమొద్దీన్, లాలు నాయక్, బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, జిన్నారం మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, చంద్రా రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# జీవో 118 కన్వీనియన్స్ డీడ్ లను ఆపింది కాంగ్రెస్ నేత మధుయాష్కి: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

-జీవో బోగోస్ అంటూ చేస్తున్న విష ప్రచారం తగదు ..

-కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలి...

-చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ సమస్యకు పరిష్కారం చూపాలి.



ఎల్బీనగర్, జూన్ 16 (భారత్ శక్తి): అప్పటి బారాస ప్రభుత్వం ఎల్బీనగర్ ప్రజల భూ సమస్యల పరిష్కారం తీసుకువచ్చిన జీవో 118 ను ఆపింది కేవలం కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బి.యన్.రెడ్డి డివిజన్ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడారు. ఎల్బీనగర్ లో రిజిస్ట్రేషన్ ల పరిష్కారం కోసం అప్పటి అధికారులు మంత్రి కేటీఆర్, ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిస్థాయిలో చర్చించి గజానికి 250 రూపాయలు చెల్లించి కన్వీనియన్స్ డీ డ్ లు అందించామన్నారు. జనరల్ ఎలక్షన్స్ కోడ్ రావడంతో దరఖాస్తు చేసుకున్న వారిలో 25 శాతం మందికి అందించ లేకపోయామన్నారు.2020 లో అలాగే నూతన మున్సిపల్ చట్టం తెచ్చినప్పుడు జీవో 168/2020 కూడా సవరించడం జరిగింది.

ఈ %+. ా% 168 మున్సిపల్ చట్టం ప్రకారం జిహెచ్ఎంసి పరిధిలో అనుమతులు లేని నివాసాలకు రిజిస్ట్రేషన్ చేయకూడదని పొందుపరిచారు.దీంతో 2009లో రిజిస్ట్రేషన్ మరియు ఇంటి పెర్మిషన్స్ ఆగిన తర్వాత ఇంటి అనుమతులు లేకుండా నిర్మించుకున్న వారికి కన్వినియన్స్ దీడ్స్ వచ్చిన కూడా రిజిస్ట్రేషన్ సమస్యలు తలెత్తాయి అన్నారు. కన్వీనియన్స్ డీ డ్ లు పొందినవారికి ఇంటి అనుమతులు, గృహ రుణాలు, రిజిస్ట్రేషన్ లు కూడా జరుగుతున్నాయని తెలిపారు. జీవో బోగస్, మునుగోడు ఎన్నికల స్టంట్ అంటూ ప్రసారం చేస్తున్న మధుయాష్కి గౌడ్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి అని హితువు పలికారు. మోసం అయితే ఎల్బీనగర్ బాధిత కాలనీల ప్రజలకు భరోసా ఇచ్చి ప్రభుత్వంలో ఉన్న వ్యక్తులు ప్రజలకు న్యాయం న్యాయం చేయాలి కదా..? మీరు ఏ విధంగా బాధిత కాలనీ వాసులకు న్యాయం చేస్తారో ప్రజలకు ఎందుకు చెప్పడం లేదు అని ప్రశ్నించారు.ప్రజా సమస్యల పట్ల నిజంగా శుద్ధి ఉంటే ప్రజలకు ఇబ్బందిగా ఉన్న జీవో నెంబర్ 168 ను సవరించాలి లేదా 168 జీవోను పూర్తిగా రద్దు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వినయంగా వినతి పత్రాలతో విజ్ఞప్తులు చేస్తున్నాం కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోతే మా విశ్వరూపం చూపిస్తాం సమస్య పరిష్కారం అయ్యేవరకు విశ్రమించానని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చేందుకు ప్రభుత్వం మెడలు వంచి అందరికీ కన్వీనియన్స్ డిడ్ లు అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమం లో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు అనీల్ చౌదరి, మాధవరం నరసింహా రావు, సుమన్ గౌడ్, సుధాకర్ యాదవ్, సతీష్ గౌడ్, కాజా శ్రీనివాస్, శశిధర్ రెడ్డి, రాఘవేందర్ రావు, బిక్షపతి,శశిధర్ రెడ్డి,బోయపల్లి శ్రీకాంత్ రెడ్డి, ఎస్కేడి నగర్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, బిఎన్ రెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు పురషోత్తం రెడ్డి, జనరల్ సెక్రటరీ ధన్ రాజ్, వైదేహినగర్ నార్త్ కాలనీ అధ్యక్షులు పోగుల రాంబాబు, శ్రీపురం నార్త్ కాలనీ అధ్యక్షులు ముత్యం రావు, శ్రీరాం నగర్ కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సాగర్ కాంప్లెక్స్ ఫేస్ 2 అధ్యక్షులు మహేందర్ రెడ్డి, లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం చైర్మన్ సోమి రెడ్డి,టెంపుల్ కన్వినర్ వెంకటేశ్వర్ రావు, బి ఏన్ రెడ్డి నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నవీన్, శ్రీనివాస్,కాలనీ వాసులు రాఘవ, విశ్వనాధ్,%ూఖణ% నగర్ కాలనీ వాసులు పాపారావు , రమణ, రమేష్ వెంకటేశ్వరా కాలనీ అధ్యక్షులు కృష్ణ, పాపిరెడ్డి కాలనీ అధ్యక్షులు శ్రీశైలం, మారుతినగర్ కాలనీ సెక్రటరీ వెంకట్ రెడ్డి, గాయత్రినగర్ బ్యాంకు కాలని సెక్రటరీ గడల శేఖర్, జాయింట్ సెక్రటరీ రవి కుమార్, బోల్ల శ్రీకాంత్,వెంకటా చలం యూత్ నాయకులు ప్రకాష్, అమర్థ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై జిల్లా అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జూన్ 16:వివిధ శాఖల జిల్లా అధికారులు ఆయా శాఖలకు సంబంధించి జిల్లాలో కలిస్తే సమస్యలకు వెంటనే స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ముగిసిన అనంతరం మొట్టమొదటిసారిగా జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి తన వద్దకు పంపి ఫైల్స్ కు పూర్తి సమాచారంను జత చేసి ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న ఫైల్స్ ను పంపాలని కలెక్టర్ జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలో తలెత్తి సమస్యలకు గురించి ఆయా శాఖల అధికారులు వెంటనే తనకు నేరుగా సమాచారం ఫోన్ ద్వారా గాని వాట్సాప్ కాల్ ద్వారా గాని ఇవ్వాలన్నారు.ఆయా శాఖలలో పెండింగ్ ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని ఈ కలెక్టర్ సూచించారు. త్వరలో వివిధ శాఖల వారీగా సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షకు అధికారులు పూర్తి సమాచారంతో నివేదికలు తయారు చేయాలని సూచించారు. నివేదికలలో తాజా సమాచారం కూడా అందుబాటులో ఉండాలన్నారు. అధికారులు జిల్లాలో పర్యటనలకు వెళ్ళినప్పుడు ఆయా



ప్రాంతాలకు సంబంధించిన పూర్తి సమాచారం వెంట అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులు స్పందించాలని సూచించారు. అధికారులు తమ వద్ద ఫైలు పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ , మాధురి, పద్మజరాణి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సముద్రాల రమేష్ పై చర్యలు తీసుకోవాలి : నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నక్క రాజు



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 16 (భారత శక్తి) : ములుగు మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన సముద్రాల రమేష్ పై చర్యలు తీసుకోవాలని నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నక్కరాజు అన్నారు. బండారుపల్లి గ్రామ శివారు లో సర్వే నెంబర్ 573/24 లో తను 2023 సంవత్సరంలో 20 గుంటలు భూమిని అదే గ్రామానికి చెందిన జేరిపోతుల చొక్కయ్య వద్ద నుండి కొనుగోలు చేసినట్లు రాజు తెలిపారు. దళితుడిని అయినందుకు పలువురు తనపై కుట్ర చేసి ఇబ్బందులు పెడుతున్నారని, సముద్రాల రమేష్ తండ్రి రాజయ్య అనే వ్యక్తి తరచూ తను కొనుగోలు చేసిన భూమి మీదకు వస్తూ దౌర్జన్యంగా ఆక్రమించుకోవడాకి ప్రయత్నిస్తూ, ఈ భూమిని జేరిపోతుల ప్రమీల వద్ద కౌలుకు తీసుకున్నాను, నీకు అమ్మినోల్లను అడుక్కోపో... అని ప్రతి సారి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. సముద్రాల రమేష్ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ములుగు పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు వాస్తవాలను పరిశీలించి తనకు న్యాయం చేయాలని నక్కరాజు కోరారు.

# మందమర్రి మండలంలో గుడుంబా తయారీని అరికట్టాలి.



మందమర్రి, జూన్ 16,(భారత శక్తి):మందమర్రి పట్టణ మండలంలోని గ్రామాలలో గుడుంబా మద్యం విచ్చలవిడిగా సరఫరా జరుగుతుందని మండలానికి చెందిన వంజర్ వెంకటేష్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వంజరి వెంకటేష్ మాట్లాడుతూ మందమర్రి మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీలో గుడుంబా క్రయవిక్రయాలు అతిగా జరుగుతున్నాయి. దానితో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.గుడుంబా తాగి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు.అంతేకాకుండా యువకులు ఈ గుడుంబాకీ బానిసలు అవుతున్నారు.గుడుంబా తాగి చిన్న వయసులో ప్రాణాలు పోతున్నాయి దానితో కుటుంబ పెద్దదిక్కు భర్తను కోల్పోవడం తో తల్లీ,పిల్లలు రోడ్డున పడుతున్నారు, అంతేకాకుండా ఆ పిల్లల పోషణ తల్లికి భారం అవుతుంది.గుడుంబా తయారీలో అనేక క్రిమిసంహారక,మత్తు పదార్థాలు యూరియా , ప్రమాదకరమైనటువంటి మందులు వాడి గుడుంబా తయారు చేస్తున్నారు దానితో గుడుంబా తాగి శరీరంలోని కిడ్నీలు అవయవాలు పూర్తిస్థాయిలో పాడైపోయి ప్రాణాలు కోల్పోతున్నారు.గత ప్రభుత్వం గుడుంబా తయారీ దారుల మీద పిడియాక్ట్ కేసులు పెట్టడం జరిగింది. కొంతమంది ఇప్పుడు ఒక ముఠాగా ఏర్పడి గుడుంబాన్నీ గ్రామాలకి విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారు. దానితో గ్రామాలలో ప్రజలు యువకులు గుడుంబాకి బానిసలై ప్రాణాలు కోల్పోతున్నారు.కావున ఈ గుడుంబా తయారు చేసి గ్రామాలకు సరఫరా చేసే వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన డీఈవో పాణిని



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 16 (భారత శక్తి) : 20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడిన ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలీప్ లు. ములుగు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య, సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఏసీబి డిఎస్పి సాంబయ్య ఇచ్చిన వివరాల ప్రకారం కన్నయ్య గూడెం మండలం లక్ష్మీపురం లో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ఫిబ్రవరిలో ఆక్సిడెంట్ కు గురై అక్టోబర్ వరకు ఆయన సిక్కులో ఉన్నాడని తను అక్టోబర్ 1న వచ్చి రిపోర్ట్ చేశాడని డి.ఎస్.పి తెలిపారు. సదరు వ్యక్తి డీఈఓ కార్యాలయం లో రిపోర్ట్ చేయమని తాము చెప్పామని అదే రోజు కార్యాలయానికి వచ్చి అతను రిపోర్ట్ ఇచ్చాడు అయితే ఆయన జాయినింగ్ రిపోర్ట్ మీద ఆయన మళ్లీ రీపోస్టింగ్ ఆర్డర్ ఇవ్వాలి కానీ ఆ రీపోస్టింగ్ ఆర్డర్ ఇవ్వకుండా అతను వద్దనే ఉంచుకొని డిఈఓ పాణిని అతను రూ.20 వేల లంచంగా ఇస్తేనే నేను రి పోస్టింగ్ ఆర్డర్ ఇస్తానని చెప్పి ఉపాధ్యాయుడిని డిమాండ్ చేసినందుకు ఆర్డర్ ప్రిపేర్ చేసేందుదుకు గాను ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ దిలీప్ కు రూ. 5 వేలు రూపాయలు ఇవ్వాలని చెప్పి అతను డిమాండ్ చేశాడు అయితే అక్టోబర్ 24 నుండి మొన్న స్కూలు బంద్ అయ్యేంతవరకు కూడా అతను డి ఈ ఓ కార్యాలయం కు పలుమార్లు తిరగడం జరిగిందని చివరకు పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ఈనెల 12న వస్తే 12 మళ్ళీ అదే మాట డీఈఓ మాట్లాడారని డి.ఎస్.పి పేర్కొన్నారు. సదరు ఉపాధ్యాయుడు నేను అంత మొత్తం ఇచ్చుకోలేను సార్ నేను నాకు జీతం కూడా రావట్లేదు అని చెప్పినప్పటికీ కూడా లేదు లేదు నాకు డబ్బులు ఇస్తేనే నీ పని అవుతుందని చెప్పడంతో అతను మా దగ్గరికి వచ్చి రిపోర్ట్ చేశాడు అతనికి డబ్బులు ఇచ్చి పని చేయించుకోవడం ఇష్టం లేక వరంగల్ లోని ఏసీబీ కార్యాలయాని కి వచ్చి రిపోర్టు చేశాడు ఆయన ఫిర్యాదు మేరకు తాము సోమవారం వారికి డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్గా డీఈవో పాణిని రూ.15 వేలు, ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ దిలీప్ కు 5 వేల చొప్పున దిలీప్ తీసుకుంటుండగా అతన్ని పట్టుకున్నామని డీఎస్పీ సాంబయ్య వెల్లడించారు. డబ్బులు కూడా రికవరీ చేసాము అలాగే ఫైల్ మూమెంట్ చెక్ చేస్తే ఫిబ్రవరిలోనే అతని జాయినింగ్ ఆర్డర్స్ రిపోర్ట్ తయారు చేసిందు కానీ అతను డబ్బులు ఇవ్వకపోవడం వల్ల అలాగే అతని దగ్గర పెట్టుకొని డబ్బులు వచ్చిన తర్వాత ఆర్డర్ బయటకి తీశాడు ఫిబ్రవరిలో తయారైనటువంటి ఆర్డర్ ఇప్పటివరకు కూడా ఇవ్వలేక పోవడంతో వారిద్దరిని అదుపులోకి తీసుకున్నాము మంగళవారం ఉదయం వరంగల్ లో ఉన్న ఏసీబీ కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా పని చేయడానికి లాభంగ డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 106, వరంగల్ రేంజ్ డిఎస్పి ఫోన్ నెంబర్ 9154388912 కు కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ అధికారులు ఎస్ రాజు, ఎల్ రాజు, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ సిఎండిని కలిసిన రివల్యూషన్ యూత్..

## -సిఎండి బలరాం నాయక్ ను కలిసిన జర్నలిస్టులు..

మందమర్రి, జూన్ 16,(భారత శక్తి): సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ సిఎండిని కలిసిన మందమర్రి రివల్యూషన్ యువజన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు అనిల్ భగత్ ఉపాధ్యక్షుడు అక్బర్ లు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్ లోని సింగరేణి భవన్ వేదికగా సిఎండి బలరాం నాయక్ ను కలిసి సీనియర్ పాత్రికేయులు మునీర్ విగ్రహం ఏర్పాటు అలాగే గని కార్మికులకు అందించే అవార్డులు మునీర్ పేరిట అందించాలనీ కోరారు. కోల్ బెల్ట్ లో సింగరేణి సంస్థ నిర్వహిస్తున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాలతో నల్ల నేలలో నెలకొన్న సామాజిక సమస్యల పై అక్షర రూపం ఇస్తున్న జర్నలిస్టులకు మునీర్ పేరిట ఉత్తమ జర్నలిస్ట్ అవార్డులు ప్రతి సంవత్సరం అందించాలని కోరారు. మునీర్ మృతి సమాజానికి తీరని లోటు అని, మునీర్ విగ్రహం ఏర్పాటు కోసం త్వరలో కోల్ బెల్ట్ లో మునీర్ అబిమానులతో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు అనిల్ భగత్ అక్బర్ లు తెలిపారు. బండ కింద బ్రతుకులకు బరోసా ఇచ్చిన మునీర్ మృతి నల్ల నేలకు తీరని లోటు అని సింగరేణి చరిత్రలో మునీర్ ప్రజల హృదయాలో సజీవంగా ఉంటారని, సీనియర్ పాత్రికేయులు మునీర్ జర్నలిస్టులకు ఆదర్శం అని బలరాం నాయక్ అన్నారు. ప్రవీణ్, సాయి, దీపక్, జాఫర్ తదితరులు ఉన్నారు.



# పేదల సొంతింటి ఆకాంక్ష నెరవేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**-పెండింగ్ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ఏడు రోజుల్లో పూర్తి**

**-ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో బఫర్ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల వివరాలు సేకరణ**

**-డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పారదర్శకంగా కేటాయించాలి**

**-ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), జూన్ 16:

పేదల సొంతింటి ఆకాంక్ష నెరవేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి స్థాయిలో మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలం, గ్రామానికి మొదటి విడతలో కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల సంఖ్య ప్రకారం, లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.



ఇందిరమ్మ కమీటిలను ఫాలో అప్ అవుతూ, బఫర్ సంఖ్యతో కలిపి లబ్దిదారుల జాబితా తెప్పించుకోవాలని అన్నారు. ఇందిరమ్మ కమిటీల నుంచి వచ్చిన జాబితాను మరోసారి ధృవీకరణ చేసి ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు.

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. పెండింగ్ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక, ప్రొసిడింగ్స్ పంపిణీ ప్రక్రియ వారం రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మంత్రుల ఆదేశాల మేరకు 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపికతో పాటు లబ్ధిదారుల వివరాలు సేకరించి బఫర్ జాబితా రూపొందించాలని అన్నారు.

ఖమ్మం జిల్లాలో లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా పూర్తి చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల రిపోర్ట్ అందించాలని అన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కంప్యూటర్ సిస్టం ర్యాండమైజేషన్ ద్వారా కేటాయింపు పూర్తి చేయాలని అన్నారు. అర్హులైన నిరుపేదలకు మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు చేరాలని, గతంలో లబ్దిదారులను కేటాయించని వాటికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ కమిటీ నుంచి లిస్ట్ తీసుకుని అధికారులు వెరిఫై చేసి లబ్దిదారుల ఎంపిక చేయాలని అన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని అన్నారు.ఖమ్మం జిల్లాలో నిర్మాణం పురోగతిలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వీటిని సొంత భూమి లేని నిరుపేదలకు కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల క్రింద నిధులు మంజూరు చేసి పూర్తి చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు.సమీక్ష లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ పైలెట్ గ్రామాలలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటివరకు 500 పైగా గ్రౌండ్ చేయడం జరిగిందని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో జడ్పి సీఈవో దీక్షా రైనా, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఆర్డీఓ లు జి. నరసింహరావు, ఎల్. రాజేందర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో చౌడూరి కి ఘన సత్కారం

## -దేశభక్తిని చాటిన కవి సమ్మేళనం



హైదరాబాద్, భారత శక్తి ప్రత్యేక ప్రతినిధి, జూన్ 16:పహల్గాం లో హిందూ పర్యాటకుల మీద జరిగిన దాడి యావత్ భారతావని మీద జరిగిన దాడి యని, దాని పర్యవసానంగా భారత్ జరిపిన “ఆపరేషన్ సిందూర్” పాకిస్తాన్ మతోన్మాద ఉగ్రవాదుల మీద ఉక్కు పాదం మోపిందని, అది ట్రయల్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని, కవులు, రచయితలు, సాహితీవేత్తలు ముక్త కంఠంతో పహల్గాం దుశ్చర్యలను తమ కవితల లో తీవ్రంగా ఖండించారని, ప్రతి భారతీయుని హృదయం పాకిస్తాన్ ఉగ్రవాదులపై ప్రతీకారంతో రగిలిపోయిందని ప్రముఖ సాహితీవేత్త, కవి పండితుడు, “సాహిత్య కళా విభూషణ” చౌడూరి నరసింహారావు అభిప్రాయపడ్డారు.ఈనెల 14న త్యాగరాజ గాన సభ (మారుతీ కళావేదిక) లో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సంస్థ మరియు తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి సంయుక్త సౌజన్యంతో.. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో “తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు” సందర్భంగా ‘ఆపరేషన్ సిందూర్’ అనే అంశం మీద జరిగిన కవి సమ్మేళనానికి ఆయన అధ్యక్షత వహించారు. కళాకారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు వైయస్ శర్మ ముఖ్య అతిథిగా, కార్యదర్శి సుప్రియ ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఈ కవి సమ్మేళనంలో చౌడూరి నరసింహారావు తో పాటు మొంద్రేటి సత్యవాణి, మండపాక అరుణ కుమారి, విజయ వాణి, వెంకట్, జిపిఎస్ సోమయాజులు, వేణుగోపాలచార్యులు తదితర కవులు ‘ఆపరేషన్ సిందూర్’ అంశంపై తమ కవితలను వినిపించారు. కళాకారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్న కవులందరినీ జ్ఞాపిక, ప్రశంసా పత్రము, శాలువాతో ఘనంగా సత్కరించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులంతా దేశభక్తిని, మన వీర జవానుల విజయ కీర్తిని అద్భుతంగా తమ కవితల్లో వినిపించారు. ఈ కవి సమ్మేళనం దేశభక్తిని బాగా చాటింది. వెంకట్ వందన సమర్పణ తో కవి సమ్మేళనం సంపన్నమైంది.

# 14 వేలకే కేరళ టూర్..
## ఐఆర్‌సీటీసీ ప్యాకేజీ వివరాలు ఇవీ..



ప్రకృతి సౌందర్యానికి నిలయం కేరళ రాష్ట్రం. చాలామందికి అక్కడి ప్రదేశాలను చుట్టిరావాలని ఉంటుంది. వారి కోసమే కేరళ హిల్స్ అండ్ వాటర్స్ పేరుతో ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీ తీసుకొచ్చింది. కేరళలోని అలెప్పీ, మున్నార్‌లోని అందాలు చుట్టొచ్చేందుకు అవకాశం కల్పిస్తోంది. ఈ యాత్ర మొత్తం ఐదు రాత్రులు, ఆరు పగళ్లు కొనసాగుతుంది. గుంటూరు, నల్గొండ, సికింద్రాబాద్, తెనాలి నుంచి ప్రతి మంగళవారం ట్రైన్ అందుబాటులో ఉంటుంది. టూర్ ముగిశాక మళ్లీ ఆయా స్టేషన్లలో దిగే వెసులుబాటు ఉంది. జూన్ 17 నుంచి సెప్టెంబర్ 23 వరకు ప్రయాణానికి టికెట్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రయాణం ఇలా..

సికింద్రాబాద్‌లో ప్రతి మంగళవారం మధ్యాహ్నం 12:20 గంటలకు (శబరి ఎక్స్‌ప్రెస్ నం: 17230) రైలు ప్రారంభమవుతుంది. రాత్రంతా ప్రయాణించాల్సి ఉంటుంది.

రెండో రోజు మధ్యాహ్నం 12:55 గంటలకు ఎర్నాకుళం స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ఐఆర్‌సీటీసీ సిబ్బంది మున్నార్ తీసుకెళ్తారు. ముందుగానే ఏర్పాటు చేసిన హోటల్‌లో ఆ రోజు రాత్రి బస ఉంటుంది.

మూడో రోజు ఉదయం ఎరవికులం నేషనల్ పార్క్, టీ మ్యూజియం, మెట్టుపెట్టి డ్యామ్, ఎకో పాయింట్‌లు వీక్షించడంతో ఆ రోజు పూర్తవుతుంది. మళ్లీ మున్నార్‌లోనే బస ఉంటుంది.

నాలుగో రోజు అలెప్పీ చేరుకుంటారు. ఆ రోజంతా అలెప్పీ చుట్టుపక్కనున్న ప్రదేశాలను సందర్శించడానికి వెళ్తారు. ఆ రాత్రి అక్కడే బస ఉంటుంది.

ఐదో రోజు అలెప్పీ నుంచి ఎర్నాకుళం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 11:20 గంటలకు శబరి ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నం: 17229) బయల్దేరుతుంది.

ఆరో రోజు మధ్యాహ్నం 12:20 గంటలకు సికింద్రాబాద్ చేరుకోవడంతో యాత్ర పూర్తవుతుంది.

ప్యాకేజ్ ఛార్జీలు..

కంఫర్ట్‌లో (థర్డ్ ఏసీ బెర్త్) ఒక్కో ప్రయాణికుడికి రూమ్ సింగిల్ షేరింగ్‌లో అయితే రూ.32,310, డబుల్ షేరింగ్‌కు రూ.18,870, ట్రిపుల్ షేరింగ్‌కు రూ.16,330 చెల్లించాలి. 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు విత్ బెడ్‌కు రూ. 10,190, విత్ అవుట్ బెడ్ అయితే రూ.7,860 చెల్లించాలి.

స్టాండర్డ్‌లో (స్లీపర్ బెర్త్) సింగిల్ షేరింగ్ అయితే రూ.29,580, డబుల్ షేరింగ్‌కు రూ.16,140, ట్రిపుల్ షేరింగ్‌కు రూ.13,600 చెల్లించాలి. 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు విత్ బెడ్‌కు రూ. 7,460, విత్ అవుట్ బెడ్ అయితే రూ.5,130 చెల్లించాలి.

ఇవి ప్యాకేజీలో భాగమే..

ఎంచుకున్న ప్యాకేజీని బట్టి రైల్లో 3 ఏసీ, స్లీపర్ క్లాస్ ప్రయాణం ఉంటుంది.

ప్యాకేజీని బట్టి ప్రయాణానికి ఏసీ వాహనం సమకూరుస్తారు.

కేరళలో మూడు రాత్రులు ఉండడానికి గదులు, ఉదయం అల్పాహారం ఉచితంగా లభిస్తుంది.

యాత్రికులకు ట్రావెల్ ఇన్సూరెన్స్ ఉంటుంది.

టోల్, పార్కింగ్ ఛార్జీలు వంటివి ప్యాకేజీలో భాగమే.

వీటి బాధ్యత యాత్రికులదే

మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం వంటివన్నీ యాత్రికులే చూసుకోవాలి.

పర్యటక ప్రదేశంలో ఎక్కడైనా ప్రవేశ రుసుములు ఉంటే వ్యక్తులే చెల్లించుకోవాలి.

బోటింగ్, హార్స్ రైడింగ్ వంటివి ప్యాకేజీలో ఉండవు.

గైడ్‌ను యాత్రికులే ఏర్పాటు చేసుకోవాలి.

క్యాన్సిలేషన్ పాలసీ..

ఏదైనా కారణం వల్ల 15 రోజుల ముందు రద్దు చేసుకుంటే ఒక్కో టికెట్‌కు క్యాన్సిలేషన్ కింద రూ.250 మినహాయించి మిగతా మొత్తాన్ని రీఫండ్ చేస్తారు. అదే 8-14 రోజుల ముందు రద్దు చేసుకుంటే 25 శాతం, 4-7 రోజుల ముందు రద్దు చేసుకుంటే 50 శాతం టికెట్ ధర నుంచి మినహాయిస్తారు. ప్రయాణానికి నాలుగు రోజుల కంటే తక్కువ సమయంలో రద్దు చేసుకుంటే ఎలాంటి తిరిగి చెల్లింపులు ఉండవు. ఈ టూర్‌కు సంబంధించి మరిన్ని వివరాలు, బుకింగ్ కోసం ఈ ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను సందర్శించండి.

# కుటుంబాల పొదుపు తగ్గి..
## రుణాలు పెరిగాయి



దిల్లీ: వరుసగా మూడో ఆర్థిక సంవత్సరంలోనూ మన దేశంలో కుటుంబాల పొదుపు తగ్గింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కుటుంబాల పొదుపు జీడీపీలో 18.1 శాతానికి పరిమితమైందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. స్థూల దేశీయ పొదుపు 2014-15లో జీడీపీలో 32.2 శాతంగా ఉండగా, 2023-24 నాటికి జీడీపీలో 30.7 శాతానికి పరిమితమైంది. మరోవైపు కుటుంబాల రుణాలు జీడీపీలో 6.2 శాతానికి పెరిగాయి. గత దశాబ్ద కాలంలో చూస్తే ఇవి దాదాపు రెట్టింపయ్యాయి. వినియోగ అవసరాల కోసం ప్రజలు రుణాలపై ఆధారపడటాన్ని ఇది సూచిస్తోందని నివేదిక వెల్లడించింది. మరిన్ని అంశాలు ఇలా..

పొదుపు ధోరణులను గమనిస్తే..

గ్రామీణ ప్రాంతాలు కొంచెం మెరుగ్గా ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రామీణ పురుష కార్మికుల వేతనాలు 6.1% వృద్ధి చెందాయి. వరుసగా నాలుగో నెలా గ్రామీణ ద్రవ్యోల్బణం కంటే ఇది అధికం. ఆహార ద్రవ్యోల్బణం తగ్గడం, సానుకూల వ్యవసాయ పరిస్థితుల నేపథ్యంలో, గ్రామీణ గిరాకీ పుంజుకోవడం కొనసాగొచ్చని నివేదిక పేర్కొంది.

గ్రామీణ వినియోగదారు విశ్వాసం ఆశావహంగా ఉండగా, పట్టణ వినియోగదారు విశ్వాసం ప్రతికూలంగా ఉంది. రాబోయే రోజుల్లో ఈ రెండు విభాగాలపై మంచి అంచనాలే ఉన్నాయి.

ప్రధాన ఐటీ సంస్థల్లో ఉద్యోగ ఖర్చుల వృద్ధి 2022-23 మూడో త్రైమాసికంలో 26% కాగా, 2024-25 మూడో త్రైమాసికంలో ఇది 4 శాతానికి పరిమితం అయ్యింది. కార్పొరేట్ రంగంలో వ్యయాల హేతుబద్ధీకరణ ధోరణిని ఇది సూచిస్తోంది.

2025 ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి తగ్గింది. 2019 ఆగస్టు తర్వాత ఇదే అత్యల్పం. వంట నూనెలు (17.4%), పండ్లు (13.8%) ధరలు మాత్రమే అధికంగా కొనసాగాయి. రిజర్వాయర్‌ల్లో మంచి నీటి నిల్వలు, ఈ ఏడాది సగటు కంటే అధిక వర్షపాతం ఉండొచ్చన్న అంచనాలతో ఆహార ధరల స్థిరత్వం కొనసాగొచ్చని నివేదిక అంచనా వేసింది.

ఆర్‌బీఐ కీలక రేట్ల కోతలు, ఆదాయపు పన్ను ఉపశమనం, ధరల తగ్గుదల వంటివి గిరాకీ పెరగడానికి దోహదం చేయొచ్చు.



# మే నెలలో వాహన అమ్మకాల్లో స్వల్ప పెరుగుదల

%మే నెలలో దేశీయ ప్యాసింజర్ వెహికల్ హోల్‌సేల్ అమ్మకాలు 0.80 శాతం తగ్గి 3,44,656 యూనిట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే నెలలో 3,47,492 యూనిట్ల అమ్మకాలు జరిగాయని ఈ రోజు(సోమవారం) సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్(%ూ×ూవీ%) తెలిపింది. %ూ×ూవీ% విడుదల చేసిన తాజా డేటా ప్రకారం, తయారీదారుల నుంచి డీలర్లకు ద్విచక్ర వాహనాల సరఫరా మే నెలలో 2.20 శాతం పెరిగి 16,55,927 యూనిట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో ఇవి 16,20,084 యూనిట్లు. దేశీయ మార్కెట్లో మొత్తం త్రిచక్ర వాహనాల అమ్మకాలు గత ఏడాది మే నెలలో 55,763 యూనిట్లు కాగా, గత నెలలో 3.30 శాతం తగ్గి 53,942 యూనిట్లుగా నమోదయ్యాయని %ూ×ూవీ% తెలిపింది. అన్ని కేటగిరీలకు చెందిన మొత్తం వాహన హోల్‌సేల్ అమ్మకాలు గత ఏడాది మే నెలలో 19,76,674 యూనిట్లుగా ఉండగా, గత నెలలో 1.80 శాతం పెరిగి 20,12,969 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయని %ూ×ూవీ% తెలిపింది.

# 'భారత్‌లో తయారీ' బంపర్‌హిట్




దిల్లీ: భారత్‌లో తయారీ కార్యక్రమం మరో ఘనత సాధించింది. చైనాకు చెందిన స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, మన దేశంలో స్థాపించిన యూనిట్లలో తయారు చేసిన ఉత్పత్తులను అమెరికా, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేయడం ప్రారంభించాయి. గతంలో చైనా, వియత్నాం నుంచి ఆ దేశాలకు ఈ ఉత్పత్తులు తరలి వెళ్లేవి. మన దేశంలో ఉత్పత్తి సామర్థ్యాలు మెరుగై, ప్రభుత్వం నుంచి స్థిరంగా ప్రోత్సాహకాలు లభించడంతో.. ఎలక్ట్రానిక్స్ తయారీ కార్యకలాపాలు బాగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే మన దేశంలోని చైనా యూనిట్లు కూడా ఇక్కడ నుంచి ఎగుమతులు చేస్తున్నాయి. గతంలో ఆయా సంస్థలు ఇక్కడ విక్రయాల పైనే ప్రధానంగా దృష్టి సారించేవి.

2020లో సరిహద్దు వివాదాల తర్వాత మన ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రోత్సాహకాలు స్థిరంగా అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే చైనా కంపెనీలు మన కంపెనీలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుని, ఇక్కడ తయారీని ప్రారంభించాయి. స్థానికంగా పంపిణీ నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేసుకున్నాయి. ఆయా కంపెనీల బోర్డుల్లో భారతీయులను ఉన్నత స్థానాల్లో నియమించుకున్నాయి.

ఒప్పో మొబైల్స్ ఇండియా 2023-24లో తొలిసారిగా ఎగుమతుల ద్వారా రూ.272 కోట్ల విదేశీ మారకాన్ని ఆర్జించింది. రియల్‌మీ మొబైల్ టెలికమ్యూనికేషన్స్ (ఇండియా) రూ.114 కోట్లు ఆర్జించినట్లు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ)కు గత నెల 12న సమాచారమిచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక వివరాలను ఇంకా ఆయా సంస్థలు సమర్పించలేదు.

చైనాకు చెందిన టెలివిజన్, గృహోపకరణాల సంస్థ హైసెన్స్ గ్రూప్, దేశీయంగా తయారు చేసిన ఉత్పత్తులను 2024 ప్రారంభం నుంచి పశ్చిమాసియా, ఆఫ్రికాలకు ఎగుమతి చేస్తోంది. హైసెన్స్ స్థానిక తయారీ భాగస్వామి ఎపాక్ డ్యూరబుల్ ఎండీ అజయ్ సింఘానియా ఈ నెల ప్రారంభంలో మాట్లాడుతూ, శ్రీ సిటీలో రూ.100 కోట్లతో తయారీ ప్లాంట్ నెలకొల్పనున్నట్లు తెలిపారు.

లెనోవో గ్రూప్ తన సర్వర్లు, ల్యాప్‌టాప్‌లను భారత్ నుంచి ఎగుమతి చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తోంది. దీని అనుబంధ సంస్థ మోటోరోలా ప్రస్తుతం తన పరికరాలను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. మోటోరోలా ఫోన్లను ఇక్కడ డిక్సన్ టెక్నాలజీస్ తయారు చేస్తోంది. ఎగుమతి అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని 50 శాతం పెంచాలనుకుంటున్నట్లు గత నెలలో సంస్థ తెలిపింది.

ఐటెల్, టెక్నో, ఇన్ఫినిక్స్ బ్రాండ్లను కలిగిన చైనా కంపెనీ ట్రాన్షన్ హోల్డింగ్స్ స్మార్ట్‌ఫోన్లను కూడా డిక్సన్ టెక్నాలజీస్ ఉత్పత్తి చేస్తోంది. వీటిని ఆఫ్రికాకు ట్రాన్షన్ ఎగుమతి చేస్తోంది.

వివో, రియల్‌మీ, వన్‌ప్లస్, షియోమి తదితర స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలు కూడా దేశీయ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని, ఎగుమతులు ప్రారంభించాయి.

2024-25లో మనదేశం నుంచి స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు 55% పెరిగి 24.14 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.05 లక్షల కోట్ల)కు చేరాయి. ఇందులో యాపిల్ ఐఫోన్ల విలువ 17.4 బి.డాలర్లు కాగా మిగతావి ఎక్కువగా శామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి.




# జోడీ ఎవరో

ఇంగ్లాండ్‌తో భారత్ అయిదు టెస్టుల సిరీస్‌కు ఎంతో సమయం లేదు. దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ రిటైర్ కావడంతో కూర్పు విషయంలో జట్టు మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. గత కొన్ని టెస్టుల్లో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో కలిసి రోహిత్ ఇన్నింగ్స్ ఆరంభించాడు. శుభ్‌మన్ గిల్‌కు కూడా రోహిత్ తోడుగా కొత్త బంతిని ఎదుర్కొన్న అనుభవం ఉంది. ఇప్పుడు రోహిత్ లేకపోవడంతో ఒక ఓపెనర్ స్థానం ఖాళీ అయింది. శుభ్‌మన్‌కు కెప్టెన్సీ బాధ్యతలు ఇవ్వడంతో అతడు యశస్వితో ఓపెనింగ్‌కు దిగుతాడా లేదా మరో ఆటగాడిని ఆ స్థానంలో పంపుతాడా అనేది చూడాలి.

ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున సత్తా చాటి తొలిసారి భారత జట్టులోకి వచ్చిన సాయి సుదర్శన్.. ఓపెనింగ్‌లో టీమ్ మేనేజ్‌మెంట్‌కు మంచి ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాడు. టెక్నిక్, ఓపిక విషయంలో ఈ ఎడమ చేతివాటం బ్యాటర్‌కు పూర్తి మార్కులు వేయచ్చు. గతంలో కౌంటీల్లో ఆడిన అనుభవం అతడిని ఓపెనర్‌గా పంపే అవకాశాలను పెంచుతోంది. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ సైతం సుదర్శన్‌నే యశస్వితో పాటు కొత్త బంతిని ఎదుర్కొనేందుకు పంపాలని సలహా ఇచ్చాడు. "యశస్వితో కలిసి సుదర్శన్‌ను ఓపెనర్‌గా ఆడించాలి. ఈ పాత్ర పోషించడానికి అతడు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. సాంకేతిక బలం, ఐపీఎల్ ఫామ్, ఫస్ట్ క్లాస్ క్రికెట్లో రాణించిన అనుభవం సుదర్శన్‌ను ఈ స్థానానికి అర్హుడిగా నిలబెడుతున్నాయి. నంబర్-3లో అనుభవజ్ఞుడైన కేఎల్ రాహుల్ లేదా కరుణ్ నాయర్‌ను బరిలో దించొచ్చు. కోహ్లి ఖాళీ చేసిన నాలుగో స్థానంలో శుభ్‌మన్ వస్తే కూర్పు సమతూకంగా ఉంటుంది" అని పాంటింగ్ పేర్కొన్నాడు.

యశస్వి-సాయి సుదర్శన్ ఇద్దరూ ఎడమచేతి వాటం బ్యాటర్లే. ఒకవేళ కుడి-ఎడమ మేళవింపు కోరుకుంటే యశస్వికి జతగా గతంలో ఓపెనర్‌గా వచ్చిన అనుభవం ఉన్న కేఎల్ రాహుల్ దిగే అవకాశాలున్నాయి. రెండో అనధికార టెస్టులో భారత్-ఎ తరఫున ఓపెనర్‌గా దిగి ఇంగ్లాండ్ లయన్స్‌పై రాహుల్ శతకం సాధించి ఫామ్ చాటుకున్నాడు. ఇంగ్లాండ్ సీనియర్ జట్టుపై కూడా రాహులే ఓపెనింగ్ చేస్తే.. నంబర్-3లో సుదర్శన్, నాలుగో స్థానంలో శుభ్‌మన్ ఆడతారు. శుభ్‌మన్‌నే యశస్వికి తోడుగా ఓపెనింగ్‌కు పంపి.. మూడో స్థానంలో సుదర్శన్.. నాలుగు, అయిదు, ఆరో స్థానాల్లో వరుసగా రాహుల్, కరుణ్ నాయర్, రిషబ్ పంత్ వస్తే జట్టు సమతూకంగా ఉంటుందని మరో ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు బ్రాడ్ హాగ్ అన్నాడు. ఏడో స్థానంలో రవీంద్ర జడేజా లాంటి స్పెషలిస్టు ఉండడంతో జట్టు బ్యాటింగ్ లోతు కూడా పెరుగుతుందని పేర్కొన్నాడు. కుడి-ఎడమ మేళవింపు కూడా కుదిరే అవకాశం ఉండడంతో మేనేజ్‌మెంట్ ఈ ప్రత్యామ్నాయాన్ని కూడా పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. కౌంటీల్లో ఆడిన అనుభవం ఉండి.. ఇటీవల భారత్-ఎ తరఫున ఇంగ్లాండ్ లయన్స్‌పై ద్విశతకం సాధించిన కరుణ్ నాయర్‌ను కూడా ఓపెనింగ్‌కు పంపినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మంచి టెక్నిక్ ఉన్న కరుణ్ ఈ పాత్రకు న్యాయం చేసే అవకాశాలు లేకపోలేదు. అదే జరిగితే సుదర్శన్ మూడు, శుభ్‌మన్ నాలుగు, రాహుల్ అయిదు స్థానాల్లో దిగే అవకాశాలున్నాయి.

# ఐడెన్ మార్‌క్రమ్ అద్భుతంగా ఆడాడు: రికీ పాంటింగ్




: వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ (%×జజ ఔశీతీశ్రీస ఎవర్ జష్టుఎజూఅ-శీఅష్ట్రఅజూ%) ఫైనల్‌లో సౌతాఫ్రికా జట్టు, ఆసీస్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో చిరస్మరణీయమైన శతకం సాధించిన ఐడెన్ మార్‌క్రమ్ (%ూఅఎవఅ మీుతీఎతీుఎ%) అద్భుతంగా ఆడాడని ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ రికీ పాంటింగ్ (%=అఎఎ ూశీత్‌అఅస్త్ర%) కొనియాడాడు. టోర్నమెంట్ ఫైనల్స్‌లో సాధించిన అత్యుత్తమ సెంచరీల్లో ఇది అగ్రస్థానంలో ఉందన్నాడు. 'గత రెండు సంవత్సరాలుగా దక్షిణాఫ్రికా క్రికెట్ ఎక్కడ ఉందో.. ముఖ్యంగా వారి టెస్ట్ జట్టు ఎక్కడ ఉందో.. పరిగణనలోకి తీసుకుంటే, ఈ విజయం నిజంగా అద్భుతం. టీమ్‌కు అవసరమైనప్పుడు ఐడెన్ మార్‌క్రమ్ క్రీజులో చివరి వరకూ నిలబడి అలాంటి గొప్ప ప్రదర్శన ఇవ్వగలగడం గ్రేట్. అతడు ఎంత గొప్ప ఆటగాడో అందరికీ తెలుసు' అని పాంటింగ్ అన్నాడు.

డబ్ల్యూటీసీ మొదటి రెండు ఎడిషన్లలో దక్షిణాఫ్రికా ఫైనల్‌కు చేరుకోలేకపోయింది, కానీ 2023 నుంచి.. ప్రధాన కోచ్ శుక్రీ కాన్రాడ్, కెప్టెన్ టెంబా బవుమా మార్గనిర్దేశనంలో జట్టు కొత్త రూపును సంతరించుకుంది. నిజానికి మొదట మార్‌క్రమ్ 2022- 23 సీజన్‌లో పేలవ ప్రదర్శన కారణంగా ఆస్ట్రేలియాలో పర్యటించిన సౌతాఫ్రికా జట్టులో స్థానం కోల్పోయాడు. కానీ 2023 ఫిబ్రవరిలో 115 పరుగులు బాది తిరిగి పుంజుకున్నాడు. 2024 జనవరిలో కేప్‌టౌన్‌లో టీమ్‌ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ సాధించాడు. ప్రస్తుతం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో అద్భుత సెంచరీ బాది తన టీమ్‌ను విజేతగా నిలిపాడు. అలాగే దక్షిణాఫ్రికా జట్టు తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు.

ఈ విషయమై కూడా పాంటింగ్ మాట్లాడాడు. 'రెండు సంవత్సరాల క్రితం దక్షిణాఫ్రికా జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించింది. అప్పుడు ఐడెన్ మార్‌క్రమ్ పేలవ ఆటతీరు వల్ల సఫారీ జట్టులో స్థానం సంపాదించలేకపోయాడు. కానీ ప్రస్తుతం అతడు అద్భుతంగా ఆడాడు. ఇది అతని కెరీర్‌లోనే ముఖ్యమైన ఇన్నింగ్స్. మనం ఒక వేళ అతణ్ని ఇదే విషయం అడిగితే లార్డ్స్‌లో బాదిన శతకం.. తనటెస్ట్ కెరీర్‌లో గర్వించదగ్గ ప్రదర్శన అని చెబుతాడు' అని రికీ పాంటింగ్ అభిప్రాయపడ్డాడు.

# ఓ ప్రముఖ క్రికెటర్ నన్ను రిటైర్ అవమన్నాడు: కరుణ్ నాయర్


: దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత టీమ్‌ఇండియా టెస్ట్ జట్టులోకి కరుణ్ నాయర్ పునరాగమనం చేశాడు. ఈనేపథ్యంలో రెండేళ్ల క్రితం జరిగిన ఓ సంఘటనను తాజాగా ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. ఓ ప్రముఖ క్రికెటర్ తనను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అవమని సూచించాడని చెప్పాడు. ఆర్థికంగా భరోసానిచ్చే ఫ్రాంఛైజీ టీ20 లీగ్‌లు ఆడుకోమని సలహా ఇచ్చాడని వివరించాడు. కానీ కరుణ్ నాయర్ మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా దేశవాళీల్లో రాణించి, తిరిగి జాతీయజట్టులోకి పునరాగమనం చేశాడు. జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో జరగనున్న అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు భారత జట్టు తరపున ఎంపికయ్యాడు. టీమ్‌ఇండియా ప్రకటించిన 18 మంది సభ్యులతో కూడిన బృందంలో స్థానం సంపాదించుకున్నాడు.



'నాకు ఇప్పటికీ గుర్తుంది. ఓ ప్రముఖ భారత క్రికెటర్ రెండేళ్ల క్రితం నాకు ఫోన్ చేశాడు. నన్ను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోమన్నాడు. ఆర్థికంగా భరోసా కోసం విదేశీ టీ20 లీగుల్లో ఆడమని సూచించాడు. అతడు చెప్పినట్లు చేయడం సులువే. కానీ నా లక్ష్యం తిరిగి భారత జట్టుకు ఆడటమే. ఈ సంఘటన రెండేళ్ల క్రితం జరిగింది. కానీ ఇప్పుడు నేను తిరిగి టీమ్ ఇండియాలో చోటు దక్కించుకున్నాను' అని ఆ ఇంటర్వ్యూలో కరుణ్ నాయర్ అన్నాడు. అతడు ప్రస్తుతం మంచి ఫామ్‌లో కనిపిస్తున్నాడు. తాజాగా ఇంగ్లండ్ లయన్స్‌తో ఇండియా ఏ జట్టు తలపడిన అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో అతడు అద్భుతంగా బ్యాటింగ్ చేసి డబుల్ సెంచరీ సాధించాడు. ప్రస్తుత భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ కూడా కరుణ్ నాయర్‌కు మద్దతుగా నిలుస్తున్నాడు. 'మీరు ఎన్ని పరుగులు చేసినా.. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే ఎప్పటికీ వదులుకోని మనస్తత్వం. అదే మిమ్మల్ని తిరిగి జట్టులోకి తీసుకువచ్చింది. ఇది మొత్తం ప్రపంచానికి స్ఫూర్తినిచ్చే విషయం' అని కరుణ్‌నాయర్‌ను ఉద్దేశించి గౌతమ్ గంభీర్ అన్నాడు.

అలాగే కౌంటీ క్రికెట్ ఆడిన అనుభవం ఉన్న కరుణ్.. టీమ్‌ఇండియాకు ఎంతో మేలు చేస్తాడని గౌతమ్ గంభీర్ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు. నాయర్ 2023, 2024 కౌంటీ ఛాంపియన్‌షిప్ సీజన్లలో నార్తాంప్టన్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 10 మ్యాచ్‌ల్లో 736 పరుగులు చేశాడు. ఇందులో చిరస్మరణీయమైన ఓ డబుల్ సెంచరీ కూడా ఉంది. అలాగే 2024-25 రంజీ ట్రోఫీలో విదర్భకు ప్రాతినిధ్యం వహించిన అతడు 16 ఇన్నింగ్స్‌ల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలున్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో ఎనిమిది ఇన్నింగ్స్‌లో ఏకంగా 779 పరుగులు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2024-25లో (టీ20) ఆరు ఇన్నింగ్స్‌ల్లో 255 పరుగులు చేశాడు.

# కలలో కూడా అనుకోలేదు




లండన్ ప్రతి ఒక్క ఆటగాడూ భద్రతాభావంతో, సంతోషంగా ఉండేలా జట్టు సంస్కృతిని సృష్టించడమే తన లక్ష్యమని టీమ్ఇండియా కొత్త టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. జాతీయ జట్టుకు కెప్టెన్ కావాలని ఎప్పుడూ కోరుకోలేదని అతను చెప్పాడు. "భారత క్రికెట్ జట్టు కెప్టెన్ కావాలని కలలో కూడా అనుకోలేదు. ప్రతి ఒక్కరికీ భద్రతాభావం, సంతోషం కలిగేలా జట్టు సంస్కృతిని సృష్టించాలనుకుంటున్నా. అది అంత తేలిక కాదని నాకు తెలుసు. కానీ అదే నా లక్ష్యం. ఓ ఆటగాడు తన సామర్థ్యం పట్ల భద్రతభావంతో ఉండేలా చేయడం కెప్టెన్ చేయాల్సిన ముఖ్యమైన పనుల్లో ఒకటి'' అని గిల్ అన్నాడు. ఇప్పటిదాకా కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ తనకు స్పష్టమైన దారి చూపాడని అతడు చెప్పాడు. "అతడు అంత దూకుడుగా ఉన్నట్లు కనిపించకపోవచ్చు. కానీ వ్యూహాల విషయంలో చాలా దూకుడుగా ఉంటాడు. మ్యాచ్‌కు ముందు, సిరీస్ సందర్భంగా, సిరీస్ తర్వాత కూడా సమాచార మార్పిడి విషయంలో అతడు చాలా స్పష్టంగా ఉంటాడు" అని గిల్ అన్నాడు. "రోహిత్ భాయ్ ఎలాంటి వాతావరణాన్ని సృష్టించాడంటే.. అతడు తిట్టినా ఏ ఆటగాడు కూడా మనసు మీదికి తీసుకోడు. అతడి వ్యక్తిత్వం అలాంటిది. అది ఉండాల్సిన లక్షణం. అతడు ఏదైనా అన్నా.. జట్టు కోసమే అంటాడని అందరికీ తెలుసు'' అని చెప్పాడు. నాయకత్వానికి సంబంధించి కోహ్లి నుంచి కూడా చాలా నేర్చుకున్నానని ఓ ఇంటర్వ్యూలో గిల్ తెలిపాడు. ''కోహ్లి నాయకత్వంలో ఆడినప్పుడు.. టెస్టుల్లో అతడి చురుకుదనం నాకు నచ్చేది. అతడి నుంచి చాలా నేర్చుకున్నా. తన వ్యూహాలు పని చేయకపోతే వెంటనే మరో వ్యూహాన్ని అమలు చేసేవాడు. తనకేం కావాలో బౌలర్‌కు చెప్పేవాడు'' అని అన్నాడు. నాయకత్వ బాధ్యతలు స్వీకరించే ముందు కోచ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అగార్కర్‌తో మాట్లాడానని అతడు వెల్లడించాడు. "కెప్టెన్‌గా స్వేచ్ఛగా ఉండమని వాళ్ల నాతో చెప్పారు. నాపై ఎలాంటి అంచనాలూ లేవని అన్నారు. కానీ కెప్టెన్‌గా, ఆటగాడిగా నాపై నాకు కొన్ని అంచనాలు ఉన్నాయి" అని గిల్ అన్నాడు. ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఈ నెల 20న లీడ్స్‌లో ఆరంభమయ్యే మొదటి టెస్టే కెప్టెన్‌గా గిల్‌కు తొలి టెస్టు.

కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఆడినప్పటి నుంచి కోచ్‌గా గంభీర్ శైలి ఎలా ఉంటుందో గిల్‌కు తెలుసు. జాతీయ జట్టు వాతావరణంలో కూడా అతడి శైలికి తగినట్లు ఉండగలనన్న విశ్వాసాన్ని గిల్ వ్యక్తం చేశాడు. "గౌతమ్ భాయ్ చాలా పట్టుదలతో, అంకితభావంతో ఉంటాడు. సమాచారం విషయంలో స్పష్టతతో ఉంటాడు. ఆటగాళ్ల నుంచి తనకేం కావాలో, వాళ్ల నుంచి ఎలాంటి వైఖరిని ఆశిస్తున్నాడో చెబుతాడు. జట్టు ఎలాంటి దృక్పథంతో ఉండాలి అన్నదానిపై ఎక్కువ దృష్టిపెడతాడు" అని చెప్పాడు. బుమ్రాపై ముందే నిర్ణయం తీసుకోంఫాస్ట్‌బౌలర్ బుమ్రా పని భార నిర్వహణ విషయంలో శుభ్‌మన్ గిల్ ఎలా వ్యవహరిస్తాడన్నది ఆసక్తికరం. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లకూ బుమ్రా అందుబాటులో ఉండకపోవచ్చని చీఫ్ సెలక్టర్ అగార్కర్ ఇప్పటికే చెప్పాడు. బుమ్రా ఎంత వరకు అందుబాటులో ఉంటాడన్న దాని గురించి గిల్ మాట్లాడుతూ.. "సిరీస్ సందర్భంగా అతడిపై ఎంత భారం పడుతోంది అన్న దాని ఆధారంగా నిర్ణయం తీసుకుంటాం. అతణ్ని ఎన్ని మ్యాచ్‌ల్లో ఆడించాలనేదానిపై ముందే ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనుకోవట్లేదు. బుమ్రా తర్వాతి మ్యాచ్‌లో ఆడతాడా లేదా అన్నది చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది" అని అన్నాడు.

# భారత్‌కు వరుసగా ఆరో ఓటమి

ఆంట్వెర్ప్ (బెల్జియం): ఐరోపా దశ ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీలో భారత పురుషుల జట్టు వైఫల్యం కొనసాగుతోంది. ఈ లీగ్‌లో భారత్ వరుసగా ఆరో పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-3తో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి చవిచూసింది. శనివారం ఆసీస్ చేతిలో భారత్ పరాజయం పాలవగా.. అంతకుముందు నెదర్లాండ్స్, అర్జెంటీనా చేతిలో రెండేసి మ్యాచ్‌ల్లో చుక్కెదురైంది. మ్యాచ్ ప్రారంభమైన మూడో నిమిషంలోనే భారత్‌కు సంజయ్ గోల్ అందించాడు. నాలుగో నిమిషంలో ఆసీస్ ఆటగాడు టిమ్ బ్రాండ్ గోల్ రాబట్టి 1-1తో స్కోరును సమం చేశాడు. అనంతరం బ్లేక్ గోవర్స్ (5వ నిమిషం), కూపర్ బర్న్స్ (18) గోల్స్ సాధించడంతో ఆసీస్ 3-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 36వ నిమిషంలో దిల్‌ప్రీత్ సింగ్ గోల్ చేసి ఆసీస్ ఆధిక్యాన్ని 2-3కు తగ్గించినా.. ప్రత్యర్థి విజయాన్ని భారత్ అడ్డుకోలేకపోయింది. ఈనెల 21న బెల్జియంతో భారత్ పోటీపడనుంది.

అమ్మాయిలూ..: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీలో ఆదివారం భారత మహిళల జట్టుకూ చుక్కెదురైంది. ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-2తో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం చవిచూసింది.

ప్రొ లీగ్‌లో భారత్‌కు ఇది వరుసగా రెండో ఓటమి. శనివారం భారత్ 2-3తో ఆసీస్ చేతిలోనే ఓటమి పాలైంది. ఆట ప్రారంభమైన మూడో నిమిషంలోనే వైష్ణవి ఫాల్కే ఫీల్డ్ గోల్ సాధించి భారత్ ఖాతా తెరిచింది. ప్రథమార్ధం ముగిసేసరికి భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. 37వ నిమిషంలో ఆసీస్ క్రీడాకారిణి ఎమీ లాటన్ గోల్ చేయడంతో 1-1తో స్కోరు సమమైంది. అక్కడ్నుంచి చివరి నిమిషం వరకు ఇరుజట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మ్యాచ్ డ్రాగా ముగుస్తుందనుకున్న సమయంలో ఆసీస్ రెండో గోల్ సాధించింది. 60వ నిమిషంలో లెక్సీ పికెరింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి భారత్ ఆశలపై నీళ్లు చల్లింది. మంగళవారం అర్జెంటీనాతో భారత్ తలపడనుంది.

# ఉదయాన్నే వీటిని అల్పాహారంగా తీసుకుంటే బోలెడు బలం..!




రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే ఉదయం తీసుకునే అల్పాహారం ప్రదాన పాత్ర పోషిస్తుంది. అందుకే ఉదయం తీసుకునే ఆహారం బలంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు అంటుంటారు. అల్పాహారంలో ప్రోటీన్ అధికంగా ఉన్న ఆహారాలు తీసుకుంటే రోజంతా చురుగ్గా, బలంగా ఉండచ్చు. రోజంతా బలంగా ఉంచే ఆహారాలు ఇవీ..

గ్రీక్ యోగర్ట్ పర్ఫైట్..

గ్రీకు పెరుగు, వివిధ రకాల బెర్రీలు, తేనె, గ్రానోలా.. మొదలైనవాటిని ఒక బౌల్ లో ఒక్కక్కటిగా పొరలుగా వేయాలి. ఈ ప్రోటీన్ ప్యాక్డ్ ఫుడ్ చాలా బలం ఇస్తుంది.

వేసవిలో టమోటా జ్యూస్ తాగడం వల్ల కలిగే 10 ఆరోగ్య ప్రయోజనాలు..!

ఛానల్ ఫాలో అవ్వండి

గుడ్లు, పాలకూర..

గుడ్లు, పాలకూర, ఫెటా చీజ్, ఉప్పు, మిరియాల పొడి తీసుకోవాలి. ఉడికించిన గుడ్లు, వేయించిన పాలకూర, ఉప్పు, మిరియాల పొడి.. అన్నీ టోర్టిల్లా ర్యాప్ పై ఉంచాలి. దీన్ని చుట్టగా చుట్టి తినడమే.

క్వినోవా బ్రేక్ఫాస్ట్ బౌల్..

ఉడికించిన క్వినోవా, అవోకాడో, చెర్రీ టమోటా, చికెన్ బ్రెస్ట్, గుమ్మడి గింజలు, నిమ్మరసం తీసుకోవాలి. క్వినోవాను ఉడికించాలి. అవకాడో ముక్కలు, సగానికి తరిగిన చెర్రీ టమోటా, ఉడికించిన చికెన్ బ్రెస్ట్ వేయాలి. మరింత రుచికోసం గుమ్మడి విత్తనాలు కలుపుతోవాలి.

పిల్లలకు పొరపాటున కూడా తల్లిదండ్రులు చెప్పకూడని 8విషయాలు ఇవీ..!

కాటన్ చీజ్ పాన్ కేక్..

కాటేజ్ చీజ్, గుడ్లు, ఓట్స్ పిండి, బేకింగ్ పౌడర్, వెనిల్లా ఎస్సెన్స్, బెర్రీలు అవసరం. బెర్రీలు మినహాయిస్తే మిగిలినవి అన్నీ మిక్స్ చేసుకుని పెనం మీద దోశల్లా వేసుకోవాలి. రెండువైపులా గోల్డ్ కలర్ వచ్చేవరకు కాల్చి తర్వాత బెర్రీలను పైన అలంకరించి సర్వ్ చేయాలి.

స్మోక్డ్ సాల్మన్ అవకాడో టోస్ట్..

హోల్ మీల్ బ్రెడ్ స్లైసెస్, స్మోక్డ్ సాల్మన్, అవకాడో, నిమ్మరసం, ఛిల్లీ ఫ్లేక్స్ తీసుకోవాలి. బ్రెడ్ ముక్కలను బంగారు రంగు వచ్చేవరకు కాల్చాలి. అవకాడోను మెత్తగా చేసి కాల్చన బ్రెడ్ మీద స్పెడ్ చేయాలి. కాల్చిన సాల్మన్ ముక్కలను అలంకరించాలి. ఫ్రెష్ నిమ్మరసాన్ని దీనిపై వెయ్యాలి.

# రోజంతా హ్యాపీగా ఉండాలనుందా? హ్యాపీ హార్మోన్స్ ను పెంచే ఈ ఫుడ్స్ ను తింటే..!

సంతోషంగా , పాజిటివ్ గా ఉంటే రోజులో ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా చాలా ఈజీగా దాటేయచ్చు. అయితే చాలామందికి ఎలాంటి సమస్యలు లేకపోయినా రోజంతా నీరసంగా, డల్ గా ఉంటారు. శరీరంలో తగినంత హ్యాపీ హార్మోన్స్ లేకపోవడం వల్ల ఇలా జరుగుతుంది.

సంతోషం సగం బలం అని అన్నారు పెద్దలు. సంతోషంగా , పాజిటివ్ గా ఉంటే రోజులో ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా చాలా ఈజీగా దాటేయచ్చు. అయితే చాలామందికి ఎలాంటి సమస్యలు లేకపోయినా రోజంతా నీరసంగా, డల్ గా ఉంటారు. శరీరంలో తగినంత హ్యాపీ హార్మోన్స్ లేకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. సెరటోనిన్, డోపమైన్, ఎండార్ఫిన్ వంటి హార్మోన్లను హ్యాపీ హార్మోన్లు అని అంటారు. ఈ హార్మోన్లు న్యూరోట్రాన్స్మిటర్ ల ఉత్పత్తిని ప్రభావితం చేస్తాయి. మెదడు మీద ఒత్తిడి తగ్గించి హ్యాపీగా ఉండేలా చేస్తాయి. ఈ హ్యాపీ హార్మోన్స్ పెరగడానికి సహాయపడే ఆహారాలేంటో తెలుసుకుంటే..

సాల్మన్..

ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్న సాల్మన్ చేప మెదడు ఆరోగ్యానికి తోడ్పడుతుంది. సెరోటోనిన్ ఉత్పత్తి పెంచుతుంది. సెరోటోనిన్ మానసిక స్థితిని నియంత్రించే హ్యాపీ హార్మోన్.

పిల్లలకు పొరపాటున కూడా తల్లిదండ్రులు చెప్పకూడని 8విషయాలు ఇవీ..!

అరటిపండ్లు..

అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంజి. ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి సహాకరిస్తుంది. అరటిపండ్లలో విటమిన్-బి6 కూడా ఉంటుంది. ఇది




ట్రిప్టోఫాన్ ను సెరోటోనిన్ గా మార్చడంలో సహాయపడుతుంది.

డార్క్ చాక్లెట్..

డార్క్ చాక్లెట్ లో ఫ్లేవనాయిడ్ లు ఉంటాయి. ఇవి మెదడుకు రక్తస్రావాన్ని పెంచుతాయి. ఎండార్ఫిన్ల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి.

బెర్రీలు..

బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్-సి పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడులో ఆక్సీకరణ ఒత్తిడి, వాపు ఎదుర్కోవడానికి, డోపమైన్ పెరుగుదలకు సహాయపడతాయి.

30ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పక తీసుకోవలసిన 10 విటమిన్ల లిస్ట్ ఇదీ..!

నట్స్..

నట్స్ లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. మెదడు ఆరోగ్యానికి, న్యూరోట్రాన్మిటర్ పనితీరుకు తోడ్పడతాయి.

అవకాడో..

అవకాడోలో కొవ్వులు న్యూరోట్రాన్మిటర్ సిగ్నలింగ్ ను మెరుగుపరచడంలో సహాయపడతాయి. డోపమైన్, సెరోటోనిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి.

చిక్కుళ్లు..

చిక్కుళ్లలో ఫోలేట్ ఉంటుంది. ఇది సెరోటోనిన్ తో సహా న్యూరోట్రాన్స్మిటర్ సంశ్లేషణలో పాత్ర పోషిస్తుంది. మూడ్ రెగ్యులేషన్ కు తోడ్పడుతుంది.

# పంచదార నిజంగానే ఆరోగ్యానికి చేటు చేస్తుందా? రోజూ ఎంత పంచదార తినొచ్చంటే..!

ఈమధ్య కాలంలో పంచదారకు సంబంధించి చాలా షాకింగ్ విషయాలు బయటకు వస్తున్నాయి. కొందరు ఆరోగ్యం మీద స్పృహతో పంచదార వాడకమే మానేస్తున్నారు. అసలు పంచదార నిజంగానే




ఆరోగ్యానికి చేటు చేస్తుందా? ఇది బరువు పెరగడానికి కారణం అవుతుందా? ఆరోగ్యం సేఫ్ గా ఉండాలంటే రోజులో ఎంత పంచదార తీసుకోవచ్చు?

పంచదార ప్రతి ఇంట్లో వాడే పదార్థం. నిజానికి దీన్ని కాఫీ, టీ, జ్యూస్, స్వీట్లలో ఎక్కువగా వాడుతుంటాం. ఈమధ్య కాలంలో పంచదారకు సంబంధించి చాలా షాకింగ్ విషయాలు బయటకు వస్తున్నాయి. పంచదార అధిక వినియోగం వల్ల మధుమేహం వస్తుందని అంటున్నారు. కొందరు ఆరోగ్యం మీద స్పృహతో పంచదార వాడకమే మానేస్తున్నారు. అసలు పంచదార నిజంగానే ఆరోగ్యానికి చేటు చేస్తుందా? ఇది బరువు పెరగడానికి కారణం అవుతుందా? ఆరోగ్యం సేఫ్ గా ఉండాలంటే రోజులో ఎంత పంచదార తీసుకోవచ్చు? తెలుసుకుంటే..

పంచదార నేరుగా కొవ్వు పేరుకుపోవడానికి కారణం కానప్పటికీ ఇది పరోక్షంగా బరువు పెరగడానికి దోహదం చేస్తుంది. పంచదార ఎక్కువ వినియోగిస్తే శరీరంలోకి వెళ్లే కేలరీల శాతం కూడా పెరుగుతుంది . ప్రాసెస్ చేసిన ఆహారాలలో చక్కెర శాతం ఎక్కువ ఉంటుంది. ఇది ఆహారాన్ని రుచికరంగా మారుస్తుంది. ఈ కారణంగా ఎక్కువ తింటారు. బరువు పెరగడానికి కారణమవుతుంది.

రోజులో ఎంత చక్కెర తీసుకోవచ్చు..

చక్కెర నేరుగా బరువు పెరగడానికి కారణం కాకపోయినా దీన్ని మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. ఆరోగ్య నివేదికల ప్రకారం ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో చక్కెర నుండి శరీరానికి అందే కేలరీలు 5శాతానికి మించకూడదు. ఇక ప్రతిరోజూ 30గ్రాముల కంటే ఎక్కువ చక్కెర వాడకూడదు. పంచదార వాడేటప్పుడు పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలి. పిల్లల వయస్సు ఆధారంగా రోజులో 19గ్రాముల నుండి 24గ్రాముల లోపు మాత్రమే చక్కెర తీసుకునేలా చూడాలి. ఇంతకంటే ఎక్కువ తీసుకుంటే బరువు పెరగడం, మధుమేహం, గుండె జబ్బులతో సహా వివిధ ఆరోగ్య సమస్యలు పెరగడానికి కూడా కారణమవుతుంది.

# నిమ్మరసమా.. కొబ్బరి నీళ్లా.. వేసవిలో ఏది ప్రయోజనకరం..

వేసవి (ఎండలు పెరిగిపోతున్నాయి. వడగాలులు చెమటలు పట్టిస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతతో చాలా మంది డీహైడ్రేషన్ సమస్యను ఎదుర్కొంటున్నారు. శరీరంలోని నీరు, లవణాలు అన్నీ చెమట రూపంలో బయటకు వెళ్లిపోతాయి. కాబట్టి వాటి స్థానాన్ని మళ్లీ భర్తీ చేయాలి. లేకపోతే వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఈ కారణంగా బాడీ డీ హైడ్రేట్ కాకుండా ఉండేందుకు హెల్తీ డ్రింక్స్ ను తీసుకోవడం చాలా అవసరం. డీహైడ్రేటింగ్ డ్రింక్స్ అంటే ప్రజలకు ముందుగా నిమ్మరసం, కొబ్బరి నీరు గుర్తుకు వస్తాయి. శరీరాన్ని నిర్జలీకరణం నుంచి రక్షించేందుకు ఈ రెండు పానీయాలు ఎంతో ఉపయోగపడతాయి. అయితే ఈ రెండింటిలో ఏది మంచిదనే అనుమానం సాధారణంగా అందరికీ వస్తుంది. దీనిపై ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు చూద్దాం.



కొబ్బరి నీళ్లల్లో ఎలక్ట్రోలైట్లు అధికంగా ఉంటాయి. పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా లభిస్తాయి. ఇవి శరీరంలోని ద్రవాలను సమతుల్యం చేయడమే కాకుండా కండరాల నిర్మాణంలోనూ ఉపయోగపడతాయి. అదే నిమ్మరసం విషయానికి వస్తే విటమిన్ సి, ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. అంతే కాకుండా అనేక సీజనల్ వ్యాధుల నుంచి రక్షిస్తుంది. జీర్ణక్రియను ఆరోగ్యంగా ఉంచుతుంది. నిమ్మకాయలో ఆల్కలీన్ గుణాలు అధికం. శరీరం స్థాయిని నిర్వహించడంలో మేలు చేస్తుంది.

వేసవి కాలంలో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు నిమ్మరసం, కొబ్బరి నీరు రెండూ తీసుకోవచ్చు. కొబ్బరి నీళ్లు శరీరంలో ఎలక్ట్రోలైట్స్ లోపాన్ని భర్తీ చేస్తే, నిమ్మరసంలోని విటమిన్ సి ఆక్సీకరణ ఒత్తిడిని తొలగిస్తుంది. కాబట్టి పరిగడుపునే కొబ్బరి నీళ్లు తాగడం మంచిది. రోజంతా చురుగ్గా ఉండేందుకు నిమ్మరసాన్ని డైట్ లో భాగం చేసుకోవాలి.

# కంటికి మెట్ఫార్మిన్ రక్ష

ఒకటి కొంటే ఒకటి ఉచితమనే ప్రకటనలు చూస్తూనే ఉంటాం. మరి ఒక మందు వేసుకుంటే అదనంగా మరో జబ్బు నుంచీ కాపాడితే? రక్తంలో గ్లూకోజు తగ్గటానికి వాడే మెట్ఫార్మిన్ మందు ఇలాంటి పనే చేస్తున్నట్టు రెటీనా పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంటోంది. ఇది వయసుతో ముడిపడిన మాక్యులర్ క్షీణత ముప్పు స్వల్పంగా తగ్గటానికి తోడ్పడుతున్నట్టు తైవాన్ వాసుల ఆరోగ్య సమాచార విశ్లేషణలో వెల్లడైంది. వయసు మీద పడుతున్నకొద్దీ కొందరికి కంటి రెటీనా మధ్యభాగం (మాక్యులా) క్షీణిస్తుంటుంది. నెమ్మదిగా ముదురుతూ వచ్చే ఈ సమస్య చూపు తగ్గటానికీ దారితీస్తుంది. యాభై ఏళ్లు పైబడ్డవారిలో చూపు పోవటానికి దారితీస్తున్న వాటిల్లో ఇది ప్రధానమైంది. మెట్ఫార్మిన్ వాడే మధుమేహుల్లో మాక్యులా క్షీణత ముప్పు 8% వరకూ తగ్గుతున్నట్టు తేలటం గమనార్హం.



# పాము విషానికి కొత్త విరుగుడు

అత్యంత విషపూరిత పాము కరిచినా ఒక్క సూది మందుతో ప్రాణాలు నిలబడితే? త్వరలోనే ఇది నిజం కానుంది. పాముల విషంలోని ప్రధాన విషతుల్యాలను నిర్వీర్యం చేయగల యాంటీబాడీని స్క్రిప్స్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు రూపొందించారు మరి. దీని పేరు 95మ్యాట్5. దీన్ని ఎలుకలపై పరీక్షించగా.. నల్లతాచు, బ్లాక్మాంబా వంటి పాముల విషాన్ని నిర్వీర్యం చేసినట్టు బయటపడింది. ఇది ప్రాణాలనే కాదు.. అవయవాలు చచ్చుబడకుండానూ కాపాడటం గమనార్హం. పాము కాటు చికిత్సలో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని, ఎంతోమంది ప్రాణాలను కాపాడగలదని భావిస్తున్నారు.

సాధారణంగా పాముకాటు చికిత్సలో యాంటీవీనమ్ ఇంజెక్షన్లు ఉపయోగిస్తుంటారు. వీటి తయారీ కష్టమైన ప్రక్రియ. ముందు పాము విషాన్ని సేకరించి, దాన్ని గుర్రాల వంటి జంతువులకు ఇస్తారు. అనంతరం విషాన్ని ఎదుర్కోవటానికి పుట్టుకొచ్చే యాంటీబాడీలను సంగ్రహించి, శుద్ధిచేసి ఇంజెక్షన్లను తయారుచేస్తారు. అయితే వీటితో కొన్ని లోపాలు లేకపోలేదు. తీవ్రమైన అలర్జీ ప్రతిచర్యలు తలెత్తటం, యాంటీబాడీలు కొన్నిరకాల విషాలకు అంతగా పనిచేయకపోవటం వంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఆయా ప్రాంతాల్లో కనిపించే పాములకు అనుగుణంగానే ఇంజెక్షన్లు రూపొందిస్తుంటారు. ఇక్కడే కొత్త యాంటీబాడీ ఆశలు రేకెత్తిస్తోంది. దీన్ని జంతువుల నుంచి కాకుండా ప్రయోగశాలలోనే తయారుచేయటం విశేషం. ఇది సార్వత్రిక పాము విరుగుడు ఇంజెక్షన్గా ఉపయోగపడగలదు.

పాము విషంలో మూడు వేళ్ల వంటి పొడవైన న్యూరోటాక్సిన్లు నాడులను దెబ్బతీసి, అవయవాలు చచ్చుబడేలా చేస్తాయి. ఈ యాంటీబాడీ సరిగ్గా వీటి మీదే దాడి చేసి, నిర్వీర్యం చేసేస్తుంది. పాము విషాన్ని సమర్థంగా నిలువరించటంతో పాటు అలర్జీ ప్రతిచర్యల ముప్పు తగ్గటానికీ తోడ్పడటం దీని ప్రత్యేకత. పెద్దఎత్తున తయారుచేసే వీలుండటం వల్ల మారుమూల ప్రాంతాల్లో యాంటీవీనమ్ కొరతనూ తగ్గించగలదు. హెచ్ఐవీ టీకా తయారీకి ఉపయోగించుకున్న పద్ధతుల స్ఫూర్తితోనే 95మ్యాట్5ని రూపొందించారు. పాము విషానికి సమర్థ చికిత్సల కోసం మన రోగనిరోధక వ్యవస్థను వాడుకోవచ్చనీ ఇది నిరూపించింది. అయితే కొన్ని సవాళ్లు లేకపోలేదు. పాము విషంలో రకరకాల విషతుల్యాలు ఉండటం వల్ల ఒకే ఒక్క యాంటీబాడీ అన్నిరకాల విషాలను నిర్వీర్యం చేయలేకపోవచ్చు. అందుకే పలు కృత్రిమ యాంటీబాడీలను సృష్టించి, సమగ్రమైన యాంటీ వీనమ్ను తయారుచేయటం మీద కూడా పరిశోధకులు దృష్టి సారించారు.

# ‘ది రాజాసాబ్’ రన్‌టైమ్.. పార్ట్ 2పై మారుతి క్లారిటీ

: ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం ‘ది రాజాసాబ్’ ఈ సినిమా రన్‌టైమ్ గురించి మారుతి స్పష్టతనిచ్చారు. అంతేకాకుండా, ‘ది రాజాసాబ్’ సీక్వెల్ ఉంటుందా? ఉండదా? అనే విషయాన్ని కూడా ఆయన వెల్లడించారు.

ప్రభాస్ మొదటిసారి ఈ జానర్‌లో సినిమా చేస్తున్నారు. దానిపై మీ అభిప్రాయం ఏమిటి?

మారుతి: గతంలో ఆయన తెలుగులో కామెడీ తరహా చిత్రాలు చేశారు. కామెడీలో ఆయనకంటూ ఒక ప్రత్యేకమైన టైమింగ్ ఉంది. దానిని పాన్ ఇండియాకు చూపించాలనుకున్నా. ఈ సినిమాతో అదే చేశా. ఈ కథకు అనుగుణంగా గ్రాండ్ సెట్స్ నిర్మించాం. ప్రభాస్ సినిమా అంటే ఆ మాత్రం ఉండాలి కదా.



ప్రభాస్‌తో సినిమా చేయడం ఎలా ఉంది?

మారుతి: ఆయన దర్శకుల హీరో. దర్శకుడు ఏం కోరుకుంటే ఆవిధంగా యాక్ట్ చేస్తారు. ఆ పాత్రలో ఒదిగిపోతారు.

సినిమా తెరకెక్కించడంలో మీరు ఎప్పుడైనా ఒత్తిడికి గురయ్యారా?

మారుతి: అలాంటిది ఏమీ లేదు. నేను ఆయనకు వీరాభిమానిని. ఒక అభిమానిగా నా హీరోని ఎలా చూడాలనుకున్నానో ఆ విధంగా చూపించా.

ఈ సినిమా షూట్‌కు ఎంత సమయం తీసుకున్నారు?

విశ్వప్రసాద్: దాదాపు రెండున్నరేళ్లు పట్టింది. గతేడాది మేము కీలక షెడ్యూల్ చిత్రీకరించాం. ఉదయం 6 గంటలకు చిత్రీకరణ మొదలైతే రాత్రి 11 గంటల వరకు జరిగేది. సుమారు 120 రోజులకు పైగా ఇదే షెడ్యూల్ కొనసాగింది. ఆ సమయంలోనే క్లైమాక్స్ చిత్రీకరించాం. వీఎఫ్ఎక్స్ కోసం సుమారు 300 రోజులు కేటాయించాం. 40 నిమిషాల క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది. గతేడాది మా బ్యానర్ నుంచి పలు చిత్రాలు విడుదలైనప్పటికీ క్వాలిటీ విషయంలో ఇబ్బందులు తలెత్తాయి. అందుకే ఈ సినిమా క్వాలిటీ విషయంలో వేము వెనకడుగు వేయడం లేదు. ఇది మా బ్యానర్‌లో భారీ ప్రాజెక్ట్ కానుంది. టీజర్‌లో సంజయ్‌దత్ పాత్రకు సంబంధించిన గ్లింప్స్ మాత్రమే చూశారు. సినిమాలో ఆయన రోల్ అద్భుతంగా ఉండనుంది.

సినిమాలో ఏదైనా డ్యాన్స్ నంబర్ ఉంటుందా?

మారుతి: తప్పకుండా. హీరో ఎంట్రీ సాంగ్ ఉంటుంది. ముగ్గురు హీరోయిన్స్‌తో హీరోకు ఒక చక్కని పాట ఉంటుంది. సాంగ్స్ బాగా ఎంజాయ్ చేస్తారు. తమన్ అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు.

ఈ సినిమా రన్‌టైమ్ ఎంత?

మారుతి: మూడు గంటలు.

రాజాసాబ్ పార్ట్ 2 ఉంటుందా?

మారుతి: సినిమా పూర్తయ్యాక చూద్దాం. పార్ట్ 2 కోసం బలవంతంగా కథను సాగదీసి రుద్దను. కంగారుపడొద్దు. ఆ క్లారిటీ మాకు ఉంది. నటీనటులకు సుమారు 8 గంటల షిఫ్ట్ అనేది సాధారణంగా ఉంటుంది. కానీ ఈ సినిమా కోసం మేము 18 గంటలు కూడా వర్క్ చేశాం. అందుకే ఇంత మంచి అవుట్‌పుట్ వచ్చింది.

ప్రభాస్ కోసం ఈ జానర్ కథ రాస్తున్నప్పుడు కంగారుపడ్డారా?

మారుతి: ఈ జానర్‌లో సినిమా చేద్దామని ఆయనే అడిగారు. అప్పుడు నేను కంగారుపడ్డా. ‘ప్రేమకథా చిత్రమ్’ వచ్చాక అదే జానర్‌లో సుమారు 500 చిత్రాలు వచ్చాయి. వారానికో హారర్ కామెడీ మూవీ విడుదలైంది. దానిని మించి ఏం చేయాలని కంగారుపడ్డా. విభిన్నంగా ఏం చేయాలా? అని ఆలోచించి ఫిక్స్ కావడానికి ఎక్కువ టైమ్ పట్టింది. నేను అనుకున్న కథ బాగా వర్కౌట్ అయింది. ప్రభాస్‌కు నాపై ఉన్న నమ్మకంతోనే ఈ తరహా కథ చేశా.

# ‘కన్నప్ప’ వీక్షించిన రజనీకాంత్.. మంచు విష్ణు పోస్ట్

మంచు విష్ణు ( ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘కన్నప్ప’ ( ఈ చిత్రాన్ని అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ) వీక్షించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మంచు విష్ణు తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. రజనీకాంత్‌తో కలిసి దిగిన పలు ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు.



“రజనీకాంత్ అంకుల్ రాత్రి ‘కన్నప్ప’ చిత్రాన్ని చూశారు. సినిమా చూశాక ఆయన నన్ను ప్రేమగా ఆలింగనం చేసుకున్నారు. తనకు ‘కన్నప్ప’ సినిమా ఎంతగానో నచ్చిందని నాతో చెప్పారు. ఒక నటుడిగా ఈ క్షణం కోసం నేను 22 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నా. ఈ రోజు నాకెంతో సంతోషంగా ఉంది. ఈ నెల 27న మా సినిమా విడుదల కానుంది. ఆ పరమశివుడి లీలను మీ అందరికీ చూపించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా” అని మంచు విష్ణు పేర్కొన్నారు. ఇదే విషయంపై మోహన్‌బాబు పోస్ట్ పెట్టారు. “జూన్ 15 (ఆదివారం)తో మా సినిమా ‘పెదరాయుడు’ విడుదలై 30 ఏళ్లు అయింది. అదే రోజున నా ఆప్త మిత్రుడు రజనీకాంత్ తన కుటుంబసభ్యులతో కలిసి ‘కన్నప్ప’ చిత్రాన్ని వీక్షించారు. సినిమా చూసిన తర్వాత ఆయన చూపించిన ప్రేమాభిమానాలను ఎప్పటికీ మర్చిపోలేను. థాంక్యూ మిత్రమా” అని అన్నారు.

శివ భక్తుడు కన్నప్ప జీవితాధారంగా రూపొందిన ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌బాబుతోపాటు మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, కాజల్ అగర్వాల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ఓ పాత్ర కోసం రజనీకాంత్‌ను తీసుకోవాలనుకున్నానని ఇటీవల మంచు విష్ణు ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. మోహన్‌బాబు పాత్ర కాంబినేషన్‌తో మరో క్యారెక్టర్ అనుకున్నామని, దాని కోసం రజనీకాంత్‌ని ఎంపిక చేద్దామనుకున్నానని తెలిపారు. కథకు సంబంధం లేకుండా ఆ ట్రాక్ ఎక్కువైపోతుందేమోనన్న రచయితల అభిప్రాయంతో ఆ పాత్రను తొలగించామని తెలిపారు. జూన్ 27న ఈ సినిమా విడుదల కానుంది.

# సైనికులతో 8 రోజులు ఉన్నాను.. అలా ఉన్న ఏకైక నటుడిని నేనే: ఆమిర్ ఖాన్

‘ఆపరేషన్ సిందూర్’పై స్పందించనందుకు బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ () ఇటీవల విమర్శలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. సైనికులపై తనకున్న గౌరవాన్ని తెలిపారు. కార్గిల్ యుద్ధం జరిగిన తర్వాత వారితో 8 రోజులు ఉన్న సమయాన్ని గుర్తుచేసుకున్నారు. బంకర్‌లో ఒక రాత్రంతా ఉన్నట్లు చెప్పారు. అలా ఉన్న ఏకైక నటుడిని తానేనని అన్నారు.



“బహుశా ఈ విషయం అందరికీ తెలియకపోవచ్చు. కార్గిల్ యద్ధం గెలిచాక నేను అక్కడికి వెళ్లాను. ఎనిమిది రోజులు వారితో ఉన్నాను. అలా ఉన్న ఏకైక నటుడిని నేనే. లేహ్‌లో దిగాను, అక్కడినుంచి శ్రీనగర్‌కు వెళ్లే రోడ్డులో ఎనిమిది రోజులు ప్రయాణించాను. ప్రతి రెజిమెంట్‌నూ కలిశాను. ఆ ఎనిమిది రోజులు సైనికులను మాత్రమే కలిశాను. వారిని ప్రశంసించడానికి అక్కడికి వెళ్లాను. మాకోసం ఈ యుద్ధం చేసి రక్షించారు. మీకు మేమంతా రుణపడి ఉంటామని చెప్పాను. కానీ, నేను వారితో గడిపిన తర్వాత నాకు ఒక విషయం అర్థమైంది. వారికి నిజంగా ఎలాంటి ప్రోత్సాహం అవసరం లేదు. వారు ఎంత కష్టమైనా భరిస్తూ మనల్ని కాపాడడానికి సిద్ధంగా ఉన్నారు. అలాంటి వారు ఎంతోమందికి స్ఫూర్తి. వారికి మనోధైర్యాన్నివ్వాలని నేను కలిశాను. కానీ, వారే నా మనోధైర్యాన్ని పెంచారు. వారితో ఉన్నన్ని రోజులు కలిసి భోజనం చేశాను. వారి జీవితాల గురించి తెలుసుకున్నాను. ఒక రాత్రి సరిహద్దులోని బంకర్‌లో ఉన్నాను. నాతోపాటు 8 మంది సైనికులు కూడా ఆ బంకర్‌లో ఉన్నారు” అంటూ ఆ రోజులను ఆమిర్ గుర్తుచేసుకున్నారు.

ఇక ప్రస్తుతం ఆమిర్ తన ‘సితారే జమీన్ పర్’ సినిమా విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జూన్ 20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే దీని ప్రీమియర్స్ చూసిన పలువురు ప్రముఖులు ఈ చిత్రంపై ప్రశంసలు కురిపించడంతో దీనిపై ఆసక్తి రెట్టింపైంది.




# సెన్సార్ బోర్డు సభ్యులను కలవనున్న ఆమిర్..

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్‌ఖాన్ సెన్సార్ బోర్డు సభ్యులను కలవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ‘సితారే జమీన్ పర్’ సినిమాకు బోర్డు సూచించిన కట్స్ గురించి వారితో చర్చించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం బాలీవుడ్ ప్రేక్షకుల దృష్టంతా ఆమిర్‌ఖాన్ ‘సితారే జమీన్ పర్’పైనే ఉంది. ఇప్పటికే ప్రీప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం సెన్సార్‌కు వెళ్లింది.

జూన్ 20న ‘సితారే జమీన్ పర్’ ప్రేక్షకుల ముందుకురానుంది. అయితే భారత్‌లో దీనికి సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా బోర్డు దీనికి రెండు సన్నివేశాల్లో కట్స్ సూచించిందని.. దానికి ఆమిర్ అంగీకరించకపోవడంతో సర్టిఫికెట్ రాలేదని సమాచారం. నేడు ఈవిషయంపై సెన్సార్ బోర్డు సభ్యులతో చర్చలు జరపనున్నారని దీంతో ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశముందని బాలీవుడ్ మీడియా పేర్కొంది. ఈ రిపోర్ట్ వచ్చాక టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేయనున్నారు.

ఈ చిత్రం ఓవర్సీస్‌లోనూ విడుదల కానున్న విషయం తెలిసిందే. 2.35 గంటల నిడివి ఉన్న ఈ సినిమాకు యూకే సెన్సార్ బోర్డు ‘12ఏ’ సర్టిఫికెట్‌ను జారీ చేసింది. దీంతో అక్కడ ఈ సినిమా విడుదలకు లైన్ క్లియరైంది. ఆర్.ప్రసన్నకుమార్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఆమిర్‌ఖాన్ , జెనీలియా ప్రధాన పాత్రల్లో నటించారు. బాస్కెట్‌బాల్ కోచ్ అయిన గుల్షన్ (ఆమిర్‌ఖాన్) మానసికంగా సవాళ్లు ఎదుర్కొంటున్న కొంతమందిని ప్లేయర్స్‌గా ఎలా తీర్చిదిద్దారనే కథాంశంతో రూపొందింది.

## ‘కుబేర’... నాకు తల్లి ప్రేమతో సమానం : శేఖర్ కమ్ముల

“నేను నమ్మే సిద్ధాంతాలకీ... చేసే సినిమాలకీ సంబంధం ఉండదు. కానీ శేఖర్ కమ్ముల తన సిద్ధాంతాలకి తగ్గట్టే సినిమాలు తీస్తుంటారు. అందుకు తగ్గట్టే జీవితాన్ని గడుపుతుంటారు. అందుకే ఆయనంటే ఎంతో గౌరవం” అన్నారు ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఆయన ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ‘కుబేర’ విడుదలకి ముందస్తు కార్యక్రమం జరిగింది. ఇదే వేదికపై రాజమౌళి ఈ సినిమా ట్రైలర్‌ని, బిగ్ టికెట్‌ని ఆవిష్కరించారు. ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకొస్తోంది.

# ఎద్దుతో చిరు ఫైట్.. ఆరు వేల కుండలు తెచ్చారట

చిరంజీవి సినిమా వస్తుందంటే ఆయన అభిమానులకు పండగే. 60ఏళ్లు దాటినా ఆయనకున్న క్రేజ్, గ్రేస్ ఏమాత్రం తగ్గలేదు. అభిమానులను అలరించేలా కమర్షియల్ చిత్రాలు చేస్తూనే తనలోని నటుడిని తృప్తి పరిచేలా నటనా ప్రాధాన్యమున్న సినిమాలను కూడా చిరు చేశారు. అయితే, కొన్ని బాక్సాఫీస్ వద్ద విజయం సాధించగా, మరికొన్ని పెద్దగా మెప్పించలేదు. అలాంటి వాటిలో ‘ఆపద్బాంధవుడు’ ఒకటి. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో మీనాక్షి శేషాద్రి కథానాయిక.

ఆర్ట్ సినిమానే అయినా, చిరంజీవి అభిమానుల కోసం ఎద్దుతో ఫైట్ చేసే సీన్‌ను పెట్టారు. ఇందుకోసం చిత్ర నిర్మాణ సంస్థ పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ రూ.50వేలు ఖర్చు పెట్టి ఆరు వేల కుండలను తెప్పించింది. ఫైట్ సీన్ చేయడానికి నాలుగు రోజులు పైనే పట్టగా, పగిలిపోయిన కుండల స్థానంలో ఎప్పటికప్పుడు కొత్త కుండలను పెట్టేవారు. అలా ఫైట్ సీన్ చివరికి వచ్చేసరికి కుండల కటకట



ఏర్పడింది. అప్పటికే మద్రాస్‌లో తయారయ్యే కుండలన్నీ ఆర్ట్ డిపార్ట్‌మెంట్ తీసుకుంది. అదనంగా కుండలు కావాల్సి వస్తాయేమోనని, నాలుగు రోజుల పాటు ఆర్ట్ అసిస్టెంట్‌లు కుండల కోసం మద్రాసు చుట్టు పక్కల గ్రామాలన్నీ తిరుగుతూనే ఉన్నారట.

ఇక ఆపద్బాంధవుడు సినిమా విషయానికొస్తే, 1992 అక్టోబరు 9న విడుదలైన ఈ సినిమా విమర్శకులను మెప్పించింది. చిరంజీవి నటనకు గానూ ఉత్తమ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. ఉత్తమ సంభాషణ రచయితగా జంధ్యాల, ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్‌గా బి.చలం, అరుణ్ బి.గోడ్వంకర్, ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా భూషణ్ లకంద్రికి నంది అవార్డులు దక్కాయి. ప్రస్తుతం చిరంజీవి ‘విశ్వంభర’ ) చేస్తున్నారు. దీంతో పాటు, అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లోనూ ) నటిస్తున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy